అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 9-03-2023

సంపుటి : 09 | సంచిక : 67 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

సమాజ మనస్తత్వాన్ని మార్చాలి



- మానవాళి పురోగతిలో మహిళలను సమాన భాగస్వాములుగా చేయాలి
- సుసంపన్నమైన సమాజ నిర్మాణానికి లింగ అసమానతలు రూపుమాపాలి : మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము శుభాకాంక్షలు

వివరాలు 5లో..

CPIM జన చైతన్య యాత్ర

అదానీ కోసం బయ్యారం ఉక్కు బలి

విభజన హామీలను తొక్కిపెట్టిన కేంద్రం



- ఊసేలేని గిరిజన యూనివర్సిటీ • కలగానే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ..
- అటకెక్కిన ఐటీఐఆర్ • వెనుబడిన జిల్లాలకు మూడేండ్లుగా నిధులు బంద్

అచ్చిన ప్రశాంత్

అదానీ కోసం మోడీ సర్కారు బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని బలిచ్చింది. తమ చెంతకు ఉన్నత చదువుల కోసం కేంద్ర గిరిజన యూనివర్సిటీ రాబోతున్నదని సంబురపడ్డ ఆదివాసీ, గిరిజన బిడ్డల ఆశలపై నీళ్లు చల్లింది. దశాబ్దాల డిమాండ్‌గా ఉన్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కలగానే మిగిల్చింది. ఐటీఐఆర్‌ను రద్దుచేసింది. వెనుబడిన జిల్లాలకు నిధులను మూడేండ్లుగా బంద్ చేసింది. నియోజకవర్గాల పునర్విభజనను అటకెక్కించింది. కాళేశ్వరానికి జాతీయహోదా ఊసేలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కేంద్రంలోని మోడీ సర్కారు బుట్టదాఖలు చేసింది. ఒకవేళ వాటిని అమలు చేసి ఉంటే రాష్ట్రంలో కొత్తగా లక్షలాది మందికి ఉపాధి లభించేది. రాష్ట్రం అభివృద్ధి చెందేది.

ఉక్కు కర్మాగారం ఇకలేనట్టేనా?

బయ్యారంలో ఉక్కుకర్మాగారం ఏర్పాటు లేదంటూ కేంద్రం తేల్చిచెప్పింది. నాణ్యమైన ఇనుప ఖనిజం లేదని మెలికపెట్టి రద్దుచేసింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది ఉపాధికి గండికొట్టింది. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందబోతున్నదని సంతోషపడ్డ అడవిబిడ్డల ఆశలపై నీళ్ళ చల్లింది. 180 కిలోమీటర్ల దూరంలోని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బైలడిల్లా గనుల నుంచి దిగుమతి చేసుకోవాలనీ, దానికయ్యే ఖర్చును భరిస్తామని రాష్ట్ర సర్కారు ప్రత్యామ్నాయం చూపినా ససేమిరా అన్నది. సింగరేణి నుంచి బొగ్గు, కేటీపీఎస్ నుంచి విద్యుత్, మాదారం నుంచి డోలమైట్ ఖనిజంఇస్తామనీ, నీటివనరులను సమకూరుస్తామని భరోసానిచ్చినా కాదుపొమ్మన్నది. తీరా చూస్తే కార్పొరేట్ ఘనుడు అదానీకి చెందిన పోస్కో స్టీల్ ప్లాంట్‌కు బైలడిల్లా గనులను కేటాయించింది. అదానీ కంపెనీ 1800 కిలోమీటర్లు తరలిస్తే రాని నష్టాలు..బయ్యారం ఉక్కు కర్మాగారానికి కేవలం 180 కిలోమీటర్ల నుంచి తరలిస్తే ఎలా వస్తాయో మోడీ సర్కారుకే తెలియాలి.

వెనుకబడిన జిల్లాల నిధుల నిలిపివేత

రాష్ట్ర విభజన చట్టం 94(2) సెక్షన్ ప్రకారం వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం కేంద్రం నిధులు కేటాయించాలి. ఆ జాబితాలో రాష్ట్రంలోని హైదరాబాద్ మినహా మిగతా 9 ఉమ్మడి జిల్లాలను చేర్చారు. ఆ జిల్లాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.450 కోట్ల రూపాయలు కేటాయించాలి. మూడేండ్లకు సంబంధించి రాష్ట్రానికి రూ.1,350 కోట్లు రావాలి. కేంద్రం వాటిని తొక్కిపెట్టింది. ఆ నిధులే అంది ఉంటే ఆయా జిల్లాల్లోనూ ప్రగతి కనిపించేది.

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ఎన్నడో?

ఏపీలోని విజయనగరంలో, మధ్యప్రదేశ్‌లో గిరిజన యూనివర్సీటీలను కేంద్రం ఏర్పాటు చేసింది. ములుగులోనూ వర్సిటీ ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని వేలాది మంది గిరిజన విద్యార్థులకు ఉన్నత చదువులకు మరిన్ని అవకాశాలు దక్కేవి. జాకారంలో వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం 337 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.19 కోట్లను ఖర్చుచేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ములుగు గిరిజన యూనివర్సిటీ ప్రస్తావననే లేవనెత్తట్లేదు.

కాజీ పేటకు కాదన్నారు.. లాతూరుకు ఇచ్చారు..

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉండగా కేంద్రం నో అని చెప్పేసింది. రైల్వే అవసరాలను తీర్చేందుకు ప్రస్తుతమున్న ఫ్యాక్టరీలు సరిపోతాయి కాబట్టి కాజీపేటలో అవసరం లేదని తేల్చింది. దానికి విరుద్ధంగా మహారాష్ట్రలోని లాతూర్‌లో మాత్రం కోచ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. గుజరాత్‌లో దాహెూద్ రైల్వే వర్క్‌షాపును లోకోమోటివ్ ఉత్పత్తి కర్మాగారంగా అప్‌గ్రేడ్ చేసింది. దీనిని బట్టే తెలంగాణ మీద కేంద్రానికి ఎంత వివక్ష ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఐటీఐఆర్ రద్దు.. ఐటీ అభివృద్ధిపై ఎఫెక్ట్

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్(ఐటీఐఆర్) ప్రాజెక్టును రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగా కొనసాగించాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రద్దు చేసింది. ఆ ప్రాజెక్టు వచ్చి ఉంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా అదనంగా ఐదులక్షల మందికి ఉపాధి లభించేది. మరోవైపు కేంద్రం 22 సాఫ్ట్‌వేర్ పార్కులను ఆయా రాష్ట్రాలకు కేటాయించింది. అందులో తెలంగాణ ప్రస్తావనే లేదు.



ఆర్థిక స్వేచ్ఛకు దూరం..

స్వంత సంపాదన ఉన్నా..ఆమెకు సాధికారత లేదు : ఇండియా లెండ్స్ సర్వే

INDIALENDS

- శ్రామిక మహిళల్లో 90 శాతం మంది ఇంటి కోసమే ఖర్చు..

న్యూఢిల్లీ : శ్రామిక మహిళల ఆర్థిక నిర్ణయాల్లో పురుషాధిక్యత బలంగా ఉన్నదని 'ఇండియా లెండ్స్' సర్వే పేర్కొంది. సమాజంలో ఉన్న అడ్డంకులు, సాంప్రదాయాలు దీనికి కారణమని సర్వే అభిప్రాయపడింది. వీటిని ఛేదించి శ్రామిక మహిళా సమాన అవకాశాల్ని అందుకోవాల్సిన సమయం వచ్చిందని తెలిపింది. 90శాతం మంది మహిళలు తమ ఆదాయాల్ని ఇంటి కోసం ఖర్చుచేస్తున్నారని, ఖర్చుల విషయమై నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు 67శాతం మంది భర్త లేదా తండ్రి లేదా సోదరుడిపై ఆధారపడుతున్నారని సర్వేలో తేలింది. తమ ఆదాయంలో 40 నుంచి 50శాతం మొత్తాన్ని ఇంటి కోసం ఖర్చు చేస్తున్నారని సర్వే తెలిపింది. వివిధ నగరాలకు చెందిన శ్రామిక మహిళలతో ...5లో

దయనీయ స్థితిలో భారత ప్రజాస్వామ్యం



ఆవేదన చెందుతూ రాహుల్‌గాంధీతో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త కుమార్తె

- విదేశాల్లో ఉన్నాం..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేదెలా? అని ప్రశ్న

5లో..



ఢిల్లీలో కవిత

లిక్కర్ స్కామ్‌లో ఈడీ సమన్లు

- 11 వ తేదీన తమ ఎదుట హాజరుకావాలంటు ఆదేశాలు
- కలకలం రేపిన ఈడీ నోటీసులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

దేశంలో సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో తాజాగా ఎమ్మెల్సీ కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు తమ ఎదుట హాజరుకావాలంటూ బుధవారం నోటీసులు జారీ చేశారు. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈనెల 11వ తేదీన ...2లో

నేడు క్యాబినెట్ భేటీ

- సొంత జాగాలు, పోడు భూములు,
- గొర్రెల పంపిణీ, దళిత బంధుపైనా చర్చ
- కవిత అంశం,
- గవర్నర్, సీఎస్ వివాదంపైకూడా?

వివరాలు 5లో..



ఆరోగ్య మహిళ షురూ

శ్రీరామనవమి నుంచి గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్

- మహిళా దినోత్సవం వేళ మూడు అద్భుతమైన పథకాలు : మంత్రి హరీశ్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

"మహిళా దినోత్సవం రోజున సీఎం కేసీఆర్ మహిళలకు అందిస్తున్న మరో గొప్ప కానుక ఆరోగ్య మహిళ పథకం.. దీనితోపాటు మహిళలకు వడ్డీలేని రుణాలు సహా ఈ శ్రీరామనవమి నుంచే ...5లో

కేంద్రం చేసింది శూన్యం

తొర్రూరు సభలో మంత్రి కేటీఆర్

- రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసిన మంత్రి



నవతెలంగాణ-తొర్రూరు

కేంద్ర ప్రభుత్వం ఈ ఎనిమిదేండ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలను ఇస్తున్నట్టు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వడ్డీ లేని రుణాల పంపిణీని మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం లోని తొర్రూరులో ప్రారంభించారు. అలాగే, తొర్రూరులో రూ.125 కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తరపున రూ.1550 కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళలకు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రూ.270.70 కోట్ల పంపిణీ జరగగా, రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాల్సిన రూ.1550.62 కోట్ల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

దేశంలో 20 గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇస్తే 19 తెలంగాణ పల్లెలేనని తెలిపారు. సీఎం కేసీఆర్ ముందు చూపు, మంత్రి ఎర్రబెల్లి, ఆయన టీం చేస్తున్న కృషి వల్లనే దేశానికే ఆదర్శంగా రాష్ట్రం నిలిచిందని కొనియాడారు. గ్రామ గ్రామానికి ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్, మొక్కలు పెంపకం, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, రైతు కల్లాలు, శ్మశానవాటికలు ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని పనులు ...2లో

వామ్మో.. వైరల్ ఫ్లూ

ఎక్కడ చూసినా జ్వరపీడితులే..

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు • పిల్లలు, వృద్ధులపైనే అధిక ప్రభావం
- భయపడాల్సిన అవసరం లేదు: నిపుణులు • సొంతవైద్యం వద్దు: డాక్టర్లు

నవతెలంగాణ - మొఫిసిల్ యంత్రాగం

వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. ఎడతెరిపిలేని దగ్గు, జలుబు సహా వారం పాటు వీడకుండా ఉంటున్న జ్వర లక్షణాలు ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కడ చూసినా.. ఎవరిని కదిలించినా ఇదే పరిస్థితి. కరోనా లక్షణాలుగా కనిపిస్తున్నా.. భయపడాల్సిన అవసరం లేదని వైద్యనిపుణులు చెబుతున్నారు. పిల్లలు, వృద్ధుల్లోనే బాధితులు ఎక్కువగా ఉండటంతో ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. దగ్గు ఎక్కువ రోజులు తగ్గడం లేదు. హైదరాబాద్ నగరంలోని ఫీవర్ ఆస్పత్రిలో గత వారం ప్రతిరోజూ 600 నుంచి 800 కేసులు ఇలాంటివి నమోదయ్యాయని ఆస్పత్రి అధికారి శంకర్ చెబుతున్నారు. ఇది వైరల్ ఫ్లూ మాత్రమేనని అన్నారు. స్వైన్ ఫ్లూ కేసులుగా కూడా పరిగణించడానికి వీల్లేదన్నారు. అధికారుల సమాచారం మేరకు రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 400 పైగా కేసులు



నమోదవుతున్నాయని తెలుస్తోంది. ఐసీఎంఆర్ సూచించినట్టు.. బహిరంగ ప్రదేశాల్లో మాస్కు ధరించడం, ఎప్పటికప్పుడూ చేతులను శుభ్రం చేసుకోవడం, మంచి ఆహారం, శుభ్రమైన మంచినీరు తాగాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి పది మందిలో సగం జ్వరపీడితులే ఉన్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో ఒక్కో ఆస్పత్రికి రోజులో పది మంది వచ్చే ఔట్‌పేషెంట్లు ఇప్పుడు వంద మందికిపైగా వస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రులను 'నవతెలంగాణ' సందర్శించగా.. ఎక్కువగా పిల్లల ...5లో

మహిళా సమానత్వం సాకారమయ్యేనా?

ఆడపిల్లగా జన్మించిన నాటి నుండి ఆఖరి శ్వాస దాకా మహిళగా అవతలి వాళ్ళ గురించి పరితపిస్తూ, ఈ మానవ జన్మకు ప్రాణదాతగా సమగ్ర మహోన్నత వ్యక్తిత్వాన్ని చాటుతుంది. అంతటి త్యాగశీలి, సహనశీలి అయిన మహిళా వికాసానికి, సమానత్వానికి తరతరాలుగా వేళ్లానుకున్న పురుషాధిక్య భావజాలం అడుగడుగునా విఘాతం కలిగిస్తూనే ఉంది. అంతటా (ఇంటా బయట) వివక్ష, అకృత్యాలు, దాడులు, హింస పెచ్చరిల్లుతున్నాయి. ప్రభుత్వాలు మహిళా రక్షణ, సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు, పథకాలు అమలు చేసినా మహిళా సమానత్వం కనుచూపుమేరలో కనిపించడం లేదు. ఇటీవల ప్రపంచ ఆర్థిక ఫోరం "జెండర్ గ్యాప్" నివేదికలో మన దేశం135వ స్థానంలో ఉంది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారి నినదించిన "సావిత్రిబాయి ఫూలే" నాటి స్థితిగతుల నుండి మహిళా విముక్తి కాదు కదా! ఇంకా నేటికీ సమానత్వ భావనలు కొల్లబోతున్న సంఘటనలనే చూస్తున్నాం. నిజానికి ఇన్నేళ్లు గడిచినప్పటికీ రాచరిక పాలన అంతరించి ప్రజాపాలనలోకి ప్రవేశించినా సమానత్వం కోసం చేసిన ప్రయత్నాలన్నీ ఆశించినంతగా మెరుగు పడలేదనేది వాస్తవం. ఏదో సంవత్సరానికోసారీ మహిళా దినోత్సవంనాడు "మహిళకు దండేసి-శాలువా కప్పి సత్కరిస్తే" సమానత్వం వచ్చినట్లు కాదు. సమానత్వ సంకల్పం గురించి చెప్పుకుంటూ ఊదరగొట్టే ఉపన్యాసాలు, ఓటు బ్యాంకు పథకాల వల్ల మహిళా సమానత్వం సాధించలేమనడానికి గత కాలపు అనుభవాలే నిదర్శనం. ఏం చేస్తే మహిళా సమానత్వం సాధించవచ్చో వాటిని తు.చ. తప్పక చిత్తశుద్ధితో పాలకులు, సమాజం సంకల్పదీక్షతో అమలు చేయడం కనీస బాధ్యత అనేది మరువరాదు. ఎందుకంటే? సమాన అవకాశాలు పొందడం మహిళల హక్కు. సంపద సృష్టిలో, సేవలో, నాయకత్వంలో ప్రతి చోట కీలక పాత్ర పోషిస్తున్న వారికి పురుషులతో సమానంగా హక్కులు, అవకాశాలు కల్పిస్తే, ప్రపంచం (మనదేశం)లో అన్నింటికన్నా ముఖ్యంగా ఈ సమాజంలో అన్ని రకాల హింస తగ్గుతుంది. శాంతి సామరస్యాలు ఏర్పడతాయి. ప్రపంచమంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటుంది. సహజంగానే మహిళలు తమ గురించి మాత్రమే కాకుండా సమాజంలోని అందరి బాగోగుల గురించి ఆలోచిస్తారు, పరితపిస్తారు. అంతే కాదు నీతి నిజాయితీలతో కూడిన ప్రవర్తన కలిగి ఉంటారు. ఇలాంటి "మహిళల ప్రతిభా శక్తిని" ఇంటి పట్టునే ఉంచేలా చేస్తే ఈ ప్రపంచానికి అభివృద్ధి ఉండదు. మహిళా హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్న దేశాలు. ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్, న్యూజిలాండ్, స్వీడన్, రువాండా దేశాలు సహజంగానే మహిళా సమానత్వంలో ప్రపంచంలోనే అగ్రస్థానాన నిలుస్తున్నాయి. స్త్రీ, పురుష సమానత్వ సాధనలో ఆయా దేశాల ప్రస్థానం, పథక రచన విధానాల నుంచి మన దేశం నేర్వాల్సిన గుణపాఠాలు ఎన్నో ఉన్నాయి. వీటి నుండి చైతన్యం పొందాల్సిన వారు పాలకులు, పౌర సమాజం. ఆ దేశంలో సమానత్వాన్ని రాత్రికి రాత్రే సాధించలేదు. హక్కుల కోసం మహిళలంతా కలిసి ఉమ్మడిగా పోరాడి సాధించుకున్నారు. ఎవరో వస్తారని చూడకుండా వాళ్లకేం కావాలో దానిని నేడు సంప్రదాయంగా మార్చేశారు.



మేకిరి దామోదర్
9573666650

నేడు మన దేశంలో మహిళలు ఆకాశంలో సగం మాత్రమే కాదు, ఇప్పుడు వాళ్లు ఆకాశానికి ఎదగాలి, ఎదగ నివ్వాలి. సమాన హక్కులు, అవకాశాలన్నీ పోరాడి సాధించుకోవాలి. మహిళా స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. మహిళకు అన్ని రంగాల్లో ఆర్థిక, రాజకీయ, వ్యాపార, క్రీడ, ఉద్యోగ, ఉపాధి, సైన్యం, విద్య, వైద్యం తదితర రంగాల్లో సముచిత స్థానం, సమాన అవకాశాలు కల్పిస్తేనే సంపూర్ణ అభివృద్ధి సుసాధ్యమవుతుందని గమనించాలి. భారత రాజ్యాంగం మహిళలకు దన్నుగా నిలిచినా, పాలకులు అమలులో వివక్ష చూపుతున్నారు. చట్టసభల్లో చోటు కల్పించడానికి ఉద్దేశించిన మహిళా బిల్లును 1996లో అంటే 26ఏండ్లు గడిచినా ఆ బిల్లుకు గ్రహణం వీడలేదు. 15వ లోకసభ సమావేశాల ముగింపులో ఈ బిల్లు పురుషాధిక్యత ప్రభావానికిలోనై వీగిపోయింది. ఇందులో అన్ని పార్టీల భాగస్వామ్యం 'తలా పాపం తిలా పిడికెడు' అన్నట్లుగా ఉంది. మన దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు చట్టసభల్లో మహిళా బిల్లుకు కట్టుబడి ఉన్నామని చెప్పే మాటలు ఇన్నేళ్లుగా గాలి మాటలే అవుతున్నాయనేది నిజం కాదా..! ఇది వివక్ష కాదా! ఇంకెన్నేళ్ళు.. మరి ప్రశ్నించాలి కదా? మహిళా లోకం. దేశంలో ఏ మూలన చూసినా ఏ పత్రిక తిరిగేసినా ఏ టీవీ ఛానల్ విన్నా, చూసినా, ఏదో రూపంలో మహిళా వివక్ష కొనసాగుతూనే ఉంది. మహిళా స్వేచ్ఛను హరిస్తూనే ఉన్నారు. ర్యాగింగ్, ఆసిడ్ దాడులు, చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళలపై లైంగిక దాడులు, ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారాయి. మహిళలు సహనాన్ని వీడాలి. ఎన్ని చట్టాలు, ఎన్ని పథకాలు వచ్చినా పోరాటం చేయడం ఒక్కటే హక్కుల సాధనకు సరైన మార్గం అని భావించాలి. ఛాందస కట్టుబాట్లు దాటాలి. కార్య సాధన కోసం కదం తొక్కాలి.



'ఆమె' బతుకంతా బహువెతలే!

మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ప్రగతిని గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా 8 మార్చి రోజున నిర్వహించుకునే 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'లో భాగంగా సాహస సఫల ధీరవనితలను సన్మానించడం సబబే. అంతర్జాతీయంగా లింగ సమానత్వ సాధన, మహిళల హక్కుల పరిరక్షణ, మహిళల ఆత్మగౌరవ సాధన, విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పన, స్వేచ్ఛ రెక్కలు తొడగడం, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడం, నిర్ణయాధికారాలు అప్పగించడం, భ్రూణ హత్యలను కట్టడి చేయడం, లైంగిక దాడులు, హత్యలను నిలువరించడం అనివార్యం. ప్రతిభావంతులైన మహిళలను గుర్తించి ప్రోత్సహించడం, మహిళా కేంద్రంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాల్సిన వేదికగా మహిళా దినోత్సవం నిలుస్తుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2023 నినాదంగా 'డిజిటల్ లింగ సమానత్వ సాధనలో వినూత్న సాంకేతికత (డిజిటల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ)' అనబడే అంశాన్ని తీసుకున్నారు. 1975లో ప్రారంభమైన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, తగు పరిష్కారమార్గాలను చర్చించడంతో పాటు వివిధరంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళామణులను సత్కరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రపంచాన్ని సవాళ్లు చేస్తూ నవ్య ప్రగతిరథం పరుగెడుతుంది. సవాళ్ళను ఎదుర్కొని నిలబడినప్పుడే సకారాత్మక మార్పులకు ఆస్కారం ఉంటుంది. అమ్మ, ఆలి, సోదరి, వదిన, బామ్మ లాంటి ఏ పాత్ర అయినా బేషరతుగా కుటుంబ సంక్షేమానికి అనుక్షణం శ్రమించే నిస్వార్థ జీవి స్త్రీమూర్తి మాత్రమే. అందరికీ అమ్మ కావాలి. ఆలి అనివార్యంగా ఉండాలి, కాని కూతురు వద్దంటోంది నేటి విచిత్ర ప్రపంచం. కూతురు ఓ భారం, కొడుకు ఓ వంశాంకుర దీపం అనే అనాగరిక సమాజంలో మనం ఉన్నాం. భ్రూణ హత్యలు, లైంగిక వేధింపులు, హత్యలు, గృహ హింసలు, బాల్యవివాహాలు లాంటి పలు దురాచారాలను ఎదుర్కొంటున్న మహిళలు మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్రాంతం, దేశం, మతం, కులం, వర్గం, వర్ణం, జాతి, సంప్రదాయం, ఆర్థిక స్థితి, సంస్కృతులను బట్టి మహిళా వివక్ష తీవ్రత మారుతూ వస్తున్నది. విద్యలేక పోయినా అబల చిన్నచూపును భరిస్తూ లింగ వివక్ష వలలో చిక్కుకుపోయిన శ్రమ జీవి ఆమె. లింగ వివక్ష రాజ్యమేలినంత కాలం మహిళా సమాజం సమస్యల నడుమ నలుగుట ఖాయం. మహిళలు ప్రవేశించని రంగంలేదు, స్పృశించని అంశం లేదు. అంతరిక్షంలో విహరించడం, సాగర సరిహద్దుల్లో గస్తీలు తిరగడం, అంతరిక్ష రహస్యాల శోధనలు చేయడం, యుద్ధ క్షేత్రంలో ధీర వనిత, యుద్ధ విమానాలకు దిశ నిర్దేశం చేయడం, అంతర్జాలాన్ని అన్వేషించడం లాంటి విధులను సమర్థవంతంగా నిర్వహించడం ఎరిగిన తెలివిగల మేధావి మహిళ. కొడుకుతో సమానంగా కూతురిని పెంచడం, ఇరువురికీ ఉన్నత విద్యను అందించాల్సిన కనీస బాధ్యత తల్లితండ్రులు మీద ఉంది. భారతదేశంలో అధిక జనాభా, పేదరికం, నిరక్షరాస్యత, పోషకాహారలోపం, అసమానతలు లాంటి తీవ్ర సమస్యల నేపథ్యంలో మహిళలు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇంట్లో మహిళలకు స్వేచ్ఛ, స్వతంత్రం ఉండదు. తల్లితండ్రులు నవజాత శిశు స్థాయి నుంచే అమ్మాయిల పెంపకంలో వివక్షను చూపుతూ విద్యకు, స్వేచ్ఛకు దూరం చేయడం నమ్మలేని నిజం. బాల్యవివాహాల వలలో చిక్కి చిరు ప్రాయంలోనే అమ్మాయిల తల్లులు కావడం, అనారోగ్యాల పాలు కావడం సర్వసాధారణం. ప్రేమ పేరుతో ఆసిడ్ దాడులు, గృహ హింస, ఆర్థిక అసమానత, వరకట్న వేధింపులు, చావులు, గర్భంలో ఆడ పిల్ల ఉందని అని తెలిసి అబార్షన్‌లు (భ్రూణ హత్యలు), బలవంతపు వ్యభిచార వృత్తి లాంటి పలు సమస్యలను భారతీయ మహిళా సమాజం ఎదుర్కొంటున్నది. సమాజంలో సగమైన మహిళలు పార్లమెంట్‌లో 14.5శాతం మాత్రమే ఉన్నారు. ప్రపంచదేశాల లింగ సమానత్వ సూచిక-2022 జాబితాలో ఉన్న 146 దేశాల్లో ఇండియా 135వ స్థానంలో ఉన్నది. మహిళల్లో సెకండరీ విద్య పూర్తి చేసిన మహిళలు 39శాతం (పురుషులు 63.5శాతం) ఉన్నారు. శ్రామిక లోకంలో 27.2శాతం మహిళలు (78.8శాతం పురుషులు) నమోదయ్యారు. ఇలా చూస్తే అన్నింట్లో మహిళ వివక్షకు గురవుతూనే ఉన్నది. ఈ వివక్ష పోవడానికి మహిళలు సంఘటితంగా ఉద్యమించాలి.



డాక్టర్ బుర్రా మధుసూదన్‌రెడ్డి

సెల్: 9949700037

భారత రాజ్యాంగం ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. కుల, మత, లింగ ప్రాంతాల పేరుతో వివక్ష నిషేధం అని 14, 15 అధికరణాలు చెప్తున్నాయి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన పాలకులు రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్నారు. మహిళా సాధికారిక కనుచూపుమేరలో కనిపించటంలేదు. చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళల సంఖ్యపై కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన గణాంకాలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి. లోక్‌సభలో 14.94శాతం, ఇటీవల జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో 8.2శాతం మంది మహిళలు శాసనసభకు ఎన్నికయ్యారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఒకే ఒక మహిళ గెలుపొందింది. దేశ వ్యాప్తంగా అసెంబ్లీల్లో 8శాతం మాత్రమే మహిళలు. 17వ లోక్‌సభలో మహిళలు14.9 శాతం మాత్రమే. బిల్లు కనుక చట్టరూపం దాల్చితే లోక్‌సభలో మహిళా సభ్యులు 181కి పెరుగుతారు.

అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకొనే అంతవరకే పరిమితం కావాలనే మనువాద సిద్ధాంతకర్తల పాలనలో బిల్లుకి మోక్షం కలగదు. పైగా తమ రాజకీయ గుత్తాధిపత్యానికి బీటలు పడతాయనే భయం పాలక వర్గ రాజకీయ పార్టీలలో ఉంది. అనేక ప్రజా వ్యతిరేక బిల్లులు ఒంటి చేతితో ఆమోదింప చేసుకునే పాలక పార్టీలు మహిళా బిల్లును మాత్రం ఏకాభిప్రాయం పేరుతో సంవత్సరాల తరబడి పక్కన పెడుతున్నాయి.

రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లు గత 12ఏండ్లుగా పార్లమెంట్‌లో భద్రంగా ఉంచ బడినది. మనకన్నా వెనుకబడిన రువాండా, టాంజానియా, ఉగాండా, ట్యునీషియా, దక్షిణ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాలే కాదు. మన పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల చట్టసభల్లో మనకన్నా మహిళల సంఖ్య మెరుగ్గా ఉంది. దేశ జనాభాలో సగభాగం మహిళలు ఆ మేరకు రాజకీయ రంగంతో సహా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. కానీ చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లకు ఉద్దేశించిన బిల్లునే గట్టెక్కించలేక మూలనపడేసిన ఘనత మన నాయకులది. మహిళలు సాధికారిత సాధించారని ఎవరెన్ని ముచ్చట్లు చెప్పినా వాస్తవ పరిస్థితులు అవహాస్యం చేస్తున్నాయి. ఉన్నత పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, ఒకరిద్దరు మంత్రులను చూపించి మహిళలందరూ సాధికారిత సాధించారని ప్రచారం చేస్తున్నారు. మహిళలు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఓటుహక్కు సాధించుకున్నారు. 1962 నుండి 2014 వరకు పాలనలో మహిళా ఓట్ల శాతం పెరుగుతూ వచ్చింది. పాలనలో మహిళల భాగస్వామ్యం కొరకు జరిగిన ఉద్యమాల ఫలితంగా 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన రిజర్వేషన్లను వినియోగించుకొని స్థానిక సంస్థల్లో మహిళలు లక్షల మంది పాలన సాగిస్తున్నారు. ఎన్నికైన మహిళా ప్రతినిధులను పక్కన పెట్టి వారికి స్థానంలో భర్త లేదా కుటుంబ సభ్యులే అన్ని వ్యవహారాలు నడుపుతున్నారు.

'మహిళా' బిల్లుకు మోక్షమేది?



మన దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు దశాబ్దాలుగా తెరమరుగున పడింది. సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో 1/3 వంతు రిజర్వేషన్లు కల్పించాలని మహిళా సంఘాలు సుదీర్ఘ కాలంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. 1996లో లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నానా రభస జరిగింది. మహిళా రిజర్వేషన్ వలన కుటుంబ జీవనం, సామాజిక సంబంధాలు దెబ్బతింటాయని బీజేపీ అభ్యంతరం ప్రకటించింది. వామపక్షాలు మినహా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ పార్టీలకు ఏకాభిప్రాయంలేదని బిల్లు సెలక్ట్ కమిటీకి పంపబడింది. గీతా ముఖర్జీ నాయకత్వాన ఏర్పడిన పార్లమెంటరీ సెలక్ట్ కమిటి ఏకగ్రీవంగా యథాతథంగా బిల్లును ఆమోదించమని తెలిపింది. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ మహిళా బిల్లు ప్రస్తావనే లేదు. విశ్వ గురువుగా కీర్తి ప్రతిష్టలు అందుకుంటున్న మోడీ మహిళా బిల్లు గురించి ఒక్క మాట కూడా మాట్లాడంలేదు. లోక్‌సభలో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఉన్నాయి. చట్టసభల్లో ఓబీసీలకు రాజ్యాంగం ఎటువంటి రిజర్వేషన్లు కల్పించలేదు. ఈ అంశంపైన పార్లమెంట్‌లో విడిగా చర్చను చేపట్టాలి. పార్లమెంట్‌లో చర్చ జరగనీయకుండా మహిళా బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మాత్రం లొల్లి చేస్తున్నారు.

మన స్వార్థ రాజకీయ పార్టీలు అన్ని కూడా చట్టసభల్లో 1/3వ వంతు మహిళా రిజర్వేషన్ చట్టం చేస్తామని ఎన్నికల ప్రణాళికలలో, ఎన్నికల ప్రచారంలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వాగ్దానాలు చేస్తుంటాయి. ఓట్ల కోసం, రాజకీయ సభల కోసం మహిళలను ఉపయోగించుకుంటున్నాయి. పార్టీలో పదవులు, ఎన్నికల్లో సీట్లు ఇవ్వటంలో వెనుక అడుగు వేస్తున్నవి. సంవత్సరాలు గడిచినా రిజర్వేషన్ ఊసే ఎత్తటం లేదు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగితే శాసనాలు రూపొందించడంలో, ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషించే వీలు ఉంటుంది. మహిళలు వంటింటికి, పిల్లల్ని కని పెంచటానికి, కుటుంబ ఆలనా పాలనా బాధ్యత వహించాలని

మహిళా బిల్లుపై జరుగుతున్న చర్చల ప్రక్రియ మహిళల సమానత్వానికి, మహిళాభివృద్ధికి ఆటంకాలుగా ఉన్న ఫ్యూడల్ సంస్కృతికి అద్దం పడుతున్నది. నిర్ణయాధికారాల్లో సమాన భాగస్వామ్యం కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం. పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ ఉన్న బీజేపీ మహిళా బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టకుండా తొక్కిపెడుతోంది. బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదానికి పెట్టకుండా ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ పబ్బం గడుపుతున్న పార్టీలకు మహిళలు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి.

- దండంరాజు రాంచందర్ రావు
సెల్: 9849592958

కేంద్రం చేసింది శూన్యం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల్లో జరుగుతున్నాయన్నారు. ఎర్రటి ఎండల్లోనూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చల్లని నీటిని పంటలకు వస్తున్నాయని, దాంతో రైతులు పంటకు పెడుతున్న పెట్టుబడి తిరిగి సంపాదించుకుంటున్నారని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గ నేతన్నలు పొట్ట చేత పట్టుకుని భీవండి, సూరత్, బొంబాయిలకు పోతున్నారని, వారిని ఆదుకునేందుకు కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్‌కు 20 ఎకరాల స్థలం కేటాయిస్తూ ఇక్కడి నుంచే జీవో ఇస్తున్నట్టు తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రప్రభుత్వం ప్రజల సమస్యలను తీర్చేందుకు ఎన్నో పనులు చేస్తోందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను సైతం అమలుచేయడం లేదని ఆరోపించారు. జన్ ధన్ ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పి చెప్పి ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదని వాపోయారు. ప్రజా సమస్యలను పక్కకు పెట్టి మత విద్వేషాలు, విషాలుచిమ్మి ప్రజలను విడగొట్టి, రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చి, కుట్ర పూరితంగా పరిపాలన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. పలు అభివృద్ధి పనులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. మంత్రి కేటీఆర్ చొరవతో సీఎం కేసీఆర్ కృషితోనే ఇవన్నీ సాధ్యమయ్యాయన్నారు. వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ద్వారా మహిళా దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డలకు తెలంగాణ ప్రభుత్వం గొప్ప కానుక ఇచ్చిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వం ఇప్పటివరకు వడ్డీలేని రుణాలుగా అర్హత కలిగిన 3,85,082 సంఘాలకు రూ.2,561.77 కోట్లు విడుదల చేసిందని వివరించారు. ఇంత పెద్ద ఎత్తున నిధులను డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రాష్ట్రం దేశంలో లేదన్నారు. కార్యక్రమంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు పసునూరి దయాకర్, మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, తక్కెళ్ళపల్లి రవిందర్‌రావు, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, శంకర్ నాయక్, నన్నపనేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు వాసుదేవరెడ్డి, నాగూర్ల వెంకన్న, సతీశ్ రెడ్డి, జెడ్పీచైర్మెన్లు పాగాల సంపత్ రెడ్డి, సుధీర్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, కలెక్టర్ శశాంక, వివిధ శాఖల అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

డిల్లీ మెట్రో, టెక్నోగ్లోబ్ మధ్య వివాదానికి మధ్యవర్తిగా

- మాజీ సీజేఐ జస్టిస్ ఎన్‌వి రమణ

న్యూఢిల్లీ : ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ లిమిటెడ్ (డీఎంఆర్సీ), అరవింద్ టెక్నో గ్లోబ్ (జేవీ) మధ్య నిర్మాణ ఒప్పంద వివాదాలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు మధ్యవర్తిత్వాన్ని సూచించింది. న్యాయనిర్ణేతగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి రమణను ఏకైక మధ్యవర్తిగా నియమించింది. రెండు పార్టీల మధ్య వివాదాలపై జస్టిస్ చంద్రధరి సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతున్నది.

త్రిపుర ముఖ్యమంత్రిగా మాణిక్ సాహా ప్రమాణస్వీకారం

అగర్తల : త్రిపుర ముఖ్యమంత్రిగా మాణిక్ సాహా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అగర్తలలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహాతో కలిసి 8 మంది మంత్రులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ జె.పి. నడ్డాలతో పాటు అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మలు హాజరయ్యారు. వీరితో పాటు అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, సిక్కిం ముఖ్యమంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో ఓటమి పాలైన బీజేపీ మిత్రపక్షమైన ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) నుంచి సుక్లా చరణ్ నొటియా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం బీజేపీ పాల్పడిన హింసాకాండకు నిరసనగా ప్రతిపక్ష సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లు ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు ప్రకటించాయి.

ఢిల్లీలో కవిత

(మొదటిపేజీ తరువాయి)

రావాలని ఈ నోటీసులో పేర్కొన్నారు. అంతకు ముందు ఉదయం జారీ చేసిన నోటీసులో గురువారం 9వ తేదీన ఢిల్లీలో జరిగే విచారణకు రావాలంటూ ఈడీ తన నోటీసులో పేర్కొంది. అయితే తాను ముందుగా నిర్ణయించుకున్న ఆయా కార్యక్రమాల వలన ఆ రోజు తాను రావడం కుదరదనీ, 15వ తేదీన హాజరవుతానని చెబుతూ కవిత ఈడీ అధికారులకు లేఖ రాశారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తూ 10వ తేదీన జాగృతి ఆధ్వర్యాన ఒక రోజు ధర్నా కార్యక్రమాన్ని గతంలోనే నిర్ణయించడం జరిగిందనీ, ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవాల్సిన ఉన్న కారణంగా తాను 9వ తేదీన విచారణకు హాజరుకాలేనని ఆమె తన లేఖలో తెలిపినట్టు సమాచారం. అయితే కవిత రాసిన లేఖపై వెంటనే ఈడీ నుంచి సమాచారం అందకపోవడంతో బీఆర్ఎస్ వర్గాలలో కొంత ఉత్కంఠ, సందిగ్ధత ఏర్పడింది. కాగా సాయంత్రం నాలుగు గంటల వరకు కూడా ఈడీ నుంచి కవిత లేఖపై ఎలాంటి స్పందన లేక పోవడంతో కవిత తన ఢిల్లీ ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మొదట ప్రగతిభవన్‌కు వెళ్లి తండ్రి కేసీఆర్‌ను కలిసి సంప్రదిస్తారని అందరు భావించారు. కాని ఆమె ఫోన్‌లోనే సీఎంతో మాట్లాడి నేరుగా శంషాబాద్ ఏయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లారు. అయితే ఢిల్లీకి వెళ్లి తాను నిర్ణయించుకున్న జాగృతి ధర్నాలో పాల్గొనాలనీ, ఈడీ నోటీసుకు సంబంధించి న్యాయపోరాటం చేద్దామని కూతురు కవితకు సీఎం కేసీఆర్ అభయం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఏయిర్‌పోర్టుకు చేరుకున్న కవిత సాయంత్రం విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అనంతరం ఏడుగంటల ప్రాంతంలో ఆమె ఢిల్లీకి చేరుకోగా అక్కడి జాగృతి కార్యకర్తలు కవితకు ఘనంగా స్వాగతం పలికారు. ఇదిలావుండగా రాత్రి ఏడున్నర గంటల సమయంలో కవిత రాసిన లేఖకు ఈడీ స్పందించినట్టు సమాచారం. ఆమె చేసుకున్న విజ్ఞప్తిని మన్నించి 11వ తేదీన ఉదయం పది గంటలకు తమ ఎదుట విచారణకు హాజరుకావాలని ఈడీ తాజాగా నోటీసులో పేర్కొన్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన అరుణ్ రామచంద్ర పిళ్లై కోర్టులో హాజరుపరిచినప్పుడు ఈడీ తమ రిమాండ్ రిపోర్టులో పిళ్లైను ఈ స్కామ్‌లో కవితకు బినామీగా పేర్కొన్నది. ముఖ్యంగా లిక్కర్ పాలసీ నిర్ణయంతో పాటు ఇతర వ్యవహారాలలో కవిత చెప్పినట్టుగానే తాను నడుచుకున్నట్టు రామచంద్ర పిళ్లై ఈడీ అధికారుల విచారణలో వెల్లడించినట్టు రిపోర్టులో ఈడీ పేర్కొంది. ఇది వరకు అరెస్టయిన అభిషేక్ బోయిన్‌పల్లి , సమీర్ మహేంద్రులు గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లలో సైతం కవిత పేరును ప్రస్తావించినట్టు ఈడీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా తాజాగా రామచంద్ర పిళ్లై ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే తాజాగా కవితను విచారణకు పిలిచారని తెలుస్తోంది. కాగా గతంలో పిళ్లైను ఈడీ అధికారులు ఈ కేసుకు సంబంధించి 29 సార్లు విచారించిన తర్వాత అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈనెల 13వ తేదీ వరకు పిళ్లైను విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఈడీ అధికారులు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పిళ్లైను , కవితను ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించడానికే ఈడీ అధికారులు నోటీసులను ఆమెకు జారీ చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే ఈ స్కామ్‌లో ఇప్పటి వరకు ఈడీ అధికారులు కవితకు సంబంధించి సేకరించిన ఆధారాలను బట్టి కూడా కవితను విచారించే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న కవిత 11వ తేదీ వరకు అక్కడే ఉండి ఈడీ విచారణకు హాజరయ్యే అవకాశాలున్నాయని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి.

ఢిల్లీకి చేరిన కవిత

ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా సీఎం కేసీఆర్ అధికార నివాసానికి వెళ్లారు. కవితతో మాట్లాడేందుకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు బయట మీడియా ప్రతినిధులు ప్రయత్నించగా, ఆమె వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. ఈ నెల 13 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు తీసుకురావాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. జనాభాలో సగం ఉన్న మహిళలకు రిజర్వేషన్‌ను కచ్చితంగా వర్తింపజేయాలని కవిత కోరుతున్నారు. పార్లమెంటులో మూడు రైతు వ్యతిరేక చట్టాలను ఆమోదించిన బీజేపీ సర్కారు, మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు పట్టించుకోవడం లేదని కవిత ప్రశ్నిస్తున్న విషయమూ విదితమే. తెలంగాణ సహా 21 రాష్ట్రాలు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాయనీ, బీజేపీ పాలిత యూపీలో మాత్రం 33 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని కవిత విమర్శించారు.

బీవోబీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- మహిళా ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఒలంపియాన్, అర్జున్ అవార్డు గ్రహిత జె.జె శోభ హాజరయ్యారు. తెలంగాణ సౌత్ రీజినల్ మేనేజర్ టీవీవీఎస్ శర్మతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేశారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జె.జె శోభ మాట్లాడుతూ.. ఆ కాలంలో మహిళలు ఎక్కువగా ఇండ్లకే పరిమితం కావడంతోపాటు వారిపై ఆంక్షలు ఉండేవని, ఈతరం మహిళాలోకం ఉన్నత శిఖరాలను చేరుకోవడం హర్షించదగ్గ పరిణామమని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తుండటం సంతోషమన్నారు. కష్టపడితే ఫలితం కచ్చితంగా లభిస్తుందని చెప్పడానికి తన జీవితమే నిదర్శనమని చెప్పారు. కర్నాటకలోని ఓ సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన తాను ఎంతో కష్టపడి క్రీడల్లో రాణించి అర్జున్ అవార్డుతోపాటు ఎన్నో కీలక అవార్డులు సాధించడమే కాకుండా.. మంచి ఉద్యోగంలో కొనసాగుతున్నానని చెప్పారు. గృహిణిగా బాధ్యతల్ని నెరవేరుస్తూనే బీవోబీలో మహిళా ఉద్యోగినులు సమర్థవంతంగా విధులు నిర్వహించడం అభినంద నీయమని తెలిపారు. అలాగే ప్రతిరోజూ అరగంట పాటు వ్యాయామానికి సమయం కేటా యించేలా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సౌత్ రీజినల్ మేనేజర్ టీవీవీఎస్ శర్మ మాటా_డుతూ.. దేశంలో వేల సంవత్సరాలుగా స్త్రీలను పూజించడం, గౌరవించడం జరుగుతోంద'న్నారు. ప్రస్తుతం దేశ రాష్ట్రపతి, ఆర్థిక మంత్రి మహిళలే కావడంతోపాటు తమ బ్యాంకు బ్రాండ్ అంబాసిడర్‌గా మహిళలే కొనసాగుతుండటం గర్వంగా ఉందన్నారు. తమ సంస్థలో మహిళా ఉద్యోగినులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని, వారికి నచ్చిన చోట పనిచేసే అవకాశం కల్పించడంతో పాటు మెటర్నిటీ లీవ్స్, ప్రెగ్నెన్సీ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అవకాశం ఇస్తున్నామన్నారు. వారి కోసం బ్యాంకు తరఫున ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం జె.జె. శోభకు బ్యాంకు తరపున మెమెంటో అందజేశారు. అలాగే, బ్యాంకు విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన మహిళా ఉద్యోగులకు సర్టిఫికెట్స్ అందజేశారు. వివిధ పోటీల్లో రాణించిన ఉద్యోగినులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ రమేష్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ భవాని, సీనియర్ మేనేజర్ మేరి సునంద, వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగినులు తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి

- సీఎం కేసీఆర్ కల్పించుకోవాలని వేడుకోలు
- మంత్రులు సబిత, వేములకు ఉపాధ్యాయ దంపతుల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 13 జిల్లాల్లో ఎస్జీటీ, లాంగ్వేజ్ పండితులు, పీఈటీలతోపాటు మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలను చేపట్టాలని స్పౌజ్ ఫోరం డిమాండ్ చేసింది. 14 నెలలుగా ఉపాధ్యాయ దంపతులు నరకం అనుభవిస్తున్నారని తెలిపింది. బాధితుల్లో 80 శాతం వరకు మహిళా ఉపాధ్యాయునిలే ఉన్నారని పేర్కొంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కల్పించుకోవాలని పలువురు బాధితులు వేడుకుంటున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మహిళల ఆవేదన తీర్చండి, స్పౌజ్ దంపతులను కలపండి'అంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. 'నాన్న అటు, అమ్మ ఇటు, పిల్లలు ఎటు'అంటూ చిన్నపిల్లలు ఫ్లకార్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం సింగిల్‌విండో

లింగభేదం వద్దు... పిల్లల్ని సమానంగా చూడండి

- వీ-హబ్ మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి కేటీఆర్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం సింగిల్‌విండో విధానాన్ని ప్రత్యేకంగా తీసుకురానున్నట్టు పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. అవకాశాలు కల్పిస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని చెప్పారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన 'వి-హబ్' 5వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లింగభేదం లేకుండా ఆడ, మగ పిల్లల్ని సమ దృష్టితో తల్లిదండ్రులు చూడాలన్నారు. తమ ఇంట్లో తన సోదరినీ, తనను అలాగే పెంచారనీ, తాను కూడా తన పిల్లల్ని అలాగే చూస్తున్నానని చెప్పారు. యువతరం ఎక్కువగా ఇంజినీర్, డాక్టర్, లాయర్ అవ్వాలని ఇంట్లో చెప్తారని, వ్యాపారవేత్తలు కావాలని ఎందుకు ప్రోత్సహించరని ప్రశ్నించారు. మానవ వనరులు, సాంకేతికతను వినియోగించుకుంటే అభివద్ధి సాధ్యమవుతుందన్నారు. దాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. వి-హబ్‌కు రూ.1.30కోట్లు ఇస్తే ఓ స్టార్టప్‌తో దాన్ని రూ.70కోట్లకు పెంచారని ప్రసంసించారు. మహిళలు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో ముందుకెళ్తారనీ, అందువల్ల వారు ఏ రంగంలోనైనా రాణించగలరని అన్నారు. అమ్మాయిలు, అబ్బాయిలను సమానంగా చూసే అలవాటు మన ఇండ్ల నుంచే ప్రారంభం కావాలని ఆకాంక్షించారు.

తన తల్లిదండ్రులు తనను, చెల్లిని బాగా చదివించారనీ, తనకంటే ముందు తన సోదరి యూఎస్ వెళ్తానంటే పంపించారని తెలిపారు. పిల్లల పెంపకం అలాగే జరగాలని, వాళ్లు ఏరంగంలో ఆసక్తి కనబరిస్తే అటువైపే ప్రోత్సహించాలని చెప్పారు. కిందపడితే మేం ఉంటామనే ధైర్యాన్ని, నమ్మకాన్ని అమ్మాయిలైనా, అబ్బాయిలకైనా కల్పిస్తే కచ్చితంగా అభివద్ధి సాధిస్తారని తెలిపారు.

రైతుల దీక్షతో దిగొచ్చిన ఉన్నతాధికారులు

5 రోజులపాటు సాగర్ నీరు విడుదలకు హామీ : దీక్షకు మద్దతు తెలిపిన రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్

నవతెలంగాణ - బోనకల్

సాగర్ నీటి కోసం రైతులు చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షకు నీటిపారుదల శాఖ జిల్లా ఉన్నతాధికారులు దిగివచ్చారు. నీటిపారుదల శాఖ సీఈ శంకర్ నాయక్ హామీతో నిరాహార దీక్షను విరమించారు. నీటిపారుదుల శాఖ ఈఈ చింతల రామకృష్ణ, బోనకల్ సబ్ డివిజన్ డీఈ వల్లపు నాగ బ్రహ్మయ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు రైతులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని చివరి ఆయకట్టుగా ఉన్న ఆళ్లపాడు మైనర్ కింద సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆళ్లపాడు, గోవిందాపురం(ఏ) గ్రామాల సర్పంచులు మర్రి తిరుపతిరావు, భాగం శ్రీనివాసరావు ఆయా గ్రామాల రైతులు మంగళవారం 24 గంటలు నిరాహారదీక్షకు దిగారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో సాగర్ నీటి విషయంపై ఉన్నతాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సాగర్ నీటి కోసం రైతుల చేపట్టిన నిరాహార దీక్ష విషయం చర్చకు వచ్చింది. రైతు బంధు బోనకల్ మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్‌రావు నిరాహార దీక్ష విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించారు. నిరాహారదీక్ష శిబిరానికి ఈఈ చింతల రామకృష్ణ, వేమూరి ప్రసాదరావును జిల్లా ఉన్నతాధికారులు పంపించారు. మూడు రోజులపాటు ఏకధాటిగా సాగర్ నీటిని విడుదల చేస్తామని సీఈ శంకర్ నాయక్ హామీ ఇచ్చారని, ఈ విషయాన్ని నిరాహార దీక్షలో ఉన్న దీక్షాపరులకు వివరించాలని తమను పంపించినట్టు రామకృష్ణ తెలిపారు. అందుకు రైతులు అంగీకరించలేదు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు సీఈ శంకర్‌నాయక్‌కు ఫోన్ చేసి సమస్య తీవ్రంగా ఉందని, స్పష్టమైన హామీ ఇస్తేనే రైతులు దీక్ష విరమిస్తారని స్పష్టం చేశారు. ఐదు రోజులపాటు ఇస్తేనే ఎండిపోతున్న మొక్కజొన్న పంటకు జీవం పోసినవారు అవుతారని పోతినేని సుదర్శన్ రావు ఆయనకు స్పష్టం చేశారు. దాంతో శంకరనాయక్ స్పందిస్తూ తప్పనిసరిగా ఐదు రోజులపాటు నీటిని విడుదల చేస్తామని రైతుల సమక్షంలో హామీ ఇవ్వడంతో నిరాహార దీక్షను విరమించారు.



మహిళా జర్నలిస్టులకు డీజీపీ అభినందనలు



నవతెలంగాణ- హైదరాబాద్

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన పలువురు మహిళా జర్నలిస్టులను డీజీపీ అంజనీ కుమార్ అభినందించారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం డీజీపీ కార్యాలయంలో ఆయన మహిళా జర్నలిస్టులతో భేటీ అయ్యారు. అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్ జైన్, విజయ్ కుమార్, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, తరుణ్ జోషి, డీఐజీ రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో ఇటీవల మహిళల నియామకాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. పురుష పోలీస్ అధికారులతో పోటీపడి విధులు నిర్వర్తిస్తున్న మహిళా పోలీస్ అధికారులు అందిస్తున్న ఉత్తమ సేవలను మీడియా ద్వారా ప్రాచుర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు, జర్నలిజంలో మహిళా జర్నలిస్టుల వర్కింగ్ విధానాలు, జెండర్ ఈక్వాలిటీ, వేధింపుల నిరోధానికి ఉన్న అంతర్గత కమిటీల పనితీరు తదితర అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ చేపట్టిన చర్యలను తెలియజేసే కాఫీ టేబుల్ బుక్‌ను జర్నలిస్టులకు డీజీపీ అంజనీకుమార్ బహూకరించారు.

టీఆర్టీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్
- విద్యాశాఖ కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖ కార్యాలయాన్ని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు బుధవారం ముట్టడించారు. రాష్ట్రంలో 15 వేల ఉపాధ్యాయ ఖాళీలకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చి త్వరగా టీఆర్టీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. వాటితో సంబంధం లేకుండా వెంటనే 15 వేల ఉపాధ్యాయ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చి టీఆర్టీ నోటిఫికేషన్‌ను తక్షణమే జారీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడకపోవడంతో నాలుగు లక్షల మంది ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని చెప్పారు. గతేడాది జూన్ 12న టెట్ నిర్వహించి 10 నెలలు గడిచిపోయిందన్నారు. ఇప్పటి వరకు టీఆర్టీ నోటిఫికేషన్ ఊసేలేదని అన్నారు. అక్రమ స్పౌజ్ పోస్టులు రద్దు చేసి ఆ ఖాళీలను టీఆర్టీ నోటిఫికేషన్‌లో కలపాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు లింగయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామంటూ ఆయన హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీను నాయక్, నాయకులు భాను, ఇర్ఫాన్, హరీష్, నరేష్, కోటేష్, చంద్రశేఖర్ రెడ్డి, సునిత, స్వప్న, నవ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలి

- తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ నిర్మల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రెటరీ జనరల్ జి నిర్మల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులపై పనిప్రదేశాల్లో వేధింపులను అరికట్టాలని కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో చట్టసభల్లో తప్పకుండా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేస్తున్న దీక్షకు సంఘం పక్షాన పూర్తి మద్దతు ప్రకటించారు. శశి శ్రీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు సమాజానికి ఎంతో చేటు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు చిలగాని సంపత్ కుమార స్వామి, కోశాధికారి గడ్డం బాలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కనకరాజు, ఆ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ సిహెచ్ రేణుకా దేవి, గ్రేటర్ అధ్యక్షులు కొంకటి మల్లేష్, గౌతం సత్యానంద చారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం మంత్రి సత్యవతి రాథోడ్

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వివిధ రంగాల్లో నిష్ణాతులైన 27 మంది మహిళలకు రాష్ట్రస్థాయి అవార్డులు



నవతెలంగాణ -హనుమకొండ

రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని గిరిజన, స్త్రీ శిశుశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్ ఆడిటోరియంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంను అట్టహాసంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లాలో 5 ఆరోగ్య మహిళా క్లినిక్‌లతో పాటు కాకతీయ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి భారతి హెూళీ, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి మంత్రి సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరీక్షల కోసం వచ్చిన మహిళలతో వారి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన రుద్రమదేవి ఏలిన ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం అదృష్టమన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు పోతున్నారని, దృఢ సంకల్పంతో రాజకీయాల్లో, విద్యా ఉద్యోగ రంగాల్లో ముందుకు వస్తున్నారన్నారు. అంతేస్థాయిలో సమాజంలో అనేక ఆటుపోట్లనూ ఎదుర్కొంటున్నారని, సమాజంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆరోగ్య లక్ష్మి పథకాన్ని రాష్ట్రంలోని 1200 సెంటర్లలో నిర్వహిస్తున్నామని, రూ.250 కోట్లతో న్యూట్రిషన్ కిట్స్ అందిస్తున్నామని చెప్పారు. మాతా శిశు మరణాలు గణనీయంగా తగ్గిపోయాయని గతంలో 60 శాతం ఉంటే ప్రస్తుతం 27 శాతానికి తగ్గిపోయిందని అన్నారు. బీపీ, షుగర్, రక్తహీనత పరీక్షలతోపాటు ప్రతి మహిళ క్యాన్సర్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐదు పీహెచ్‌సీల్లోని ఈ క్లినిక్‌లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకు పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో రూ.20కోట్లతో వచ్చే సంవత్సరం నాటికి రెండు పెద్ద భవనాలు నిర్మిస్తామని తెలిపారు. ప్రీతి ఆత్మహత్య దురదృష్టకరమైన సంఘటనని, విద్యార్థులు ధైర్యంగా సమస్యను ఎదుర్కోవాలని, అధైర్యంతో ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన నిష్ణాతులైన 27మంది మహిళలను మంత్రి సత్కరించి రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

కార్యక్రమాల్లో మంత్రి వెంట ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్, శాసనమండలి ఉప సభాపతి డాక్టర్ బండ ప్రకాష్, హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మెన్ డాక్టర్ సుధీర్, మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బిందు, భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, రాష్ట్ర సంగీత అకాడమీ చైర్మెన్ దీప్తి రెడ్డి, కమిషనర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఎంహెచ్ఓ బి సాంబశివరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమా శ్రీ, రాష్ట్ర పరిశీలకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓటు హక్కు కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. బుధవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో రీజనల్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) అనిల్ కుమార్ సాహుకు వినతిపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు అందజేశారు. సింగరేణిలో ఉత్పత్తితో సహా అన్ని విభాగాలలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని సాహు దృష్టికి తీసుకెళ్లారు. వారికి ఓటు హక్కు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 13న జరిగే కార్మిక సంఘాల సమావేశానికి సింగరేణిలోని కాంట్రాక్టు కార్మిక సంఘాలను కూడా పిలవాలని కోరారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీజీబీకేఎస్), ఏటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్ తదితర పర్మినెంట్ కార్మిక సంఘాల నాయకులు కూడా కాంట్రాక్టు కార్మికులకు ఓటు హక్కు కల్పించే అంశంపై తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న జరిగే సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల ఓటు హక్కు కోసం మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి టీఎస్‌పీటీఏ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజక వర్గ ఎన్నికల్లో పావన్నగారి మాణిక్‌రె డ్డికి టీఎస్‌పీటీఏ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల ప్రయోజ నాలు తాకట్టు పెడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, వారి సమస్యలను ప్రశ్నించే ధైర్యం, తెగువ ఉన్న వ్యక్తిగా మాణిక్‌రెడ్డిని గుర్తించి మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ఎన్నికలు నిర్వహించే ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న టీఎస్‌పీటీఏ శ్రేణులు, అభిమానులు, సమస్యలు పరిష్కారం కావాలని కోరుకునే ఉపాధ్యాయులు మాణిక్‌రెడ్డి ని గెలిపించడానికి కృషి చేయాలనీ, ప్రచారంలో పాల్గొనాలనీ వారు కోరారు.


మహిళలపై లైంగికదాడులకు నిరసనగా షర్మిల మౌనదీక్ష..అరెస్టు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుమార్తె కవితకు తప్ప మహిళలకు రక్షణ లేదని వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఈమేరకు హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని రాణిరుద్రమదేవి విగ్రహం వద్ద మౌన దీక్ష చేట్టారు. ఈ సందర్భంగా పోలీసులకు షర్మిలకు వాగ్వాదం చోటుచేసుకుంది. షర్మిలను అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కవిత ఆడపిల్లై ఉండి సిగ్గులేకుండా లిక్కర్ స్కామ్ చేశారని ఆరోపించారు. బతుకమ్మ ముసుగులో కవిత లిక్కర్ స్కాంకు పాల్పడ్డారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో మహిళలకు రిజర్వేషన్ ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణలో విద్యార్థినిలకు బాత్ రూమ్‌లు కూడా లేవన్నారు. ఎక్కడ మహిళ గౌరవించబడుతుందో అక్కడే అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. మహిళ భద్రతపై ప్రభుత్వం గొప్పలు చెబుతున్నదనీ, మహిళలపై అత్యాచారాల విషయంలో దక్షిణ భారతదేశం లోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు. బంగారు తెలంగాణలో మద్యం, డ్రగ్స్‌ఏరులై పారడం వల్ల మహిళలపై అత్యాచారాలు జరుగుతు న్నాయన్నారు.

సంపాదకీయం

గర్భ 'సంస్కారం'



"తల్లి కడుపులో ఉన్న శిశువుకే రామాయణ, భగవద్గీతలను వినిపించాలి. తద్వారా సంస్కృతి, విలువలు గర్భస్థ శిశువుకు నేర్పించాలి" అని ఆర్‌ఎస్‌ఎస్ మహిళా విభాగం సంవర్ధినీ న్యాస్ పిలుపిచ్చింది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు తీస్తున్న 21వ శతాబ్దంలో గర్భస్థ శిశువుకు పుక్కిట పురాణాలు బోధించి సంస్కారం నేర్పాలి అనుకోవడం

> పురాణాల కాలంలోనే మనం ప్లాస్టిక్ సర్జరీలు చేశాం. రైట్ సోదరుల కంటే ముందే పుష్పక విమానాన్ని కనుగొన్నాం. ఆవు మూత్రమే సర్వరోగ నివారిణి. అప్పడాలు తిని కరోనాను హతమార్చవచ్చు అన్న మాటలతో మభ్యపెట్టినా మంత్రాలకు చింతకాయలు రాలవని అర్థం కాలేదా? ఆ ప్రయత్నాల ప్రహసనం గత ఎనిమిదిన్నర ఏండ్లుగా కొనసాగుతున్నది. మెజారిటీ మతస్తులను భావోద్వేగాలతో రెచ్చగొట్టి ఓట్ బ్యాంకును పెంచుకునే దానిలో 'గర్భసంస్కార్' అంతర్భాగమే!

అజ్ఞానం కాక మరేమిటి? ఇప్పటికే విద్యా, వైద్యం రంగాలలోకి ప్రవేశించి చేస్తున్న విధ్వంసకాండ అంతా ఇంతా కాదు. ప్రతిదానికీ మతం రంగు పులుముతున్నారు. అది చాలదన్నట్టు ఇప్పుడు తల్లి గర్భంలోకి కూడా ఈ అరాచక మూకలు చొరబడుతున్నాయి. ఇది అత్యంత దారుణమైన విషయం. మగశిశువు కడుపులో ఉన్నప్పుడు తల్లి ఆడపిల్ల గురించి ఆలోచించడమే హెూమో సెక్సువల్‌కు కారణం అని చెప్పేంతవరకు వీరి పైత్య ప్రమాణం సాగింది.

దేశానికే తలమానికమైన జేఎన్‌యూ ఆర్‌ఎస్‌ఎస్ అశాస్త్రీయ పాఠాలకు వేదిక అయింది. ఎంతో మంది శాస్త్రవేత్తలను, విజ్ఞానవేత్తలను అందించిన విశ్వవిద్యాలయంలో ప్రపంచం ఉలిక్కి పడే 'తిరోగమన పాఠాలు' బోధిస్తోంది. అందుకు తల్లి కడుపులో ఉండగానే అభిమన్యుడు 'పద్మవ్యూహం' ఛేదించడం నేర్చుకున్నాడని, ప్రహ్లాదుడు 'నారాయణ మంత్రం' నేర్చుకున్నాడని, 'జీజియాబాయ్' శివాజీకి ఎన్నో విషయాలు తన గర్భవాసంలోనే నేర్పిందని పుక్కిట పురాణాలను ఉటంకిస్తున్నారు.

'పుట్టేది ఆడపిల్ల అని ముందే తెలిస్తే, కడుపులోని ఆ పిండాన్ని అక్కడికక్కడే కరిగించేస్తున్నారు. ఇలా భ్రూణ హత్యలు ఆపకుండా గర్భస్థ శిశువులకు సంస్కారం ఇస్తామని చెప్పడం ఏ సంస్కారం? మాతా శిశు మరణాలు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వాలు ఎందుకు విఫలమవుతున్నాయి?' అని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాల్లో ప్రశ్నించింది. వాటికి సమాధానాలు ఆలోచించకుండా ఈ ఆలోచనలు చేయడం ఏం సంస్కారం?

'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి!' అనే సైద్ధాంతిక ఒరవడిలో సాగే పాలనలో నేడు దేశం ఉన్నది. స్త్రీకి అడుగడుగుగా ఆంక్షలు విధించే పాలకుల పాలనలో పూజించడం మాట అటుంచి కనీస గౌరవానికి కూడా స్త్రీ నోచుకోవడం లేదు. ఇలాంటి వారు వారికి లేని సంస్కారాలను శిశువులకు ఎలా నేర్పిస్తారు? మతం ప్రతిపాదికన పాలించే ప్రభువుల ఏలుబడిలో రాతియుగమే నయమనిపించేలా ఉంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, చెత్తకుప్పలు, మురుగు కాల్వల్లో బయటపడుతున్న మృతపిండాలు గర్భవిచ్ఛిత్తి పర్యవసానాల్ని కండ్లకు కడుతూనే ఉన్నాయి. ఎన్నో ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్న ఇలాంటి హత్యోదంతాలు మానవతనే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రభుత్వాల పని వాటన్నింటినీ చేష్టలుడిగి చూస్తుండటమేనా అన్నది జవాబులేని ప్రశ్న. ఆఖరికి 'గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ప్రకటనల నియంత్రణ'లోనూ ప్రభుత్వాలది ఘోర వైఫల్యమే. ప్రజలను చైతన్యం చేయాల్సిన పాలకులు ప్రజలను మూఢత్వంలోకి నెడుతున్నారు. దాని పర్యవసానమే నేటి ఈ పరిస్థితికి కారణం.

నేడు ఢిల్లీ పీఠాధిపతుల పాలనలో నిత్యం పెరుగుతున్న ధరలు బతుకును భారం చేస్తుంటే ఒక్క స్త్రీలే కాదు... సమాజంలో ఎవరూ మానసికంగా కానీ, శారీరకంగా కానీ ఆరోగ్యంగా బతికే పరిస్థితి లేదు. వైద్యం కూడా ఖరీదైన కాలంలో సామాన్యజనం ఆ ఒత్తిడి నుంచి ఎలా బయటపడగలరు? ఇన్ని సమస్యలు చుట్టుముట్టిన బతుకు బండి లాగటమే కష్టమైన సామాన్యులకు "సమవర్ధినీ న్యాస్" పుక్కిట పురాణాలు ఉద్దీపన ఎలా కలిగిస్తాయి? ఈ సూక్తి ముక్తావళి వల్లిస్తూ... సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడంలో మాత్రం కృతకృత్యులవుతున్నారు.

పురాణాల కాలంలోనే మనం ప్లాస్టిక్ సర్జరీలు చేశాం. రైట్ సోదరుల కంటే ముందే పుష్పక విమానాన్ని కనుగొన్నాం. ఆవు మూత్రమే సర్వరోగ నివారిణి. అప్పడాలు తిని కరోనాను హతమార్చవచ్చు అన్న మాటలతో మభ్యపెట్టినా మంత్రాలకు చింతకాయలు రాలవని అర్థం కాలేదా? ఆ ప్రయత్నాల ప్రహసనం గత ఎనిమిదిన్నర ఏండ్లుగా కొనసాగుతున్నది. మెజారిటీ మతస్తులను భావోద్వేగాలతో రెచ్చగొట్టి ఓట్ బ్యాంకును పెంచుకునే దానిలో 'గర్భసంస్కార్' అంతర్భాగమే!



ఇజ్రాయిల్ దౌర్జన్యాలు, దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనియన్లకు భారత్‌లోని లౌకిక, ప్రజా తంత్ర శక్తులు సంఘీభావం తెలపడం అత్యంతావశ్యకం. మార్చి 7 నుండి 11 వరకు పాలస్తీనా సంఘీభావ ప్రచా రాన్ని నిర్వహించాలంటూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) పిలుపునిచ్చింది. ఈ ప్రచారాన్ని జయప్రదం చేసేందుకు అన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులూ కృషి చేయాలి.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ హింసాకాండ

గతేడాది చివరిలో బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో పచ్చి మితవాద, ఛాందసవాద, మతతత్వ పార్టీలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ భద్రతా బలగాలు, యూదు సెటిలర్ల దాడులకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది. 1967 యుద్ధం నాటి నుంచి వెస్ట్ బ్యాంక్‌ను ఇజ్రాయిల్ ఆక్రమిత ప్రాంతంగా పరిగణించే అంతర్జాతీయ చట్టాన్ని దారుణంగా ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్‌లో వెస్ట్ బ్యాంక్‌ను కలిపేసుకునే దిశగా చర్యలు తీసుకుంటామని నెతన్యాహు ప్రభుత్వం నిర్లజ్జగా ప్రకటించింది. వెస్ట్ బ్యాంక్‌లో ఇంతకుముందు నిర్మాణాలు చేపట్టిన 9 అక్రమ సెటిలర్స్ కాలనీలను (సెటిల్మెంట్స్‌ను) క్రమబద్ధీకరిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో సెటిల్మెంట్‌లో 10వేల కొత్త ఇళ్ళు నిర్మించారు. అలాంటి 140 సెటిల్‌మెంట్లను ఇజ్రాయిల్ నిర్మించింది. 1967లో ఆక్రమించుకున్నప్పటి నుండి వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేంలలో దాదాపు 6లక్షల మంది యూదు సెటిలర్లకు అక్రమంగా ఆవాసాలను ఏర్పాటు చేసింది. వెస్ట్ బ్యాంక్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లను వారి ఇండ్ల నుండి, భూముల నుండి గెంటివేసేందుకు యూదు సెటిలర్ల అక్రమ ఆక్రమణలను ఇజ్రాయిల్ ప్రోత్సహిస్తూ పాలస్తీనీయులను తీవ్ర కడగండ్ల పాల్జేస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత, ఆ సంకీర్ణ కూటమిలో భాగస్వాములుగా ఉన్న మతతత్వ పార్టీలు పాలస్తీనియన్ల తరలింపు, గెంటివేతలను బాహాటంగా సమర్థించుకొస్తున్నాయి. పాలస్తీనియన్లపై హింసాత్మక దాడులు ఈ కాలంలో విపరీతంగా పెరగడానికి ఇదొక ముఖ్య కారణం.

ఇజ్రాయిల్ రక్షణ బలగాలు, ఇతర పారా మిలటరీ బలగాలు వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల ఇండ్లపై పదేపదే దాడులకు తెగబడుతున్నాయి. తీవ్రవాదులను అరెస్టు చేస్తున్నామనే సాకుతో ఈ అకృత్యాలకు అవి పాల్పడుతున్నాయి. జనవరిలో జెనిన్‌లో పాలస్తీనీయులపై పెద్దయెత్తున దాడులకు దిగాయి. ఈ దాడుల్లో పది మంది అమాయక పాలస్తీనా పౌరులు మరణించారు. మృతుల్లో 61ఏండ్ల వృద్ధ మహిళ కూడా ఉన్నారు. నబ్లస్ పట్టణంలోనూ ఇదే విధమైన ఊచకోతకు పాల్పడ్డాయి. ఫిబ్రవరి 22న జరిగిన ఆ దాడిలో 11మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 102 మంది దాకా గాయపడ్డారు. మొత్తం మీద కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 62మంది పాలస్తీనియన్లు మరణించారు. అంటే సగటున రోజుకో పాలస్తీనియుడి కన్నా ఎక్కువమందే హతులవుతున్నారన్న మాట. ఆ విధంగా పాలస్తీనీయులు తమ సొంత గడ్డపై శరణార్థులుగా బతుకీడ్చే దుస్థితికి నెట్టబడ్డారు. పాలస్తీనీయులను ఇజ్రాయిల్ ప్రభుత్వం వెంటాడి వేదిస్తోంది. పిల్లినైనా నాలుగు గోడల మధ్య బంధించి కొడితే తిరగబడుతుంది. అదే విధంగా పాలస్తీనియన్లు తమపై జరుగుతున్న ఈ అన్యాయాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురు తిరగడం మొదలెట్టారు. నబ్లస్ దాడి తర్వాత, ఆ ప్రాంతానికి సమీపంలోని హువారాలో ఇద్దరు యూదు సోదరులను వారు కాల్చి చంపారు. అదే రోజు, 400మంది యూదు ఆవాసులు, ఐడిఎఫ్, ప్రభుత్వ బలగాలు కలసి మూకుమ్మడిగా దాడిచేశాయి. 30ఇండ్లను తగలబెట్టాయి. మరో 40ఇండ్లను, వంద కార్లను ధ్వంసం చేశాయి. ఈ దాడిలో ఒక పాలస్తీనా పౌరుడు చనిపోయాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా దళాలు విచక్షణా రహితంగా సాగించిన ఈ దాడులను పాలక సంకీర్ణానికి చెందిన సభ్యుడొకరు బాహాటంగా సమర్థించుకొచ్చారు. అంతేకాదు, ఈ హత్యాకాండకు పౌర హక్కుల గ్రూపులే కారణమని నిందించారు.

సరిగ్గా ఆ సమయంలోనే గాజా స్ట్రిప్‌లో నివసిస్తున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ వైమానిక దాడులకు తెగబడింది. దీంతో ఆ ప్రాంతంలోని 20లక్షల మంది పాలస్తీనీయుల బతుకులు ఛిద్రమయ్యాయి. అక్రమ సెటిల్మెంట్లను ఇజ్రాయిల్ ప్రభుత్వం బాహాటంగా సమర్థించడమంటే ఐక్యరాజ్య సమితి తీర్మానాలను తుంగలో తొక్కడమే. ఇజ్రాయిల్ నిర్మాణాలను, సెటిల్‌మెంట్ల విస్తరణను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 14న భద్రతా మండలి ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అయితే, ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ల కార్యకలాపాలను తక్షణమే ఆపేయాలని కోరుతూ పాలస్తీనా ప్రతినిధి ప్రతిపాదించిన ముసాయిదా తీర్మానానికి, భద్రతా మండలి ఆమోదించిన తీర్మానానికి అసలు పొంతనేలేదు. అమెరికా జోక్యం చేసుకుని భద్రతా మండలి తీర్మానాన్ని ఎంతగా నీరుగార్చాలో అంతగా నీరుగార్చేసింది. ఇంతకు ముందు సంపాదకీయంలో పేర్కొన్నట్లుగా పాలస్తీనా ప్రయోజనాలకు మద్దతిచ్చే చిరకాల మిత్రత్వ వైఖరి నుండి భారత్ పక్కకు తప్పుకుంది. జెనిన్, నబ్లస్‌ల్లో ఇజ్రాయిల్ భద్రతా బలగాలు యథేచ్ఛగా సాగించిన హత్యాకాండ, హింసాకాండ గురించి మాట మాత్రంగా కూడా ప్రస్తావించకుండా, జెరూసలేంలోని యూదు ప్రార్థనా మందిరంపై దాడిని ఖండించడానికి మన విదేశాంగ మంత్రిత్వశాఖ ఎక్కడలేని ఆతృత కనబరచింది. పైగా అమెరికా, యూఏఈ, ఇజ్రాయిల్‌లతో కూడిన మధ్య ప్రాచ్యక్వాడ్‌లో భారత్ ఈ మధ్య చేరింది. నెతన్యాహు ప్రభుత్వ పచ్చి మితవాద, యూదు దురహంకార వైఖరికి హిందూత్వ శక్తులు పూర్తి స్థాయి మద్దతునిస్తున్నాయి.

ఇజ్రాయిల్ దౌర్జన్యాలు, దాష్టీకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తీనియన్లకు భారత్‌లోని లౌకిక, ప్రజా తంత్ర శక్తులు సంఘీభావం తెలపడం అత్యంతావశ్యకం. మార్చి 7 నుండి 11 వరకు పాలస్తీనా సంఘీభావ ప్రచా రాన్ని నిర్వహించాలంటూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (అయిప్సో) పిలుపునిచ్చింది. ఈ ప్రచారాన్ని జయప్రదం చేసేందుకు అన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులూ కృషి చేయాలి.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

సుప్రీం కమిటీపై కందకులేని అనుమానం కాషాయ దళాలకెందుకు?

సత్య

తప్పనిసరి పరిస్థితి ఏర్పడి తప్పు చేసినట్లు ఒక వేళ గౌతమ్ అదానీ అంగీకరించినా అతని మద్దతుదారులైన కాషాయదళాలు మాత్రం ఒప్పుకొనేట్లు కనిపించటం లేదు. అదానీ కంపెనీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక సృష్టించిన సంచలనం, ఆ కంపెనీల వాటాల విలువ పతనం గురించి తెలిసిందే. ఆ నివేదిక ఆరోపణల మీద విచారణ జరపాలని సుప్రీంకోర్టు ఆరుగురితో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీం మాజీ న్యాయమూర్తి ఎఎం సప్రే చైర్మన్‌గా, ఎస్‌బిఐ మాజీ చైర్మన్ ఓ ప్రకాష్ భట్, ఇన్ఫోసిస్ సహ ప్రారంభకుడు నందన్ నీలెకని, ప్రస్తుతం ఎన్‌బిఎఫ్‌ఐడి చైర్మన్‌గా, గతంలో ఐసిఐసిఐ, బ్రిక్స్ బ్యాంకు, ఇన్ఫోసిస్ చైర్మన్‌గా పని చేసిన కెవి కామత్, ప్రముఖ లాయర్ సోమశేఖర సుందరేశన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జెపి దేవధర్ సభ్యులుగా ఉన్నారు. దాన్ని తాము స్వాగతిస్తున్నామని నిజం వెల్లడవుతుందని అదానీ ఒక ప్రకటనలో స్పందించారు. కానీ 'కందకు లేని అనుమానం కత్తిపీటకు వచ్చినట్లు' సుప్రీం కోర్టు కమిటీ తటస్థంగా వ్యవహరిస్తుందా! అంటూ ఆర్‌ఎస్‌ఎస్ నడిపే నేషనలిస్ట్ హబ్ అనే మీడియా పోర్టల్ ప్రశ్నించింది. సభ్యులుగా ఉన్నవారికి గతంలో ఆర్థికనేరాలకు పాల్పడినవారు కొందరితో ఉన్న సంబంధాలివి, మోడీని విమర్శించే సంస్థలతో కాంగ్రెస్‌తో సంబంధాలు అంటూ ఇలాంటి వారు తటస్తంగా ఉండి నివేదిక ఇస్తారా అన్న అనుమానాలను రేకెత్తించింది. దాని మీద ఇవ్వరు ఇవ్వరు అంటూ వెంటనే స్పందనలు.


> నయా ఇండియా పత్రికలో ఆర్ఎస్ఎస్‌పై శంకర్ సహారా మండిపాటు దాని మద్దతుదార్లలో గూడుకట్టుకొని ఉన్న అసహనాన్ని వెల్లడిస్తున్నది. జర్మనీ, అనేక దేశాల్లో హిట్లర్ మూకలు యూదుల పట్ల అనుసరించిన వైఖరిని మన దేశంలో ముస్లింలపట్ల ఇంకా పూర్తిగా ఎందుకు అనుసరించటం లేదన్న దుగ్గ సంఘ్ పరివార్ శ్రేణుల్లో పెరుగుతున్నదని శంకర్ వాదనల తీరు వెల్లడిస్తున్నది. తమ అజెండాతో ముందుకు పోతే మొదటికే మోసం వస్తుందని తటపటాయిస్తున్నారు. మత విద్వేషాన్ని ఇంకా ఎక్కిస్తే తప్ప అమలు జరపటం సాధ్యం కాదని సంఘ్ పరివార్ భావిస్తున్నది. అందుకే ఆ కార్యక్రమాన్ని మరింతగా వేగిరపరుస్తున్నది తప్ప వైదొలగలేదు.

దేశంలో ఇప్పుడు జరుగుతున్న తీరు తెన్నులను బట్టి జనం ప్రతిదాన్నీ అనుమానిస్తున్నప్పుడు ఏ కమిటీని వేసినా దానిలో ఉన్నవారిని అనుమానించటం సహజం. తానెలాంటి తప్పు చేయలేదని అదానీ తలకిందులుగా తపస్సు చేస్తున్నప్పటికీ, నరేంద్రమోడీ మద్దతుగా ఉన్నా, ఆర్ఎస్ఎస్ సర్టిఫికెట్ ఇచ్చినా పక్కన పెట్టేసి హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికను స్టాక్‌మార్కెట్లో మదుపుదార్లు నమ్మారు. తమ వాటాలను తెగనమ్ముకొన్నారు. నెల రోజులు దాటినా జరిగిన నష్టంలో మార్పులేదు. అడ్డగోలుగా పెంచి పెద్దచేసినా, ఇబ్బందులు వచ్చినప్పుడు నరేంద్రమోడీ కూడా అదానీని కాపాడలేరని కూడా స్టాక్‌మార్కెట్ మదుపుదార్లలో ఉన్నట్లు ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి స్థితిలో సంఘ్ పరివార్ సంస్థ సుప్రీం కమిటీ మీద అనుమానాలను ఎందుకు రేకెత్తించినట్లు? భీమకోరేగాం కేసులో మాదిరి దర్యాప్తు సంస్థే స్టాన్‌స్వామి, ఇతరుల కంప్యూటర్లలో తప్పుడు సమాచారాన్ని చొప్పించి దాన్నే సాక్ష్యంగా చూపేందుకు చూసిన దారుణం తెలిసిందే. అదానీ కంపెనీల్లో అలాంటిదానికి అవకాశం లేదు. వివరాలను ఇప్పటికే ధ్వంసం చేయగా మిగిలిన వాటి నుంచే అక్రమాలకు పాల్పడిందీ లేనిదీ కమిటీ నిర్ధారిస్తుంది. లేదూ ఒకదానికొకటి పొంతనలేని సమాచారం ఇస్తే దాన్ని కూడా సుప్రీం కోర్టుకు అందిస్తుంది. సెబీ కూడా దర్యాప్తు జరుపుతున్నది. ఒక నియంత్రణ సంస్థగా సెబీ తీరు తెన్నుల వైఫల్యం గురించి కూడా సుప్రీం కమిటీ విచారణ జరుపుతుంది. తమ కమిటీకి సహకరించాలని సెబీని సుప్రీం ఆదేశించింది. సుప్రీం కమిటీలో వెలుగుచూడనివి సెబీ నివేదికలో లేదా సెబీలో రానివి సుప్రీం కమిటీ నివేదికలో చోటు చేసుకోవచ్చు. ఆ రెండు నివేదికలూ బహిర్గతమైన తరువాత గతంలో దర్యాప్తు జరిపిన హిండెన్‌బర్గ్ లేదా ఆ రంగంలో నిపుణులైన వారు లేవనెత్తే అంశాలను కూడా సుప్రీంకోర్టు విచారిస్తుంది. ఇంత జరగాల్సి ఉండగా ఇంకా 'ఆలూలేదూ చూలూ లేదు కొడుకుపేరు సోమలింగం' అన్నట్లుగా సంఘ్ పరివార్ మీడియా ఎందుకు అనుమానాలు రేకెత్తిస్తున్నట్లు? హిండెన్‌బర్గ్ నివేదికలోని అంశాలన్నింటినీ సుప్రీం కోర్టు కమిటీ విచారించటం లేదు. మన దేశంలో తిమ్మిని బమ్మిని చేసినట్లు వచ్చిన ఆరోపణల మీదనే అది పరిశీలన జరుపుతుంది. విదేశాల్లోని డొల్లకంపెనీలు, నిధుల మళ్లింపు వంటి వాటి మీద ఏదైనా అనుమానం వచ్చే సమాచారం దొరికితే దాన్ని సుప్రీం కోర్టుకు నివేదించే అవకాశం ఉంటుంది. సుప్రీం కోర్టు విచారణ సందర్భంగా మీడియా ఎక్కువ చేసి రాస్తున్న వార్తల వలన స్టాక్ మార్కెట్ ప్రభావితమై మదుపర్లు నష్టపోతున్నందున అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం గురించి వార్తలపై నిషేధం విధించాలన్న పిటీషన్‌దారుల్లో ఒకరైన ఎంఎల్ శర్మ వినతిని సుప్రీం కోర్టు తిరస్కరించింది. సహేతుకమైన వాదనలు వినిపించండి తప్ప నిషేధాన్ని అడగవద్దని చెప్పింది.

ప్రతిపక్షాలు పార్లమెంటులో డిమాండ్‌చేసిన జెపిసికి మోడీ సర్కార్ అంగీకరించి ఉంటే సుప్రీం కోర్టు కమిటీ ఉండేదీ కాదు, దాని మీద నేషనలిస్ట్ హబ్‌కు సందేహాలు లేవనెత్తే అవకాశం వచ్చి ఉండేది కాదు. జెపిసి పక్షపాతంగా పని చేసే అవకాశమే లేదు. ఎందుకంటే దానిలో అత్యధికులు అదానీని కంటికి రెప్పలా కాపాడుతున్న బీజేపీ లేదా మిత్రపక్షాల సభ్యులే ఉంటారు. అయినా మోడీ ఎందుకు నిరాకరించినట్లు? ఏ పార్టీ మంది ఎందరని కాదు, ఎవరెందరున్నా అడిగిన సమాచారాన్ని కమిటీకి ఇవ్వాలి, లేకుంటే ఇవ్వలేదని సభ్యులు రాస్తారు. మెజారిటీ ఒక నివేదికను ఆమోదించినా, దానితో విభేదించేవారు కూడా మరొక నివేదికను ఇచ్చే హక్కు ఉంటుంది. ఆ రెండూ బహిరంగం చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఎవరు అదానీని కాపాడేందుకు పూనుకున్నది, ఎవరు అక్రమాలను వెలికి తీసేందుకు చూసిందీ యావత్ ప్రపంచానికి తెలుస్తుంది. గతంలో నరేంద్రమోడీకి ఉందని చెప్పిన 56అంగుళాల ఛాతీ ఇప్పుడు లేక కాదు, ఈ కారణంగానే భయపడ్డారు.

సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల మీద వత్తిడి తీసుకురారా, బెదిరించరా అంటే ఈ దేశంలో ఏదైనా జరిగే అవకాశం ఉంది. అదీ ప్రభుత్వం వైపు నుంచే ఉంటుంది. మన ప్రజాస్వామ్యానికి ముంచుకు వస్తున్న ముప్పు అదే! తమ ముందు దాఖలైన కేసుల్లో సుప్రీం నోటీసులు ఇచ్చిన తరువాత గానీ కేంద్రం కదలలేదు. కమిటీ ఏర్పాటుకు అంగీకరిస్తూ తమ ప్రతిపాదనలను ఒక మూసివేసిన కవరులో పెట్టి సుప్రీం కోర్టుకు అందించింది. దాని అర్థం ఏమిటి? మేము చెప్పిన వారితో చెప్పిన పద్ధతుల్లో విచారణ జరిపించాలని సుప్రీంను ప్రభుత్వం ఆదేశించటమే. పారదర్శక విచారణ జరగాలంటూ సదరు కవరును సుప్రీం కోర్టు తిరస్కరించింది. నిజానికి కేంద్రానికి అంతకంటే అవమానం మరొకటి లేదు, బహుశా ఈ పరిణామాన్ని ఊహించి ఉండరు. ఇంతకీ ఆ కవరులో నరేంద్రమోడీ సర్కార్ రాసిన అంశాలేమిటి అన్నది ఇప్పటి వరకు వెల్లడికాలేదు. ఇక అవకాశాలు లేవు. తరువాత అవి లీకైనా కేంద్రం తోసిపుచ్చే అవకాశం ఉంటుంది.

కొన్ని సందర్భాల్లో కేసుల స్వభావాన్ని బట్టి కోర్టులు ప్రభుత్వాలు, ఏజెన్సీలను కోరిన సమాచారాన్ని సీల్డు కవర్‌లో అందించాలని అడుగుతాయి. అదానీ కంపెనీలదంతా బహిరంగం అయినప్పుడు విచారణ రహస్యంగా జరగాల్సిన అవసరం ఏముంది? కమిటీ విచారణ అంశాలు, పరిధి గురించి పిటీషనర్లకు తెలియాల్సి ఉన్నందున ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తిరస్కరించి ఒక కమిటీని తానే ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్‌లో కేరళ టీవీ ఛానల్ మీడియా వన్ కేసులో కేంద్ర ప్రభుత్వ సీల్డుకవర్‌ను సుప్రీం



తిరస్కరించింది. కక్షిదారు వాటిని చూడకుండా అవకాశాన్ని నిరోధించటమే అవుతుందని పేర్కొన్నది. నిబంధనల ప్రకారం ఒక అంశాన్ని రహస్యమని భావించి సీల్డు కవర్‌లో ఉంచాలని ప్రధాన న్యాయమూర్తి లేదా న్యాయమూర్తులు గనుక నిర్ణయిస్తే ప్రజా ప్రయోజనం పేరుతో దాన్ని చూసేందుకు, కాపీ కావాలని కోరేందుకు అవకాశం లేదు. మాజీ మంత్రి పి చిదంబరం అరెస్టయిపుడు బెయిలు కేసులో ఈడి సమర్పించిన సీల్డు కవర్ మీద ఆధారపడిన ఢిల్లీ హైకోర్టును 2019లో సుప్రీం కోర్టు తప్పు పట్టింది. తమ మనస్సులను సంతృప్తి పరచుకొనేందుకు న్యాయమూర్తులకు సీల్డు కవర్‌లోని అంశాలను చూసేందుకు అధికారం ఉన్నప్పుడు కోర్టు విచారణలో వాటిలో కనుగొన్న వాటిని నమోదు చేయకూడదని పేర్కొన్నది. రాఫెల్ విమానాల కొనుగోల వివరాలు రహస్యం అని ప్రభుత్వం చెప్పటాన్ని కోర్టు అంగీకరించింది. 2జి స్పెక్ట్రం కేసులో కూడా అదే జరిగింది.

మితవాద శక్తులలో సహనం ఇప్పటికే నశించి మైనారిటీల మీద తెగబడుతున్న తీరుతెన్నులు తెలిసిందే. చివరికి అది ఆర్ఎస్ఎస్ మీదకు కూడా మళ్లుతున్నది. నయా ఇండియా అనే పత్రికలో శంకర్ సహారా అనే

> కొన్ని సందర్భాల్లో కేసుల స్వభావాన్ని బట్టి కోర్టులు ప్రభుత్వాలు, ఏజెన్సీలను కోరిన సమాచారాన్ని సీల్డు కవర్‌లో అందించాలని అడుగుతాయి. అదానీ కంపెనీలదంతా బహిరంగం అయినప్పుడు విచారణ రహస్యంగా జరగాల్సిన అవసరం ఏముంది? కమిటీ విచారణ అంశాలు, పరిధి గురించి పిటీషనర్లకు తెలియాల్సి ఉన్నందున ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తిరస్కరించి ఒక కమిటీని తానే ఏర్పాటు చేసింది. గతేడాది నవంబర్‌లో కేరళ టీవీ ఛానల్ మీడియా వన్ కేసులో కేంద్ర ప్రభుత్వ సీల్డుకవర్‌ను సుప్రీం తిరస్కరించింది. కక్షిదారు వాటిని చూడకుండా అవకాశాన్ని నిరోధించటమే అవుతుందని పేర్కొన్నది.

రచయిత ఆర్ఎస్ఎస్ గురించి రాసిన వ్యాసంలో హిందువుల ప్రయోజనాలను రక్షించేందుకు ఆర్ఎస్ఎస్ చేయాల్సినంత చేయటం లేదంటూ ధ్వజమెత్తారు. "లాఠీలను పంచుతూ హిందువుల్లో ఉన్న వీరత్వాన్ని పొగిడే సాహిత్యాన్ని ప్రచురిస్తూ ముస్లిం దురాక్రమణకు వ్యతిరేకంగా నేరుగా పోరాడాలంటూ సంఘ్ పుట్టింది. పరిస్థితి ఇప్పటికీ అదే విధంగా ఉంది. వాస్తవానికి అంతకు ముందుకంటే మరింత దిగజారింది. ఇలా ఉండగా మూడోవంతు దేశంలో హిందువులు తగ్గారు. దేశాన్ని విభజించి రెండు హిందూ వ్యతిరేక దేశాలను ఏర్పాటు చేశారు. చివరికి మిగిలిన స్వదేశంలో కూడా హిందువులు చట్టపరంగా రెండవ తరగతి పౌరులుగా మారారు. విద్యాదేవాలయాలను వారి నుంచి లాగేసుకున్నారు. ఇలాంటివి బ్రిటిష్ వారి ఏలుబడిలోనూ జరగలేదు. కానీ ఈ సమస్యల మీద పోరాటాలకు దూరంగా ఉండటమే కాదు సంఘ్ పరివార్ నేతలు నోరు విప్పటం కూడా మానుకున్నారు. బాధ్యతల్లో ఉన్న సంఘ్ నాయకులు, కార్యకర్తలూ వారి విధానాలు లేదా కార్యకలాపాలను అధికారికంగా ముందుకు తీసుకుపోవాలని కోరుకోవటం లేదు. దానికి బదులు (ఉదాహరణకు గోల్వాల్కర్, సుదర్శన్, మధోక్, వాజ్‌పాయి) ఏ సర్ సంఘ్ సంచాలక్ లేదా అగ్రనేతల ప్రకటనలు, కార్యాచరణలనైనా వారి వ్యక్తిగత ఆలోచన లేదా ఆచరణ అంటున్నారు తప్ప సంఘ్‌కు చెందినవిగా చెప్పటం లేదు. మరి అలాంటప్పుడు సంఘ్ భావజాలం, పని ఏమిటి?" అని శంకర్ సహారా ప్రశ్నించారు.

నయా ఇండియా పత్రికలో ఆర్ఎస్ఎస్‌పై శంకర్ సహారా మండిపాటు దాని మద్దతుదార్లలో గూడుకట్టుకొని ఉన్న అసహనాన్ని వెల్లడిస్తున్నది. జర్మనీ, అనేక దేశాల్లో హిట్లర్ మూకలు యూదుల పట్ల అనుసరించిన వైఖరిని మన దేశంలో ముస్లింలపట్ల ఇంకా పూర్తిగా ఎందుకు అనుసరించటం లేదన్న దుగ్గ సంఘ్ పరివార్ శ్రేణుల్లో పెరుగుతున్నదని శంకర్ వాదనల తీరు వెల్లడిస్తున్నది. తమ అజెండాతో ముందుకు పోతే మొదటికే మోసం వస్తుందని తటపటాయిస్తున్నారు. మత విద్వేషాన్ని ఇంకా ఎక్కిస్తే తప్ప అమలు జరపటం సాధ్యం కాదని సంఘ్ పరివార్ భావిస్తున్నది. అందుకే ఆ కార్యక్రమాన్ని మరింతగా వేగిరపరుస్తున్నది తప్ప వైదొలగలేదు.

యుద్ధం - మానవాళి(కి) శాపం



కె శాంతారావు

చాపకింద నీరులా మానవాళి బాహ్య ప్రపంచం కింద భయంకర యుద్ధం ప్రవహిస్తూనే ఉన్నది. యుద్ధం మానవాళిచే మానవాళి విధించుకున్న వికృత శాపం. కాబట్టే 'అంతిమంగా మానవుడు శాంతిని సాధించనంతవరకు అజేయుడు కాజాలడు' అని టాల్‌స్టాయ్ ఏనాడో చెప్పిన మాటలు ఎప్పటికీ యథార్థమే.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై ఏడాది పైబడింది. అయినా యుద్ధ మంటలు చల్లారడం లేదు. ఈ యుద్ధంలో ఇరువైపులా ఇప్పటికి లక్షన్నర మంది సైనికులు చొప్పున మొత్తం మూడు లక్షలమంది మరణించి ఉంటారని అంచనా. వీరు కాక మరో నలభైవేలమంది సాధారణ పౌరులు సైనిక దాడుల్లో ప్రాణాలు విడిచారు. మరో పదివేల మంది క్షతగాత్రులు అయ్యారు. చనిపోయిన వారిలో, గాయపడిన వారిలో చిన్నారులు కూడా లెక్కకు మించే ఉన్నారు. నివాసాలు ధ్వంసమై, బతుకు తెరువు కరువై శరణార్థులుగా పొరుగు దేశాలకు వలసబాట పట్టినవారు ఎనభైలక్షల పైగా ఉన్నారు. వీరి బాధలు, కష్టాలు వర్ణనాతీతం.

ఇక ఇప్పట్లో యుద్ధం ముగిసే ఛాయలు కనిపించడం లేదు. యుద్ధంలో ఎవరిది పైచేయి? రష్యాదా? ఉక్రెయిన్‌దా? అంటే ఎవరూ చెప్పలేకున్నారు. "ఈ ఏడాది యుద్ధంలో ఎవరూ పెద్దగా ప్రయోజనం పొందలేదని, మానవ హననం మాత్రం క్రమేణా, నిదానంగా సాగిపోతున్నదని అమెరికన్ రిటైర్డ్ కల్నల్, యుద్ధ పరిశోధకులు రాబర్ట్ హామిల్టన్ చెప్పారు. అంతేకాదు, సమీప భవిష్యత్‌లో కూడా ఏ దేశమూ పైచేయి సాధించే స్థాయి లేదని ఆయన తెలిపారు. ఏడాది కాదు, మరో రెండేండ్లు గడిచినా ఏదో ఒక పక్షం తాము ఆశిస్తున్న రీతిలో విజయం సాధించలేదని కూడా ఆయన తేల్చి చెప్పారు.

రష్యా పైచేయి సాధించినా ఉక్రెయిన్ తిరుగుబాటు కొనసాగిస్తూనే ఉంటుంది. దానికి అమెరికా ఆజ్యం పోస్తూనే ఉంటుంది. ఒకవేళ ఉక్రెయిన్ పైచేయి సాధిస్తే, రష్యా ఆత్మరక్షణ కోసం యుద్ధపోరును తీవ్రతరం చేస్తుంది. జరుగుతున్న పరిణామం ఇది.

ఉక్రెయిన్‌తో సహా ఒకప్పటి సోవియట్ దేశాలు దేనినీ, అమెరికా నేతృత్వంలోని నాటో సైనిక కూటమిలో చేర్చుకోవద్దని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పదే పదే ప్రపంచ వేదికలపై చెప్పాడు. ఉక్రెయిన్ రష్యా నుండి విడిపోయిన విషయం తెలిసిందే.

ఉక్రెయిన్ గనుక నాటోలో చేరితే అమెరికా, పశ్చిమదేశాలు రష్యాను చుట్టుముట్టే ప్రమాదం ఉన్నదని పుతిన్ వాదన. అమెరికా యుద్ధోన్మాదం గురించి తెలిసిన వారెవరూ పుతిన్ వాదనను కొట్టిపారేయలేరు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ మా సరిహద్దుల వెంట నాటో సైన్యం మోహరింపుకు మేము ససేమిరా అంగీకరించబోమని, ఇది మా జీవన్మరణ సమస్యని పుతిన్ నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. పరిష్కార దిశగా అమెరికా, నాటో మిత్రదేశాలు స్పందించకపోవడంతో అనివార్య యుద్ధానికి (మిలటరీ ఆపరేషన్‌కు) రష్యా తెరతీయాల్సి వచ్చింది.

కానీ ఉక్రెయిన్‌ను నిత్యం ఎగదోస్తున్నది అమెరికా. ఇప్పటికి 27 బిలియన్ డాలర్ల (2.23 లక్ష కోట్ల రూపాయలు) విలువగల ఆయుధ సామాగ్రిని అందించింది. అమెరికా పెట్టుబడిదారుల్లో సింహభాగం మిలటరీ ఇండస్ట్రియల్ కాంప్లెక్స్ (సైనిక పారిశ్రామిక



సముదాయాల) అధినేతలు. వారికి ప్రపంచంలో యుద్ధాలు జరిగితేనే వారి ఆయుధాలు అమ్ముడై లాభాలు సమకూరు తాయి. మరో భాషలో చెప్పాలంటే శవాలపై పైసలు ఏరుకోవడం అంటే ఇదే. మనిషి ప్రాణాలు కన్నా వారికి లాభాలే మిన్న. అమెరికాతో పాటు ఇప్పుడు దాని మిత్ర దేశాలు ఇంగ్లాడు, జర్మనీ కూడా ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నాయి.

ఈ యుద్ధ కాలంలో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన విషయం మరొకటి ఉన్నది. యుద్ధ విరామం ప్రకటించని సమయంలో, అమెరికా సైన్యం ప్రత్యక్షంగా లేని సందర్భాన, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆకస్మాత్తుగా ఉక్రెయిన్ పర్యటించి కీవ్ నగర నేలపై నడయాడటం అసాధారణం. అలాగే ఆక్షణాన మిలటరీ సైరన్ల హెచ్చరిక కూతలు చేసినా రష్యా సైన్యం ఏమాత్రం తొట్రుపడకుండా, దాడి చేయక నిగ్రహం పాటించడం అంతే అసాధారణంగా పరిశీలకులు భావిస్తున్నారు.

క్షణాల్లో మీటలు నొక్కి దేశ దేశాలను భస్మీపటలం చేయగల సైనిక పాటవమున్న దశలో సైతం, సంయమనం పాటించడం మానవ వివేచనా విశేషమే.

అయితే ఇప్పుడు ఎవరు యుద్ధ పిపాసులు? అనే మౌలిక ప్రశ్న తలెత్తుతున్నది. యుద్ధ కారణంగా రష్యా అగ్రదేశమైనా, పరదేశ ఆంక్షలను ఎదుర్కొంటూ ఆర్థికంగా దెబ్బతింటున్నది. ఇక ఉక్రెయిన్ - అమెరికా, పశ్చిమ దేశాల నుండి లక్షల కోట్ల రూపాయల విలువగల ఆయుధ సాయం పొందుతున్నప్పటికీ దినదినం యుద్ధక్షేత్రంలో నిలబడటం ఆ దేశానికి శ్రేయస్కరం కాదు. సమస్త వ్యవస్థలు ధ్వంసమవుతున్నాయి. ప్రాణాలు హారతి కర్పూరంలా హరించుకు పోతున్నాయి.

ప్రచ్ఛన్న యుద్ధ దశ ముగిసాక, అమెరికా - రష్యా మధ్య సుదీర్ఘ చర్చల అనంతరమే, 2010లో అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందం (స్టార్ట్) కుదిరింది. దీని కాలపరిమితి మరో మూడేండ్లకు ముగియనున్నది. కొత్త ఒప్పందంకై మొదలైన చర్చలను ఇక నిలిపి వేస్తున్నట్టు పుతిన్ ఇప్పుడు ప్రకటించాడు. అమెరికా గనుక ఇలాగే తన ధోరణిలో యుద్ధ చర్యలు ఈ విధంగా కొనసాగిస్తూ అణుపరీక్షలు మొదలుపెడితే, తామూ అందుకు దీటుగా సన్నద్ధంగానే ఉంటామని పుతిన్ ప్రకటించాడు.

అమెరికా ఒత్తిడితో ఐరోపా దేశాలు కొన్ని ఇప్పటికే పీకలోతుల ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. అయినా రష్యాకు సహకరిస్తే... ఖబడ్దార్! అంటూ వాటికి అమెరికా హెచ్చరికలు చేస్తూనే ఉన్నది. దీనికి సమాధానంగానా అన్నట్టు, చైనా కమ్యూనిస్టుపార్టీ విదేశాంగ నిపుణుడూ వాంగ్, ఈ నేపథ్యంలోనే మాస్కోలోపర్యటించి రష్యాతో మా బంధం మరింత దృఢతరం అవుతుందని తెలిపాడు. ఈ ప్రకటన శాంతి కాముక శక్తులకు ఊరటతో పాటు ఉత్తేజాన్ని కలిగించింది.

యుద్ధంలో అంతిమంగా బలైపోయేది ఎప్పుడైనా ఎక్కడైనా సైనికులు - ప్రజలు.

'సైనికుడినైన నేనూ - నా ప్రత్యర్థి ఒకే పాత్రలోని విషాన్ని మింగుతాం. ఒకే విషాద గీతాన్ని ఆలపిస్తాం. చివరకు సరిహద్దుల్లేని ఓ మానవతా సువిశాల శాంతి ప్రపంచాన్ని నిర్మిస్తామనే సుందర స్వప్నాన్ని ఉమ్మడిగానే కలకంటాం' మళయాళ కవి సచ్చిదానందన్ వాక్కులు ప్రపంచంలో యుద్ధం ఉన్నంత కాలం మానవ హృదయాలపై తారాడుతూనే ఉంటాయి.

సెల్: 9959745723

> అమెరికా ఒత్తిడితో ఐరోపా దేశాలు కొన్ని ఇప్పటికే పీకలోతుల ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. అయినా రష్యాకు సహకరిస్తే... ఖబడ్దార్! అంటూ వాటికి అమెరికా హెచ్చరికలు చేస్తూనే ఉన్నది. దీనికి సమాధానంగానా అన్నట్టు, చైనా కమ్యూనిస్టుపార్టీ విదేశాంగ నిపుణుడూ వాంగ్, ఈ నేపథ్యంలోనే మాస్కోలో పర్యటించి రష్యాతో మా బంధం మరింత దృఢతరం అవుతుందని తెలిపాడు. ఈ ప్రకటన శాంతి కాముక శక్తులకు ఊరటతో పాటు ఉత్తేజాన్ని కలిగించింది.

వ్యాపారవేత్తలంటే పెద్ద పెద్ద చదువులు చదివి నేర్చుకున్న నైపుణ్యాలను వ్యాపార అభివృద్ధి కోసం ఉపయోగించే వారే అనుకుంటారేమో! అంటే మీరు తప్పులో కాలేసినట్లే! అవును మరి.. ఏ మాత్రం చదువు రాని ఒక మహిళ తన స్వయంకృషి, పట్టుదలతో పైకెదిగిన క్రమం మిమ్మల్ని ఆశ్చర్య చకితుల్ని చేయకమానదు. ఆమే పశుల మంగ. భారతదేశంలో 400 సంవత్సరాలకు పూర్వం నుండి ఉన్న అరుదైన చిత్రకళ చేర్యాల(చెరియాల) నకాశీ కళను జీవనోపాధిగా ఎంచుకుంది. చదువు లేకున్నా మొక్కవోని ధైర్యంతో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని ఇప్పుడు లక్షలలో బిజినెస్ సాగిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

కళే ఆమె జీవనాధారమయ్యింది



ఉప్పల్‌కు 12కి.మీ. దూరంలో సింగారం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించింది మంగ. చదువులేకపోయినా చిన్నతనం నుండి ఎంతో చురుగ్గా, ఆత్మవిశ్వాసంతో ఉండేది. ఇంటికి చిన్న కూతురైనా తండ్రి చనిపోయినప్పుడు అక్కకు, అమ్మకు తానే ధైర్యం చెప్పింది. నిరుపేద కుటుంబం కావడం వల్ల తల్లి బిడ్డలను చదివించలేకపోయింది. దాంతో 17 ఏండ్లకే మంగ సిద్దిపేటకు చెందిన మల్లేశాన్ని పెండ్లి చేసుకొని అత్తారింటిలో అడుగు పెట్టింది. మల్లేశానిది కూడా పేద కుటుంబమే. ఇంట్లో వారు మంగను బీడీలు చుట్టడానికి రమ్మన్నారు. కానీ ఆమె అందుకు ఇష్టపడలేదు. భర్త లేపాక్షి గోల్కొండలో నేర్చుకున్న చేర్యాల చిత్రకళను తానూ నేర్చుకోవాలి అనుకుంది. ఇదే విషయాన్ని భర్తతో చెప్పింది. భార్య కోరికను, ఆమె పట్టుదలను కాదనలేకపోయాడు మల్లేశం. అతి తక్కువ సమయంలోనే ఆ కళను, అందులోని మెళుకువలను ఒంట పట్టించుకుందామె. ఈ కళలో అందమైన చిత్రాలను కాటన్ బట్టపై వేసి, బాగా ఆరబెట్టి చుట్టూ చెక్కను అమర్చి ఫ్రేంలో బిగించి చక్కగా గోడపై అమర్చేందుకు వీలుగా చిత్రపటాన్ని తయారు చేస్తారు.

అడిగి వేయించుకున్నారు

భార్యాభర్తలు ఇద్దరూ కలిసి చిత్రపటాలు వేయడం మొదలు పెట్టారు. మొదట్లో తమకు తెలిసిన వారు మాత్రమే కొంటూ ఉండేవారు. పెద్దగా ఆదాయం ఉండేది కాదు. సీజన్లో దగ్గర ఊరి వాళ్ళు తమకు కావలసిన పురాణ కథలకు, మహాభారతం వంటి ఇతిహాసాలకు సంబంధించిన బొమ్మలు అడిగి వేయించుకొనేవారు. ఆర్డర్‌లు ఆ సీజన్‌లో మాత్రమే ఉండేవి. మిగతా సమయాలలో కుటుంబాన్ని నెట్టుకు రావడం కష్టంగా ఉండేది. తర్వాత మాస్కులుగా ధరించే కుడ్యాలు తయారు చేయడం మొదలుపెట్టారు. అందమైన ముఖాలను చేసి పెయింటింగ్ వేసేవారు.

ఒక నకాషీ బొమ్మ చేయడానికి



వివిధ దశల్లో ఏడుసార్లు ఆరబెట్టాలి. తయారీకి ఎటువంటి రసాయనాలు వాడకూడదు. సహజ సిద్ధంగా దొరికే రంగురాళ్ల రంగులు, తిరుమని చెట్ల బంక, కిరోసిన్ దీపం మసి, శంఖంపొడి, కూరగాయల నుండి తీసిన రంగులతో ఈ చిత్రాలను బొమ్మలను తయారు చేస్తే నాలుగైదు దశాబ్దాలు చెక్కుచెదరకుండా ఉంటాయి. ఆకారాన్ని దిద్దిన తర్వాత ఒకరోజు బాగా ఎండబెడతారు. బాగా ఎండిన వాటిపై కాటన్ క్లాత్‌ను డల్లాతో అతికించి ఆరిన తర్వాత దానిపైన వైట్ పెయింటింగ్ వేస్తారు. మంగ దంపతులు తయారీలో ఎక్కడా రాజీపడరు. నాణ్యత గల రంగులనే వాడతారు. వీటిని విజయవాడ నుండి తెచ్చుకుంటారు. అందులో తిరుమన్ గోంద్ అనే మంచి రకం జిగురు మాత్రమే వాడతారు. కలర్స్ వేసిన ఈ మాస్కులకు బ్లాక్ కలర్‌తో లైనింగ్ గీసి ఆ కలర్ పోకుండా ఉండటానికి, మెరుపు కోసం వార్నిష్ వేస్తారు. ఇలా బొమ్మలు చేస్తూ అడిగిన వారికి అడిగిన విధంగా అందిస్తూ వచ్చిన డబ్బులతో సర్దుకుపోతూ ఉన్నారు.

అభివృద్ధి చెందుతూ...

కొన్ని ఏండ్ల వరకు ఇదే వృత్తిని జీవనాధారం చేసుకొని గడిపిన వారి కుటుంబానికి మంచి రోజులు వచ్చాయి. తెలిసినవారు ఎవరో లేపాక్షి షోరూం వారు ఇలాంటి ప్రొడక్ట్స్ కొంటారని చెప్పారు. వెంటనే అక్కడికి వెళ్లి వారితో మాట్లాడారు. వారు కొంత స్టాక్ కొనుగోలు చేసి డబ్బులిచ్చారు. తమ దగ్గర స్టాక్ అయిపోయినప్పుడల్లా లేపాక్షి వారు మంగ దగ్గర నుండి స్టాక్ తీసుకోవడం మొదలు పెట్టారు. దాంతో కుటుంబం ఆర్థికంగా కాస్త నిలదొక్కుకుంది. ఒకసారి గొల్లలకు కథలు చెప్పేవారు 52 బొమ్మల సెట్టు కావాలంటూ వచ్చారు. వారు అడిగిన విధంగా అడిగిన సమయానికి మొత్తం తయారుచేసి ఇచ్చారు. ఇక ఆగకుండా అభివృద్ధి మెట్లను ఎక్కటం మొదలుపెట్టారు మంగ. మొట్టమొదటగా గోల్కొండ డిసిహెచ్ వాళ్లు 20 మంది మహిళలకు ట్రైనింగ్ ఇప్పించి స్టైఫండ్ ఇచ్చారు. గోల్కొండ ఎంపోరియం వారు ఎన్నో విధాలుగా మద్దతు ఇచ్చారు. ఏ రకంగా ముందుకు వెళ్లాలో కూడా తెలిపారు. ఒకసారి లలిత కళా అకాడమీ వారు అద్భుతమైన ఈ చిత్రకళను గుర్తించి వీరిని మెక్సికోకి పంపించారు. అక్కడ వర్క్ షాప్ చేయించి రోజుకి 5,000/- వరకు అందించేవారు.

కరోనా కబళించింది

అంతా సజావుగా సాగితే అనుకునే వాళ్ళు ఎవరుంటారు. నెలరోజుల తర్వాత వచ్చిన పెరూ ఎగ్జిబిషన్ కోసం నెట్మా వాళ్లు పెరు ఎగ్జిబిషన్‌కు తీసుకువెళ్తామన్నారు. ఆ ప్రదర్శనకు తెలంగాణ నుండి నలుగురిని మాత్రమే సెలెక్ట్ చేశారు. అందులో చేర్యాల పెయింటింగ్స్ కూడా ఎంపికవడం విశేషం. వాళ్ల మొదట మీ అకౌంట్లో డబ్బు పెట్టుకోవాలన్నారు. తమ దగ్గర ఉన్న రెండు లక్షల స్టాకుతో పాటు, వేరే వారి దగ్గర మరో రెండు లక్షల స్టాక్‌ను కొనుక్కొని నాలుగు లక్షల స్టాకు ట్రాన్స్‌పోర్ట్‌లో వేశారు. బయలుదేరేటప్పుడు ఇంకో లక్ష రూపాయల స్టాక్ తీసుకువెళ్లారు. కష్టమనేది చెప్పి వస్తుందా? అక్కడికి వెళ్లి ఒక్కరోజు అయిందో లేదో కరోనా వచ్చి ట్రాన్స్‌పోర్ట్‌లు ఎక్కడికి అక్కడ ఆగిపోయాయి. స్టాకు ఆగిపోవడంతో పాటు మంగ భర్త కూడా అక్కడే ఆగిపోయారు. ఆ సమయంలో ట్రాన్స్‌పోర్ట్‌లో ఆగిపోయిన ఐదు లక్షల స్టాకు జాడ లేకుండా పోయింది. ఎట్టకేలకు ఎన్నో అగచాట్లు పడి భర్త ఇంటికి చేరినా కరోనా పై అవగాహన లేని చుట్టుపక్కల వారి మాటలు బెంబేలెత్తించేవి. మంగ ఆ గడ్డు పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొంది. ఒక పక్క స్టాకు కోల్పోవడంతో మళ్లీ ఎక్కడైతే మొదలుపెట్టారో వారి పరిస్థితి అక్కడికే చేరుకుంది. కరోనా కారణంగా మరో సంవత్సరం కూడా వారి కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడవలసి వచ్చింది.



వి హబ్ సహకారంతో...

సరిగ్గా అదే సమయంలో వి హబ్ వారితో పరిచయమయింది. వారే ఫోన్ చేసి మీరు ఇందులో జాయిన్ అవుతారా అని అడిగారు. దొరికిన తీగను పట్టుకుని ముందుకు వెళ్లడం తప్ప ఏమీ ఆలోచించలేని పరిస్థితి అప్పుడు. తనకు ఏమీ తెలియకపోయినా ప్రయత్నం అయితే చేద్దాం అని నిర్ణయించుకుంది. కరోనా కాస్త తగ్గాక విహెబ్ నిర్వహించిన మీటింగులకు ఒకటి రెండు సార్లు వెళ్ళి వచ్చింది. వారు నిర్వహించే కార్యక్రమాలన్నీ చాలా నచ్చాయి. వారు చేర్యాల ప్రొడక్ట్స్ చూసి చాలా ముచ్చటపడి తాము కొనుగోలు చేస్తామన్నారు. అలా అనడమే కాకుండా అప్పటికప్పుడే స్టాక్ అంతా కొనుక్కున్నారు.

ఒకదాని వెంటే ఒకటి

2020లో డి.సి.హెచ్ లేపాక్షి వారు 20 మందికి ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఇవ్వమని అడిగారు. ఊరిలో దగ్గరగా ఉన్నవారు ఈ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు వచ్చి చాలా శ్రద్ధగా నేర్చుకున్నారు. వారిలో పదిమంది ఇప్పుడు ఏదైనా పెద్ద ఆర్డర్లు వచ్చినప్పుడు పని చేయడానికి వస్తూ ఉంటారు. ఇద్దరైతే ప్రతిరోజు వస్తూ ఉంటారు. మంగ, మల్లేశంలతో పాటు పనిచేస్తారు. ఆర్డర్ వచ్చినప్పుడు అవసరాన్ని బట్టి మరి కొంత మందిని పిలుస్తూ ఉంటారు. ఇలా తామే కాక ప్రతిరోజు మరో ఇద్దరు, ముగ్గురికి పని కల్పించడం చాలా సంతోషంగా అనిపిస్తుంది అంటారు మంగ. ఆర్థిక పరిస్థితి కాస్తంత మెరుగయింది కదా అనుకునే తరుణంలోనే కుటుంబంలో ఒకదాని వెంట మరొక ఉపద్రవం సంభవించింది. మంగ అమ్మ, అత్తయ్య వారం రోజుల తేడాతోనే చనిపోవడం ఆ కుటుంబానికి తీరని లోటయింది. అప్పుడే భర్తకు యాక్సిడెంట్ అయ్యింది. ఒకే నెలలో జరిగిన ఈ సంఘటనల వల్ల మళ్ళీ కుటుంబం ఇబ్బందుల్లో పడింది. భర్త ఆరోగ్యం మెరుగు పడ్డా వి హబ్ వారిని సంప్రదించింది. వారు మంగ దగ్గర ఉన్న స్టాక్ కొనడానికి మళ్లీ ముందుకొచ్చారు. ఆవిధంగా నెలనెలా కొంత స్టాక్ కొనుగోలు చేస్తూ దాదాపుగా రెండు లక్షల వరకు తీసుకున్నారు. అది ఆ కుటుంబం మళ్లీ ఆర్థికంగా కోలుకోవడానికి దోహదపడింది. "మేము మళ్లీ నిలదొక్కుకోగలిగామంటే దానికి కారణం వి హబ్ దీప్తి గారే" అంటారు మంగ. క్రమంగా కుటుంబం ఆదాయం కూడా కొద్దికొద్దిగా పెరుగుతూ వచ్చింది. ఇతర రాష్ట్రాల నుండి, విదేశాలనుండి వర్క్ షాపులకోసం ఆహ్వానాలు అందడం మొదలైంది.





రాష్ట్ర స్థాయి ఉత్తమ కళగా

నిఫ్ట్ కాలేజీ నుండి, నాగపూర్ నుండి స్టూడెంట్స్ వచ్చి ఈ చేర్యాల కుడ్య చిత్ర, శిల్ప తయారీ విధానాన్ని నేర్చుకొని వెళుతుంటారు. భారతదేశం మొత్తం మీద ఇంతటి అరుదైన చేర్యాల పెయింటింగ్ వేసే కుటుంబాలు ఏడు మాత్రమే ఉన్నాయి. వీటికి సంబంధించి అచ్చులు, ప్రింటింగ్‌లు తయారు చేయకూడదని గవర్నమెంట్ ఆర్డర్ కూడా ఉంది. ఇంతటి అరుదైన కళను రాష్ట్రస్థాయి ఉత్తమ కళగా గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఏటవారు అవార్డును అందజేసారు. కాటంరాజు, గంగాదేవి, గొల్లల బొమ్మలకుగాను స్టేట్ అవార్డు 80,000/- ల రూపాయలు గెలుచుకున్నారు. ఈ అవార్డును ఆమె భర్త మల్లేశం అందుకున్నారు. సిద్దిపేటలో జరిగిన ఎగ్జిబిషన్లో కూడా వీరి స్టాల్ అందరి దృష్టిని ఆకట్టుకొని ప్రథమ స్థానంలో నిలిచి అవార్డును కైవసం చేసుకుంది.

షోకేసుల్లో అలంకరణగా...

మంగకు ఇద్దరు ఆడ పిల్లలు. ఇద్దర్నీ పెద్ద చదువులు చదివించాలని అనుకుంటోంది. పెద్ద పాప పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. రెండవ పాప 9వ తరగతి చదువుతోంది. వారిద్దరూ ఖాళీ సమయంలో తల్లిదండ్రులకు సహాయపడుతూ ఉంటారు. మాకు ఆంగ్లం అస్సలు రాదు. అర్థం కానివన్నీ మా పిల్లలే చదివి చెబుతుంటారు అంటున్నప్పుడు మంగ కళ్ళలో ఒకింత గర్వంతో కూడిన మెరుపులు కనిపిస్తాయి. మారుతున్న పద్ధతులతో పాటు మన ఆలోచనను కూడా మార్చుకోవాలి. మంగ మొదట పెయింటింగ్స్‌ని ఖాదీపైనా, కాన్వాస్ పైన ఎక్కువగా వేస్తూ ఉంటారు. తర్వాత సిల్క్ క్లాత్‌ల పైన కూడా వేయడం మొదలు పెట్టారు. ఇప్పుడు పెళ్లిళ్లలో తెరచల్లాలకు వీరు వేసిన పెయింటింగ్స్‌ని వాడుతున్నారు. చేర్యాల చిత్రకళతో ఉన్న పెన్ స్టాండులు, కీ చైన్‌లను, గణపతి, అర్ధనారీశ్వరుడి మాస్కులను రిటర్న్ గిఫ్టులుగా ఇస్తున్నారు. షో కేసుల్లో అలంకరించుకోవడానికి ఎంతో అందమైన కళాకృతులను తయారు చేస్తున్నారు. ఆర్డర్ ఇచ్చి చేయించుకునే వారికి వారు చెప్పిన విధంగా తయారు చేసి కొరియర్ చేస్తున్నారు. మరికొందరు ఈ పెయింటింగ్‌లను తమ ఇంటి గోడల పైన వేయించుకుంటున్నారు.

తనదైన ఆత్మవిశ్వాసంతో...

అద్దె ఇంట్లో పనికి ఇబ్బంది అవ్వటం వల్ల సొంత ఇంటి కోసం సహాయం అడగగా విహబ్ వారు సమ్మతించి కొంత లోన్ మంజూరు చేసారు. ఆ మొత్తంతో సొంత ఇల్లు కట్టుకొని మరింత మందికి ఉపాధి కల్పించగలనని తనదైన ఆత్మవిశ్వాసంతో చెబుతూ ముందుకు సాగుతున్నారు మంగ. మార్కెటింగ్ నైపుణ్యాన్ని జోడించి సరికొత్త ఆవిష్కరణలతో మరింత ఉపాధి పొందుతున్నారు. నెలకు 10,000 రావడం గగనమయ్యే పరిస్థితి నుండి ఇప్పుడు నెలకు 70,000/- వరకూ సంపాదించ గలుగుతున్నారు. వి హబ్ వారి వల్ల చేర్యాల పెయింటింగ్‌కు మరింత గుర్తింపు వచ్చింది. ఎక్కువ మందికి దీని గురించి తెలిసింది. ఇప్పుడు నన్ను కూడా చాలా మంది గుర్తు పడుతున్నారు అని సంతోషంగా చెప్తుంటారు మంగ.

- విశ్వైక, 9550183143

సమాజ మనస్తత్వాన్ని మార్చాలి



న్యూఢిల్లీ : మానవాళి పురోగతిలో మహిళలను సమాన భాగస్వాములుగా చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కి చెప్పారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో అట్టడుగు స్థాయిలో నిర్ణయాధికార సంస్థల్లో మహిళలకు మంచి ప్రాతినిధ్యం ఉన్నదనీ, కానీ మనం పైకి వెళ్లే కొద్దీ ఆడవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్నదని వివరించారు. దేశంలోని మహిళలది అలుపెరగని స్ఫూర్తిని వివరించారు. "ప్రతి స్త్రీ కథ నా కథ" అని పేర్కొంటూ సమాజంలో మహిళల స్థితిగతుల గురించి మాట్లాడారు.

"21వ శతాబ్దంలో మహిళలు అన్ని రంగాలలో అనూహ్యమైన పురోగతిని సాధించినప్పటికీ, ఇప్పటి వరకు ఏ మహిళ కూడా అనేక దేశాలలో రాష్ట్ర, ప్రభుత్వానికి అధిపతిగా మారలేదు" అని పేర్కొన్నారు. "ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా నా ఎన్నిక మహిళా సాధికారత కథలో ఒక భాగం" అని అన్నారు. నేడు లెక్కలేనంత మంది మహిళలు తాము ఎంచుకున్న రంగాల్లో పని చేస్తూ దేశ నిర్మాణానికి సహకరిస్తున్నారని అన్నారు. "సమాజంలో ప్రబలంగా ఉన్న మనస్తత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉన్నది. శాంతియుత, సుసంపన్నమైన సమాజాన్ని నిర్మించాలంటే, లింగ అసమానత ఆధారంగా పాతుకుపోయిన పక్షపాతాలను అర్థం చేసుకోవడం, విముక్తి పొందడం అవసరం" అని పేర్కొన్నారు. మానవాళి పురోగతిలో మహిళలను సమాన భాగస్వాములను చేస్తే మన ప్రపంచం సంతోషకరమైన ప్రదేశంగా ఉంటుందని ద్రౌపది ముర్ము అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేండ్లు పూర్తయ్యే వరకు 'అమృత్ కాల్' యువతుల కాలమని చెప్పారు. "ఈ రోజు నేను మీ ప్రతి ఒక్కరినీ మీ కుటుంబంలో, ఇరుగుపొరుగు, కార్యాలయంలో మార్పు తీసుకురావడానికి మిమ్మల్ని మీరు సన్నద్ధం కావాలని కోరుతున్నాను. పిల్లల ముఖంలో చిరునవ్వు కలిగించే ఏదైనా మార్పు, ఆమె చేసే ఏదైనా మార్పు భావితరాలకు ఉజ్వల భవిష్యత్ నందిస్తోందని " అని అన్నారు.

దయనీయ స్థితిలో భారత ప్రజాస్వామ్యం

న్యూఢిల్లీ : భారత్‌లో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని ప్రవాస భారతీయులు సైతం ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ బ్రిటన్ పర్యటనకు అనూహ్య స్పందన కనపడుతోంది. సోమవారం లండన్‌లో 'చాతాం హౌస్'లో వివిధ వర్గాలతో కలిసి రాహుల్‌గాంధీ భారత రాజకీయాలపై మాట్లాడారు. మీడియా ప్రముఖులు, ప్రవాస భారతీయులు, ఆయన మద్దతుదారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో పాల్గొన్న ఓ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త కుమార్తె మాళినీ మెహ్రా భారత్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రస్తుత నా దేశం అత్యంత దయనీయమైన పరిస్థితిలో ఉంది. మా నాన్న ఒకనాడు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. తన దేశం గురించి గర్వపడేవారు. కానీ నేడు ఆ భావన నా తండ్రిలో లేదు. ప్రస్తుత భారత్‌ను ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. మనదేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి మేమంతా ఏం చేయాలి" అని రాహుల్‌గాంధీని ఆమె ప్రశ్నించారు. ఆమె అభిప్రాయాన్ని స్వాగతిస్తూ రాహుల్‌గాంధీ, "ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు మీకు కృతజ్ఞతలు. ముఖ్యంగా దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితిపై మీరు మాట్లాడారు. అందుకు మిమ్మల్ని అభినందించాలి. మీ అభిప్రాయాన్ని వ్యక్తం చేయటమన్నది చాలా శక్తివంతమైంది. భారత్ కోల్పోయిన ప్రజాస్వామిక విలువల గురించి మీరు మాట్లాడారు" అని అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కబంధ హస్తాల్లో ప్రజాస్వామ్యం

'చాతాం హౌస్'లో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ ఆర్‌ఎస్‌ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్టు సంస్థగా మారిందన్నారు. భారత్‌లోని రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ఆక్రమించిందని, ప్రజాస్వామ్య స్వభావాన్ని మార్చిందనీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఒక రహస్య సమాజంగా పనిచేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకొని రాజకీయ అధికారాన్ని కైవసం చేసుకుందని, అధికారం దక్కాక..ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేస్తోందన్నారు. మీడియా, న్యాయవ్యవస్థ, పార్లమెంట్, ఎన్నికల సంఘం..కీలకమైన రాజ్యాంగ సంస్థలన్నీ ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆరోగ్య మహిళ షురూ



(మొదటిపేజీ తరువాయి)

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్స్ ఇస్తున్నాం" అని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. మహిళల్లో చైతన్యం రావాలని, సీ సెక్షన్ డెలివరీలు తగ్గాలని అన్నారు. ప్రభుత్వం న్యూట్రిషన్ పాలసీ పేరుతో కార్యక్రమాలు చేపడుతుంటే.. మరోవైపు బీజేపీ ప్రభుత్వం పార్టీషన్ పాలిటిక్స్ చేస్తోందన్నారు. బుధవారం కరీంనగర్ నగరంలోని బుట్టి రాజారాం కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మార్క్‌ఫెడ్‌లో నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ రెండు కార్యక్రమాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. మహిళలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న వడ్డీ లేని రుణాలను సీఎం కేసీఆర్ ఈరోజే విడుదల చేశారన్నారు. మొదటి దశలో రూ.750 కోట్లు వడ్డీ లేని రుణాలను మహిళల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. రెండో దశ రుణాలను 3, 4 నెలల తర్వాత అందజేస్తామన్నారు. మహిళల కష్టాలు తీర్చేందుకు అనేక పథకాలు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దని, మిషన్ భగీరథ, ఆడపిల్లల కోసం రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభించామని తెలిపారు. గర్భిణుల కోసం ఆరోగ్య లక్ష్మి, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్, ఆడపిల్లల పెండ్లి కోసం కల్యాణ లక్ష్మి వంటి అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఆరోగ్య మహిళ స్కీంలో భాగంగా ప్రత్యేక ఆస్పత్రుల సంఖ్యను దశలవారీగా పెంచుతామని తెలిపారు. ఈ పథకంలో మహిళలకు షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ కేన్సర్లు, స్క్రీనింగ్ చేయనున్నారు. థైరాయిడ్, అయోడిన్ సమస్య, రక్తహీనత తదితర సమస్యలకు సంబంధించి రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతోపాటు వైద్యమూ అందించనున్నారు. హార్మోన్ రీప్లేస్‌మెంట్, థెరపీ మెడికేషన్స్ సహా వైద్య సలహాలు, సూచనల కోసం కౌన్సిలింగ్ కూడా ఇస్తారని చెప్పారు. డయాగ్నోస్టిక్స్, క్యాన్సర్ స్క్రీనింగ్ సహా వెయిట్‌మేనేజ్‌మెంట్, రుతుస్రావ సమస్యలు, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్‌ఫెక్షన్లు, ఇన్‌ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, ఐవీ, యూటీఐ అండ్ పెల్విక్ ఇన్‌ఫ్లమేటరీ సహా అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ టెస్టుకు రెఫర్ చేయనున్నారు.

సర్జరీలు, ఇతర అడ్వాన్స్‌డ్ వైద్య పరీక్షల కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక సెంటర్ పెడుతున్నామని చెప్పారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో రూ.3.14 కోట్లతో నిర్మించిన 'ఆరోగ్య మహిళ' ప్రాంగణం, పీసీఓడీ, ఫ్యామిలీ ప్లానింగ్ ఇన్ ఫెర్టిలిటీ వార్డు, రూ.80 లక్షలతో డయాగ్నస్టిక్ రేడియాలజీ, మాతా శిశు సంరక్షణ కేంద్రం మూడో అంతస్తులో రూ.6.25కోట్లతో ఏర్పాటుచేసిన అదరపు పడకలు, రూ.23.75 కోట్లతో నిర్మించిన క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనాలను ప్రారంభించారు. మహిళా దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ మహంతి సహా పలువురు జిల్లా మహిళా అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, జడ్‌పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ సునీల్ రావు, శాసనసభ్యులు రసమయి, రవిశంకర్ సహా ఆయా కార్పొరేషన్ల చైర్మెన్లు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

నేడు క్యాబినెట్ భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ప్రగతిభవన్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు క్యాబినెట్ భేటి కానుంది. ఈ సమావేశానికి మంత్రులు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి మంత్రిమండలి నిర్ణయాలు తీసుకోనుందని ఇప్పటికే సీఎంవో ప్రకటించిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్న 10 బిల్లులపైనా చర్చ జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. సొంత జాగాల్లో ఇండ్లు కట్టుకునేవారికి ఆర్థిక సాయం చేసే విషయం, పోడు భూముల విషయంలో గిరిజనులకు పట్టాలు ఇచ్చే విషయం, గొర్రెల పంపిణీ పథకం, దళితబంధు తదితర అంశాలూ చర్చకు రానున్నట్టు తెలిసింది. క్యాబినెట్ భేటి అనంతరం రాజకీయపరమైన విషయాలను మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడనున్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మంత్రులు, ఎమ్మెల్యేల పరిస్థితికి సంబంధించి సీఎం కేసీఆర్ చేయించిన ప్రత్యేక సర్వేపై కూడా మాట్లాడనున్నారు. రాజకీయంగా బీఆర్‌ఎస్‌ను ముందుకు తీసుకుపోవడంతోపాటు నియోజకవర్గాల్లో వ్యక్తులవారీగా మంత్రులు, ఎమ్మెల్యేల ప్లస్‌లు, మైనస్‌లు కూడా చర్చించే అవకాశం ఉందని బీఆర్‌ఎస్ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి.

గవర్నర్, సీఎస్ వివాదం

రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారిపై విమర్శలు చేసిన నేపథ్యంలో క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులతో సీఎం చర్చించే అవకాశం లేకపోలేదని టీఆర్‌ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఢిల్లీ కంటే రాజ్‌భవన్ దగ్గరగా ఉందంటూ, సీఎస్ అయిన తర్వాత కనీసం ప్రోటోకాల్ కూడా పాటించరా ? అని గవర్నర్ ట్వీట్ చేసిన విషయం విదితమే. దీనిపై ప్రభుత్వంతోపాటు ఐఏఎస్‌ల్లోనూ చర్చకు దారితీసింది. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి తీర్మానం చేసిన దాదాపు 10 బిల్లులను ఆమోదించకుండా నెలల తరబడి రాజ్‌భవన్ పెండింగ్ పెట్టిన నేపథ్యంలో సీఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడమే ఈ వివాదానికి మూల కారణం కావడం గమనార్హం.

కవిత అంశంపైనా...

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం కూతురు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులపైనా మంత్రులు, న్యాయశాఖ అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడే అవకాశం ఉందని ప్రగతిభవన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కవిత బుధవారం సాయంత్రం ఢిల్లీ బయలుదేరివెళ్లారు. ఈడీ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో గురువారం విచారణకు హాజరవుతారా ? లేదా ? అనే సంగతి ఉత్కంఠగా మారింది. ఇదిలావుండగా శుక్రవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర మహిళా బిల్లు ఆమోదం కోసం కవిత దీక్ష చేయనున్న విషయం విదితమే. భారత జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఆయా పార్టీల నేతలు, మహిళా సంఘాలను ఇప్పటికే ఆహ్వానించి ఉన్నారు. దానికి సంబంధించిన ఏర్పాట్ల కోసం గురు, శుక్రవారాల్లో ముందస్తు షెడ్యూల్ కార్యక్రమాలు ఉన్నాయని కవిత బుధవారమే ట్విట్ చేశారు. ఈ పరిస్థితుల్లోనే ఈడీని గడువు కోరినట్టు సమాచారం. విచారణకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నప్పటికీ, ముందస్తు కార్యక్రమాలు ఉన్నాయనీ, దీనిపై ఏం చేయాలనే దానిపై బీఆర్‌ఎస్ నేతలతోపాటు న్యాయనిపుణులతోనూ కవిత ఇప్పటికే చర్చించిన అనంతరమే ఢిల్లీ వెళ్లిపోయారు. కాగా ఈడీ విచారణకు కవిత హాజరయ్యే అవకాశం లేదని తెలిసింది. శుక్రవారం మాత్రం కచ్చితంగా ధర్నాలో పాల్గొనే అవకాశం ఉంది. కవితకు ఈడీ నోటీసులపై క్యాబినెట్ సమావేశం తర్వాత సీనియర్ మంత్రులు, ఉన్నతాధికారులు, న్యాయకోవిదులతో సీఎం చర్చించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే దీనిపై ఒక నిర్ణయానికి వచ్చారనీ, ఆ నేపథ్యంలో కవితకు 'నువ్వు ఢిల్లీ వెళ్లు..శుక్రవారం జరిగే ధర్నాపైనే దృష్టిపెట్టు..మిగతా విషయాలు వదిలేసేయ్' అని కేసీఆర్ స్పష్టత ఇచ్చారని బీఆర్‌ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఆ మేరకే కవిత ఆమె ఢిల్లీ పయనమైనట్టు తెలిసింది.

10న బీఆర్‌ఎస్ పార్లమెంటరీ, శాసనసభాపక్షం, పార్టీకార్యవర్గం

ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ, శాసనసభాపక్షంతో పాటు రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో జరుగనున్నది. ఈ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ పార్లమెంట్ సభ్యులు, శాసనసభ, శాసనమండలి సభ్యులు, పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లాల పార్టీల అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మెన్లు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మెన్లు, డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మెన్లు పాల్గొననున్నారు. ఎన్నికల సంవత్సరం నేపథ్యంలో ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరు, పార్టీ కార్యకలాపాలు, తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఆహ్వానితులు ప్రతీ ఒక్కరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని అధినేత సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఎన్నికల వేళ బీఆర్‌ఎస్ కార్యాచరణపై సీఎం కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

వామ్మో.. వైరల్ ఫ్లూ

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ప్రముఖ వైద్యుల అభిప్రాయం ప్రకారం ఆస్పత్రుల్లో చేరే పిల్లలు, ఆపై వయసు వారిలో ఎక్కువమంది జ్వరం, దగ్గు, నిమోనియావంటి లక్షణాలతో వస్తున్నట్టు చెప్పారు. ఇష్టానుసారంగా యాంటీబయాటిక్స్ వాడొద్దని సూచిస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూసి భయపడొద్దని ధైర్యం చెబుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జ్వరం, పసరికలు, డెంగ్యూ వంటి వాధ్యులొస్తున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజూ 150 మంది ఔట్ పేషెంట్లు వచ్చేవారు. వారం రోజులుగా ఆ సంఖ్య 250కి చేరింది. ఆస్పత్రికి వస్తున్న వారిలో ఎక్కువ శాతం వైరల్ ఫీవర్, డెంగ్యూ, చలిజ్వరం, పసరికలతో బాధపడుతున్నవారే అధికంగా ఉన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉన్నా వైద్యానికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూస్తున్నామని వైద్యాధికారులు తెలిపారు.

సొంతవైద్యం ప్రమాదకరం : దాక్టర్ కె.శివకుమార్, వైద్యనిపుణులు, కరీంనగర్

పిల్లల విషయంలో తల్లిదండ్రులు సొంత వైద్యం చేయకూడదు. మెడికల్ దుకాణాల్లో ఇచ్చే యాంటీబయాటిక్స్ వాడొద్దు. వైద్యులను సంప్రదించి.. జ్వరం, దగ్గు లక్షణాలను బట్టి వైరస్ ప్రభావం ఏ మేరకు ఉందో నిశితంగా పరిశీలించి వారి సూచన మేరకే మందులు వాడాలి. వాతావరణంలో వచ్చిన మార్పులు, వైరస్ ప్రభావం తీవ్రంగా ఉండటంతో పిల్లల్లో జ్వరం, దగ్గు వారంపాటు ఉంటోంది.

ఆర్థిక స్వేచ్ఛకు దూరం..

(మొదటిపేజీ తరువాయి)

ఇంటర్వ్యూ జరిపిన 'ఇండియా లెండ్స్' ఈ గణాంకాల్ని విడుదల చేసింది. శ్రామిక మహిళల్లో దాదాపు సగం మంది సోషల్ మీడియా ద్వారా ఆర్థిక అంశాల్ని నేర్చుకుంటున్నారని, 30శాతం మంది వార్తా కథనాల నుంచి, 20శాతం మంది వర్క్‌షాప్‌లు, సెమినార్‌ల నుంచి నేర్చుకుంటున్నారని సర్వే కనుగొన్నది. శ్రామిక మహిళల్లో మూడింట ఒకవంతు మాత్రమే ఆర్థిక నిర్ణయాలన్నింటిపై నమ్మకంతో ఉన్నారు. "మా సర్వేలో పాల్గొన్న మహిళల్లో 70శాతం మంది ఆదాయాలు రూ.5 లక్షల లోపున్నాయి. రూ.5లక్షల నుంచి రూ.10లక్షల మధ్య ఆదాయం గలవారు 23శాతం మంది ఉన్నారు. వీరంతా తమ ఆదాయంలో గరిష్ట భాగాన్ని ఇంటికోసం వినియోగిస్తున్నారు. అయినప్పటికీ 67శాతం మంది మహిళలు ఆర్థిక నిర్ణయాల్లో సాధికారతను కలిగిలేరు. ఆర్థిక అవసరాల కోసం భర్త లేదా తండ్రి లేదా సోదరుడిపై ఆధారపడుతున్నారు" అని నివేదిక పేర్కొంది.

ఆర్థిక నిర్ణయాలు తీసుకోవటంలో తమపై ఎవరి ప్రభావమూ లేదని 22శాతం మంది మహిళలు చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా మారాలని 25శాతం మంది తమ అకాంక్షను వ్యక్తం చేశారు. వృత్తిపరంగా మరింత ఎదగాలని, ఇందుకోసం తమ వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని మరో 25శాతం మంది చెప్పారు. తమ సర్వేపై 'ఇండియాలెండ్స్' సీఈవో గౌరవ్ చోప్రా మాట్లాడుతూ, "మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలను వారే చూసుకొనేలా సాధికారత కల్పించడం కేవలం నైతిక అవసరం మాత్రమే కాదు, ఆర్థిక అవసరం కూడా. సమాజంగా మనం సంప్రదాయ అడ్డంకులను ఛేదించి, అందరికీ సమాన అవకాశాలను కల్పించాల్సిన సమయం ఇది' అని చెప్పారు. నేడు ప్రతి ఇంటిలోని మహిళా ఆర్థిక అంశాల్ని తెలుసుకోవటంపై ఆసక్తితో ఉన్నారని అన్నారు.

యూపీలో రెచ్చిపోయిన గో గూండాలు

- **పశువులు తరలిస్తున్నాడంటూ ట్రక్ డ్రైవర్‌పై కాల్పులు**

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పాలనలో గో గూండాలు మరోసారి రెచ్చిపోయారు. పశువులను అక్రమంగా తరలిస్తున్నాడన్న నెపంతో ఒక ట్రక్కు డ్రైవర్‌పై కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ప్రస్తుతం చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. లక్నోలోని మోహన్ నగర్‌లో బుధవారం ఉదయం ఒక కల్వర్ట్ వద్ద గో గూండాలు ఈ కాల్పులకు తెగబడ్డారు. కాల్పుల్లో గాయపడ్డ డ్రైవర్‌ను ప్రేమ్ సింగ్ యాదవ్‌గా గుర్తించారు.

ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్‌లో పతకం సాధించిన డీసీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో
చండీగఢ్‌లో జరిగిన 15వ ఆలిండియా పోలీస్ బ్యాడ్మింటన్‌లో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ తరపున పాల్గొని 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన డీసీపీ (రోడ్ సేఫ్టీ) బాలను రాచకొండ పోలీస్ కమిషనర్ డి.ఎస్ చౌహాన్ ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో సీపీ మాట్లాడారు. భవిష్యతులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అందుకు కావలసిన సహకారం కమిషనరేట్ తరపున ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని డీసీపీ బాల తెలిపారు.

కమలా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



నవతెలంగాణ-హయత్‌నగర్
ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఈ రెడ్డి గార్డెన్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సతీమణి దేవిరెడ్డి కమలా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నియోజకవర్గ స్థాయి మహిళలతో నిర్వహించారు. మొత్తం 11 డివిజన్ పరిధిలో ఉన్న బీఆర్ఎస్ మహిళా అధ్యక్షులతో భారీ ఎత్తున సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఎల్బీ నగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ, మన్సురాబాద్ డివిజన్ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగమించిన నాడే దేశాభివృద్ధి

- మహిళా సాధికారతే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర పథకాలు
- విద్యశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- ఘనంగా మహిళా దినోత్సవ సంబరాలు



నవతెలంగాణ - మీర్‌పేట్
మహిళలు అన్ని రంగాల్లో పురోగమించిన నాడే దేశం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో మహిళల అభ్యున్నతి, సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ప్రవేశపెట్టిన పథకాలతో మహిళా సంక్షేమ రాష్ట్రంగా వెలుగొందుతున్నదని అన్నారు. ఆడబిడ్డ తల్లి కడుపులో ఎదుగుతున్న దశ నుంచి జననం, ఆరోగ్యం, రక్షణ, సంక్షేమం, విద్య, వివాహం, వికాసం, సాధికారత లక్ష్యంగా గొప్ప పథకాలను అమలు చేస్తూ ఆడబిడ్డను కంటికి రెప్పలా కాపాడుతున్న ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం వివరించారు. మహిళ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమర్థవంతమైన కార్యాచరణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.750 కోట్లకు పైగా వడ్డీలేని రుణాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నది. అభయహస్తం పథకం కింద రూ. 546 కోట్ల చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేసి మహిళా వికాసం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు. మహిళా దినోత్సవ కార్యక్రమానికి విచ్చేసినటువంటి మహిళాకార్పొరేటర్లని, కోఆప్షన్ సభ్యురాలు, మహిళా పోలీసులు, వైద్య శాఖలో పనిచేస్తున్నటువంటి మహిళా సోదరీమణులు, మహిళా సంఘాల మహిళలు, మున్సిపల్ కార్పొరేషన్‌లో మహిళా ఉద్యోగులను శాలువాతో సత్కరించి, మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం ఎంపి సంతోష్‌కుమార్ ఛాలెంజ్‌ని స్వీకరించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి చందన చెరువు కట్టపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఫ్లోర్ లీడర్ భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కార్పొరేటర్ సిద్దాల లావణ్య, స్థానిక కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు పద్మారెడ్డి, మహిళా సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు భారీగా హాజరైన మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.

మతసామరస్యం కాపాడడానికి ఎల్లవేళలా కృషి

- వదంతులు నమ్మొద్దు
- రాచకొండ సీపీ డీ.ఎస్. చౌహాన్



నవతెలంగాణ-సిటీబ్యూరో
రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మతసామరస్యం కాపాడేందుకు పోలీసులు ఎల్లవేళలా కృషి చేస్తున్నారని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఎలాంటి వదంతులు నమ్మొద్దన్నారు. ముస్లింలు జరుపుకొనే 'షబ్ ఏ బరాత్' పర్వదినం సందర్భంగా సీపీ పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఎల్బీనగర్, సరూర్‌నగర్, రామాంతపూర్, నాచారం, మౌలాలి, పహాడీషరీఫ్ వంటి ప్రాంతాలకు వెళ్లిన సీపీ భద్రతా ఏర్పాట్లపై స్వయంగా ఆరా తీశారు. మసీదుల ప్రాంగణాల్లో అర్ధరాత్రి వరకు జాయింట్ సీపీ వి.సత్యనారాయణతో కలిసి పర్యవేక్షించారు. మంగళవారం రాత్రి సమయంలో ఆయా ప్రాంతాల్లో విధుల్లో ఉన్న పోలీసుల నుంచి శాంతిభద్రతల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు, సలహాలను అందించారు. రాచకొండ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ముస్లింలు సంతోషంగా, ప్రశాంతంగా ప్రార్థనలు జరుపుకోవడానికి పోలీసులు అవసరమైన తోడ్పాటు, సహకారం ఎప్పటికీ అందిస్తారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డిలతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ కొల సత్యనారాయణ



నవతెలంగాణ-వనస్థలిపురం
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ కొల సత్యనారాయణ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బుధవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్‌తో కేక్ కట్ చేయించి, శాలువాలతో సత్కరించి, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా నిలదొక్కుకుని తమ కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డిటెక్టివ్ సీఐ వెంకటయ్య, ఎస్సైలు స్వామి, వెంకటేశ్వర్లు, జగన్, రవి, మాధవరెడ్డి, పరమేష్, ఎస్‌బి శంకర్, హెడ్ కానిస్టేబుల్ నందీశ్వర్, కానిస్టేబుల్ కృష్ణ, మహిళా కానిస్టేబుల్స్ మేరీ కుమారి, అమృత, భాగ్యశ్రీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించాలి

సీఎఫ్ఓ కవిత కరుణాకర్



నవతెలంగాణ-ఉప్పల్
మహిళలు ఏ రంగంలోనైనా రాణించి తమ ప్రతిభను చాటాలని, ప్రస్తుత సమాజంలో మార్కెట్ రంగంలో రాణించి తన నైపుణ్యాలను వెలికితీసి వ్యాపార రంగంలో దూసుకెళ్లాలని ఐకాన్ ఇన్ఫ్రా సీఎఫ్ఓ సూచించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడుతూ చిన్నతనం నుండే వ్యాపారరంగంపై పట్టు సాధించి మహిళలకు ఆదర్శంగా నిలిచి, ఒక సంస్థ ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో చిన్నతనం నుండి విద్యారంగంలో రాణించి తమ ప్రతిభను చాటానని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం ఉంటే మహిళలు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో రియాల్టీ రంగంలో తాను రాణించి ఎందరికో తన అనుభవాలను తెలుపుతూ, వారికి సైతం రియాల్టీ రంగంలో రాణించేలా మహిళలకు ప్రోత్సహిస్తున్నానని ఆమె తెలిపారు.

న్యాచురల్ ఫామింగ్ తమ డ్రీమ్ ప్రాజెక్ట్

నాచురల్ ఫామింగ్ ద్వారా ప్రజలకు పురాతన కాలం నుండి వస్తున్న గానుగ పద్ధతిలో నూనె తయారు చేయడం, ఆవుపాలు అందించి ఆరోగ్యమైన జీవితాన్ని కల్పించాలని తమ ధ్యేయమన్నారు తన సహకారాన్ని ఎవరికైనా అందిస్తానని ఆమె పేర్కొన్నారు.

మహిళలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి



నవతెలంగాణ - సరూర్‌నగర్
మహిళలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలి అని ఆర్.కె.పురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో మహిళదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ హాజరైనారు. మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్, సునీత రెడ్డి, చామల శైలజ, మాధవి, యాదమ్మ, బుజ్జిబాయ్, మున్నేమ, నాయకులు కొంద్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, ఎల్లయ్య, దుబ్బాక శేఖర్, వెంకటేష్ గౌడ్, షఫీ, వేణు, జగన్, పటేల్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా బుధవారం నాడు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళలు లేకుండా సమాజం లేదని అందుకే మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సాహించాలని అన్నారు.

-నవతెలంగాణ,బోడుప్పల్

అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దు

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



నవతెలంగాణ-బోడుప్పల్
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందుల పాలు చెయ్యవద్దని టీజేఎస్ అధ్యక్షుడు ఆచార్య కొదండరాం అన్నారు. బుధవారం నాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా వక్ఫ్ బోర్డు భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వక్ఫ్ బోర్డు బాధితుల పోరాట జేఏసీ అధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహర దీక్షకు మద్దతు తెలిపిన కోదండరాం మాట్లాడుతూ ముప్పై సంవత్సరాల క్రితం లే అవుట్లు చేసి ఇంటి అనుమతులు పొంది, బ్యాంకు లోన్లు తీసుకుని ప్రతి ఏటా పన్నులు కడుతున్న భూములను వక్ఫ్ బోర్డు భూములంటూ నిషేధిత జాబితాలో పొందుపరచడం ప్రజలను ఇబ్బందులకు గురిచెయ్యడమేనని అన్నారు. కేసీఆర్ సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చెయ్యాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాన్ని నిర్వహించి సర్కారు మెడలు వంచి నిషేధిత జాబితా నుండి ఈ భూములు కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు పోగుల నరసింహ రెడ్డి, కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కుంభం కిరణ్ కుమార్‌రెడ్డి, కాలనీల మహిళలు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారులపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విగ్నేశ్



నవతెలంగాణ-తుర్కయంజాల్
వడ్డెర వృత్తిదారులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విగ్నేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలో 774 సర్వే నెంబర్ గల ప్రభుత్వ భూమిలో గల నాలుగు ఎకరాల 21 గుంట భూమిలో వడ్డెర వృత్తి చేసుకుంటున్న భూమిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో పోలీస్ పటేల్ దగ్గర నుండి తీసుకుని వడ్డెర హరిమాల సొసైటీకి రిజిస్ట్రేషన్ నెంబర్ టీబీ 366/88 ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. గత 50 సంవత్సరాల నుండి ఈ భూమిలో వడ్డెర వృత్తిని చేసుకుంటూ సుమారు 25 కుటుంబాలు ఈ కార్వీలపై పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని, కొంతమంది పెత్తందారులు ఈ భూమిపై కన్ను వేసి ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం, రెవిన్యూ అధికారులు చొరవతీసుకొని ఈ భూమిని సమగ్రంగా సర్వే చేసి చుట్టూ హద్దురాళ్ల నాటి, వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా వడ్డెర వృత్తిదారులకు రక్షణ కల్పించాలని కోరారు. కుర్మ సంఘం నాయకులు, కుర్మ యువకులు దౌర్జన్యంగా భౌతిక దాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వడ్డెర వృత్తిదారులపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు పల్లపు శివకుమార్, పల్లపు ఆంజనేయులు, పల్లపు రంగయ్య, పల్లపు యాదయ్య, బాల్‌రాజ్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా ఎదగాలి



డాక్టర్ డి.శిరీష, ఎంఎస్. ఓబీజే

నవతెలంగాణ-వనస్థలిపురం
మహిళలు ఉన్నత చదువులు చదివి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, తద్వారా కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని జీవన సాయి మల్టీస్పెషాల్టి ఆసుపత్రి ఎంఎస్. ఓబీజే డి.శిరీష అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నవతెలంగాణ ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదివి గత 13 సంవత్సరాలుగా వనస్థలిపురంలోని మహిళలకు వైద్య సేవలు అందిస్తూ మరింత మెరుగైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో జీవన సాయి ఆసుపత్రిని మల్టీస్పెషాల్టి హాస్పిటల్‌గా ఏర్పాటుచేసి ఆధునికరణమైన మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వనస్థలిపురం వాసులతోపాటు నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వైద్య సేవలు పొందడానికి తమ వద్దకు మహిళలు అధికంగా వస్తారని అన్నారు. పీజీ చదువుతున్న సమయంలోనే 2007లో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రామదాసుతో వివాహం అయిందని, తనకు బాబు, పాప ఉన్నారన్నారు. చిన్ననాటి నుంచి డాక్టర్ చదివి పది మందికి సేవ చేయాలన్న సంకల్పంతోనే ముందుకు సాగాను అన్నారు. తన ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలకు తావు ఇవ్వకుండా నార్మల్ డెలివరీకే ప్రాముఖ్యత ఇస్తున్నట్లు డాక్టర్ శిరీష తెలిపారు. తన వద్దకు వస్తున్న మహిళ రోగులకు తన వంతు సహాయ సహకారాలు అందించడంలో హామీ ఇచ్చారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగాలి

శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి



నవతెలంగాణ-వనస్థలిపురం
మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగి, ఆర్థికంగా సామాజికంగా నిలదొక్కుకుని తన కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకుని వెళ్లాలని వనస్థలిపురం శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ బి.రాజ్యలక్ష్మి సూచించారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని నవతెలంగాణ ప్రతినిధితో ఆమె మాట్లాడుతూ ఎంఏ, ఎంబీఏ, ఎంఎస్‌సి, డిగ్రీ డిప్లమాలతోపాటు ఎన్.సి.సి, రైఫిల్ షూటర్‌లో కూడా నేర్పరితనాన్ని సాధించాను అన్నారు. తాను నిర్వహిస్తున్న పాఠశాలలో 70 మంది మహిళా ఉపాధ్యాయులు విధులకు హాజరై విద్యార్థులకు బోధనలో నిమగ్నమై ఉంటారన్నారు. ఇప్పుడు ఉన్న రోజుల్లో మహిళలు ఎవరిపై ఆధారపడకుండా తన కష్టంపై ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. తన భర్త డి.రితీష్ కుమార్ లహరి ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహిస్తున్నారని, తనకు ఇద్దరు కుమారులని ఆమె తెలిపారు. చదువుపై మక్కువతో ఈ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారని, తన వంతు సేవా సహకారాలు తమ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్నానని తెలిపారు. చదువుతోనే అభివృద్ధి, చదువుతోనే ఆర్థికంగా నిలదొక్కుకోగలమని విద్యార్థులకు తెలియజేస్తూ విద్యాబోధన చేస్తున్నామన్నారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లితండ్రులు కొంత సమయాన్ని తమ పిల్లలకు కేటాయించి సమాజంలో జరుగుతున్న పరిణామాలను వరకు విపులంగా వివరించాలన్నారు. సమాజంపై అవగాహన ఉన్న ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తాడని ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఘన సన్మానం



నవతెలంగాణ-హయత్‌నగర్
దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హయత్ నగర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎర్ర రవీందర్, పారంద స్వామిలు మాట్లాడుతూ కోడి కూతకు ముందే లేచి గ్రామాలలో ఉన్న చెత్తాచెదారంతో పాటు రోడ్లను గ్రామాల్లో ఉన్న ఉన్నటువంటి చెడును ముట్ట రానటువంటి వాటిని కూడా ముట్టుకొని తొలగించి గ్రామాలను అద్దంలాగా తయారు చేస్తారు పరిశుధ్య కార్మికులు, ఇప్పటికీ కూడా వాళ్ల శ్రమను గుర్తించకపోవడం చాలా బాధాకరం అన్నారు. సావిత్రిబాయి పూలే అన్నట్టు స్త్రీ వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాలలో ముందుండాలని సావిత్రిబాయి పూలే ఆలోచన ఆశ ఆశయం, వారి కలలను నిజం చేస్తూ పారిశుధ్య పని మొదలుకొని అన్ని రంగాలలో స్త్రీలు ముందుడం చాలా సంతోషకరం. ఇప్పటికైనా ప్రభుత్వం వారి శ్రమను గుర్తించి వారికి కావలసిన సబ్బులు, బూట్లు, బ్లౌజులు, నూనె డబ్బాలను వెంటనే అందించి ఆదుకోగలరని ప్రభుత్వాన్ని కోరారు. వీళ్ళ శ్రమను గుర్తించి ప్రభుత్వం ఒక జీవిత బీమా అంటే 25లక్షల బీమాను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికురాలు యాదమ్మ కృష్ణమ్మ భాగ్యలక్ష్మి, స్వప్న, పావని, శ్రావణి, వీరితో పాటు బీసీ సంఘం నాయకులు సుక్క బాబయాదవ్, ఎర్ర గిరిబాబు, ఆదాం పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ట్రాఫిక్ పోలీసుల వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్

నవతెలంగాణ-సంతోష్‌నగర్
ట్రాఫిక్ పోలీసులు 'చలాన్ల' వేధింపులు ఒక హమాలీ ప్రాణాన్ని బలితీసుకున్నాయి. కూలిపని చేసుకునే తాను చలాన్లు కట్టలేనని చెప్పినా ట్రాఫిక్ ఎస్ఐ కనికరించలేదని సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు తన బాధను వ్యక్తం చేస్తూ మృతుడు సూసైడ్ నోట్ రాశాడు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం నేరడిగొమ్మ గ్రామానికి చెందిన ఎ.ఎల్లయ్య (45) నగరానికి వలస వచ్చి ఐఎస్‌సదన్ డివిజన్ చింతలబస్తీలో నివసిస్తున్నాడు. అతని భార్య సైదాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో స్వీపరుగా పనిచేస్తుంది. వారికి ముగ్గురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. హమాలీ పనిచేసే ఎల్లయ్య ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆదివారం రాత్రి భారత్ గార్డెన్ వద్ద విధులు నిర్వహిస్తున్న మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు అతని వాహనాన్ని తనిఖీ చేసి మూడు పెండింగ్ చలాన్లు ఉన్నాయని వాహనాన్ని సీజ్ చేశారు. అతను వాహనాన్ని విడిచిపెట్టాలని ఎన్నిసార్లు బ్రతిమాలినా, చలాన్‌లు చెల్లించాలని పోలీసులు తెలిపారు. చలాన్‌లు కట్టడానికి డబ్బులు లేకపోవడంతో మనస్థాపం చెందిన ఎల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న సైదాబాద్ పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మృతుడు రాసిన సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అందులో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు తెలుపుతూ తన బాధ వ్యక్తం చేశాడు. మీర్‌చౌక్ పోలీసులు రూ.10వేలు చలాన్లు ఉన్నాయి, కడితేనే నా బండి ఇస్తామంటున్నారు. కూలిపని చేసుకునే వాడినని బతిమాలినా వారు ఒప్పుకోవడం లేదు.' అని ఎల్లయ్య సూసైడ్ నోట్లో ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాఫిక్ పోలీసుల 'చలాన్' వేధింపులు తట్టుకోలేక వేధింపుల వల్లే చనిపోతున్నానని ఎల్లయ్య రాసిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. కాగా సైదాబాద్ పోలీసులు ఆత్మహత్య కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నింటా తానై ...నేటి మహిళ

కాలనీల పేర్లు కూడా మహిళలవే

ఎల్బీనగర్ నియోజకవర్గంలో అన్ని పదవుల్లో మహిళలే

నవతెలంగాణ-వనస్థలిపురం
వనస్థలిపురంలోని కమలానగర్, భూలక్ష్మీనగర్, సుభద్రనగర్, శారదానగర్, శాంతినగర్, చుట్టుపక్కల గల కాలనీల పేర్లు కూడ మహిళల పేర్లని సూచిస్తున్నాయి. ఎల్బీనగర్ నియోజకవర్గం లేక హయత్‌నగర్ డివిజన్లో గల ముఖ్య ప్రభుత్వ శాఖలను కూడ మహిళలే నిర్వహించడం ఈ ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ప్రతిబింబింపచేస్తున్నాయి. జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, హయత్ నగర్ ఎమ్మార్వో, ఏఈ విద్యుత్, జీహెచ్ఎంసీ, ఏఈ విద్యుత్ శాంతినగర్, ఏఈ వాటర్ బోర్డు, ప్రభుత్వ పాఠశాల వనస్థలిపురం. ఇక నిత్యం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించే మహిళలు చెప్పనవసరం లేదు. ఇది చాలదా మనం మహిళల పట్ల చూపిన ప్రాధాన్యత అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో. తల్లిగా పాలిచ్చి పెంచినా, పంచినా భార్యగా భారమంత భరించినా, సోదరిగా అన్నదమ్ములను ఆదరించినా కార్యాలయాలలో సన్నిహితులకు సహకారం అందించినా, కూలిపనులలో కష్టపడి శ్రమించినా, ఆకాశ కన్యగా లోహ విహంగంలో సేవలు చేసినా, అంతరిక్షంలో చందమామను చేరినా, చలన చిత్రాలలో తారలుగా తళుకులీనే స్థాయిలో నటించినా, అంతర్జాలంలోనూ, అణు పరిశోధన కేంద్రంలోనూ వైద్య, విద్య రంగాల్లో శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి చెందినా, చట్ట సభలలో వేదికలెక్కి చర్చలు చేసినా, న్యాయస్థానాలలో నిలబడి వాదనలు చేసినా, కోఎడ్యుకేషన్ విద్యా సంస్థలలో చదివినా, ఇంకా ఈ సమాజంలో ఎక్కడో ఒకచోట మాత్రం లోపం వుందని పిస్తోంది. అదేమిటో కనిపెట్టాలి అరాచకాలను అరికడితేనే ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం విజయవంతం అవుతుంది. అతివ లేనిదే అవని లేదు. అమ్మ లేనిదే జన్మే లేదు. క్షమకు నిదర్శనం క్షితి అయితే ఓర్పుకు నిదర్శనం తల్లి మాత్రమే మహిళలను గౌరవించాలి అనేది ఒక సంస్కారం. ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సమాజంలో మహిళలపై లింగ వివక్షత తొలగించేదిగా వుండాలని పురుషులతో అన్ని రంగాలలో సమానంగా విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా వుండాలనేదే ప్రతి ఒక్కరి ఆకాంక్ష.



రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్‌ను సన్మానించిన ముజీబ్

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్‌గా నియమితులైన తారీక్ అన్సారిని టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) బుధవారం కలిసి ప్రత్యేకంగా సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఔన్నత్యాన్ని ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ ప్రశంసించారు. మైనార్టీ వర్గం నుంచి యువ నాయకుని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషనర్‌గా నియమించినందుకు గంగా జమున సాంప్రదాయం కేవలం తెలంగాణలో సాధ్యమని ముజీబ్ గుర్తుచేశారు. మైనార్టీ యువ నాయకుడైన తారీక్ అన్సారి తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బి.శంకర్, నాల్గవ తరగతి సహా అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ మజీద్, ఇతరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాల్టీ పరిధిలోని 17 వార్డులో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొమ్మలరామారం ఎంపీడీఓ సరిత ,కౌన్సిలర్ మమతా కృష్ణారెడ్డి, బిజ్జ శ్రీనివాస్ గౌడ్, సబిత ఆంజనేయులు గౌడ్,అన్నమరాజు శ్రీనివాస్, కాలనీ ప్రెసిడెంట్ రఘు ప్రసాద్, నాగరాజు కాలనీ అసోసియేషన్ సభ్యులు మహిళలు పాల్గొన్ని మహిళలను సన్మానించారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చు



● డాక్టర్ ఎం మాధవి

నవతెలంగాణ-బేగంపేట్

మహిళలకు ప్రమాద కారకాలైన అండాశయ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌లను ముందస్తుగా గుర్తిస్తే వాటికి సరియైన చికిత్స చేయవచ్చు అని డాక్టర్ ఎం మాధవి అన్నారు. బుధవారం మహిళా దినోత్సవం పురస్కరించుకొని సెంటెన్స్ పాఠశాలలో జరిగిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వారు పాల్గొని మాట్లాడారు. ముందుగా మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ హెచ్‌పీవీ వైరస్ వల్ల వస్తుందన్నారు. వాటికి సరియైన వాక్సిన్‌లు ఉన్నాయని చెప్పారు. చిన్న వయసులో జరిగే పెండ్లీలను నివారించాలని.. చిన్న వయసులో లైంగిక సంబంధాలు, బహు లైంగిక సంబంధాలను మానుకోవాలన్నారు. ఎందుకంటే వాటి ద్వారా హెచ్‌పీవీ వైరస్ ఇన్ఫెక్షన్ అనేది సంక్రమిస్తుందని తెలిపారు. 12 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల మహిళలకు ఈ వాక్సిన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనితో సాధారణ జీవితాన్ని గడపవచ్చు అని తెలిపారు. తెల్ల బట్ట, రుతు క్రమం సరిగా లేకపోతే కూడా అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అండాశయ క్యాన్సర్ సాధారణంగా వచ్చేదైతే, గర్భాశయ క్యాన్సర్ అతి సాధారణంగా వచ్చేదన్నారు. ఇది ఈస్ట్రోజన్ హార్మోన్ స్థాయి ఎక్కువ అవడం వల్ల, బీఎంఐ అధికంగా ఉన్న వారికి ఎక్కువగా వస్తుందని చెప్పారు. దీనికోసం మహిళలు పౌష్టికాహారం తీసుకోవడం, కనీసం ఇరవై నిమిషాల నుండి 45 నిమిషాల వరకు శారీరక వ్యాయామం తప్పని సరిగా చేయాలని సూచించారు. 35 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉండే మహిళలకు పోస్ట్ మెనోపాజ్ దశలో రుతుక్రమం సరిగా లేకపోయినా, అధిక రక్తస్రవం, తెల్ల బట్ట, సంభోగం తరవాత రక్తస్రావం జరిగినా వెంటనే గైనకాలజిస్ట్ ను సంప్రదించాలని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ ఉన్నపుడు సొంతంగా పరీక్షించుకోవచ్చు అన్నారు. ఇలా నెలకు ఒకటి, రెండు సార్లు పరీక్షించుకుంటే ముందుగా గుర్తిస్తే వ్యాధిని నివారించ వచ్చు అన్నారు.

మహిళల పట్ల పురుషుల మైండ్ సెట్ మారాలి

● మల్కాజిగిరి ప్రభుత్వాస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సారా సీమెన్



మహిళల పట్ల పురుషుల మైండ్ సెట్ మారాలని మల్కాజిగిరి ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సారా సీమెన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు.

నవతెలంగాణ : నేటి సమాజంలో మహిళల స్థితి గతులు ఎలా ఉన్నాయి ?

సారా సీమెన్: నేటి సమాజంలో మహిళల స్థితి గతులు దారుణంగా ఉన్నాయి. నవజాత శిశువు నుంచి 80 ఏండ్ల వృద్దులు అయన మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుం డడం దురదృష్టకరం. నూటికి 80 శాతం సంఘ టనలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారు, నిరక్షరాస్యులైన వారు, దినసరి కూలీలు, అడ్డా కూలీలు ఈ దారుణాలకు గురవుతున్నారు.వీరిలో సామాజిక చైతన్యం కలిగించాలి, చట్టాలు, మహిళల హక్కుల ప్రాధాన్యతపై అవేర్‌నెస్ కలిగించాలి. అందుకు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

నవతెలంగాణ :మహిళలకు మీరిచ్చే సందేశం ..?

సారా సీమెన్: సహజంగా మహిళలు ధైర్యవంతులే. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనే నైజం మహిళలకు ఉం టుంది. మొన్న జరిగిన మెడికల్ విద్యార్థిని ప్రీతి మరణం దురదృష్టకరం. మహిళల పట్ల పురుషుల మైండ్ సెట్ మారాలి. మహిళలను తమ కుటుంబ సభ్యులుగా గౌరవించే పద్దతి రావాలి. మహిళలు ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు వెతుక్కోవాలి. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావు..

(నవతెలంగాణ-మల్కాజిగిరి)

చట్టాలను కఠినతరం చేసి తీర్పులు వేగంగా అమలు చేయాలి

● హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. అనురాధరెడ్డి



మహిళపై జరుగుతున్న లైంగిక దాడులపై చర్యలు తీసుకునేందుకు చట్టాలను కఠినతరం చెయ్యాలని, శిక్షలు, తీర్పులు వేగంగా అమలు చెయ్యాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు, శక్తి మహిళా మండలి అధ్యక్షు రాలు కె. అనురాధరెడ్డి అన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు

నవతెలంగాణ : సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలపై మీ కామెంట్స్ ...?

అనురాధరెడ్డి : సమాజంలో మహిళపై జరుగుతున్న లైంగిక దాడులు దారుణమైన అంశాలు. వీటిపై చర్యలు తీసుకునేందుకు చట్టాలను కఠినతరం చెయ్యాలి, శిక్షలు, తీర్పులు వేగంగా అమలు చెయ్యాలి. అంతకు ముందు మహిళల పట్ల పురుషుల మైండ్ పెట్ మారాలి. వారి ఆలోచన విధానం మారాలి. అందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, యూత్ క్లబ్‌లు సహకరించి ముందుకు రావాలి. మొన్న జరిగిన మెడికల్ విద్యార్థిని మరణం తీవ్రంగా కలిచి వేసింది. మహిళలు సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రయత్నించాలి కాని ఆత్మహత్యలకు పూనుకోకూడదు. ధైర్యంగా ఎదుర్కోవాలి.

శక్తి మహిళా మండలిలో 100 మంది సభ్యులు ఉన్నారు. వీరంతా దినసరి కూలీలు, ఇండ్లల్లో పనిచేసే వారు. వీరికి ఏదైనా కుటీర పరిశ్రమ ద్వారా ఆర్థిక స్వాలంభన అందించేదుకు కృషి చేస్తున్నారు. అందుకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరుతున్నారు.

(నవతెలంగాణ-మల్కాజిగిరి)

మహిళల సంక్షేమం సాధికారత.. ప్రభుత్వ ధ్యేయం

● మేయర్ మేకల కావ్య

నవతెలంగాణ-జవహర్‌నగర్



మహిళల సంక్షేమం సాధికారత ప్రభుత్వ ధ్యేయం అని, మహిళల స్ఫూర్తి దేశానికి కీర్తి తెచ్చిపెడుతుందని, ప్రతీ రంగంలోనూ పురుషులకు ధీటుగా మహిళా లోకం పోటిపడుతూ అటు రాజకీయ, ఇటు పరిపాలనా రంగాల్లో తామంటూ ముందుకు సాగుతున్నారని మేయర్ మేకల కావ్య అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జవహర్ నగర్ కార్పొరేషన్ లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ మహిళ లకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసి ఎన్నో అవకాశాలు కల్పించిందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు మెట్టు ఆశాకుమారి, బింగి లావణ్య, గుండ్రాతి లక్ష్మి కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, మహిళ నాయకురాలు మంజుల, కేతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక మహిళా జైలులో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



హైదరాబాదు చంచలగూడ ప్రత్యేక మహిళా జైలులో జైళ్ల శాఖ, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిటీ సివిల్ కోర్టు సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జైళ్ళ శాఖ డి.ఐ.జి మురళి బాబు అధ్యక్షత వహించగా హైదరాబాద్ సిటీ స్మాల్ కాజ్ కోర్ట్ చీఫ్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జ్ నిర్మల గీతాంబ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్మల గీతాంబ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్ళినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. కొందరు మహిళలు తెలుసో తెలియకో చేసిన తప్పుల వల్ల శిక్ష అనుభవిస్తున్నప్పటికీ శిక్ష అనంతరం సక్రమ మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళ ఖైదీలకు చట్టపరంగా ఉన్న హక్కులను వివరించారు .కార్యక్రమంలో మరొక అతిథి సీనియర్ సివిల్ జడ్జి సిటీ సివిల్ కోర్ట్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే మురళీమోహన్ మాట్లాడుతూ మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా మహిళలకు ఉచిత న్యాయం అందుతుందని వివరించారు. మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలు ఉన్నాయని స్వీయ క్రమశిక్షణతో మహిళల పట్ల గౌరవభావంతో మహిళలపై అకృత్యాలకు సమాజం దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జైళ్ళ శాఖ డిఐజి శ్రీ మురళి బాబు మాట్లాడుతూ మహిళా ఖైదీల సంక్షేమం కోసం వారి పిల్లల సంక్షేమం కోసం జైళ్ల శాఖ, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తో చర్యలు చేపడుతుందని వివరించారు రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్స్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా ఎదగాలని అన్నారు. మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్స్ విజయ్ రాధికా జైస్వాల్ మాట్లాడుతూ మహిళా ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని వివరించారు. ఎం. ఎన్. జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయలత మాట్లాడుతూ మహిళలు ఉన్నత విద్యావంతులై ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరారు. మహిళా ఖైదీలకు తమ ఆస్పత్రి తరపున ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని అన్ని రకాల వైద్య సేవలకు తాము సిద్ధమని వివరించారు. షీ టీమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ అందుబాటులో ఉంటుందని వివరించారు. చంచలగూడ సెంట్రల్ ప్రిజన్ సూపరెండెంట్ శ్రీ శివ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కొన్ని ఆచార వ్యవహారాలు సాంప్రదాయాల పేరుతో మహిళ స్వేచ్ఛను నియంత్రించబడే విషయాల పట్ల సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. మహిళా జైలు సూపరెండెంట్ అమరావతి అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం అమరావతి వందన సమర్పణ చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన పలు పోటీలలోని విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.



మల్కాజిగిరి కోర్టు ఆవరణలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యూ ఢిల్లీ, మరియు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, హైదరాబాద్, నేషనల్ కమిషన్ ఫర్ విమెన్ ఆదేశాల మేరకు 04-03-2023 నుండి 11-03-2023 వరకు అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బుధవారం మహిళా దినోత్సవాన్ని మల్కాజిగిరి కోర్ట్ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చైర్మెన్ బి.సురేష్ , ఒకటో అదనపు జిల్లా జడ్జి శ్రీ రఘునాథ్ రెడ్డి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శంకర్ శ్రీదేవి, ఇతర న్యాయ మూర్తులు పి.శ్రీదేవి, జె.విక్రమ్, వి. అరుణ్ తేజ్, దిలీప్ కుమార్ నాయక్, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ న్యాయవాదులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

వృత్తిలో సవాళ్లను ఎదుర్కోవాలి

● మన స్నేహం ఫౌండర్ కావేరి

నవతెలంగాణ-జవహర్ నగర్



మహిళలు తమ వృత్తిలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగాలని మన స్నేహం ఫౌండర్ కావేరి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె ప్రత్యేకంగా నవతెలంగాణతో మాట్లాడుతూ.. 'మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకుంటూ ప్రజలకు సేవ చేసే గుణం పెంచుకోవాలి. మహిళలకు విధి నిర్వహణలో ఒడిదుడుకులు వస్తుం టాయి. అలాంటి సమయంలో మానసికంగా కృంగిపోకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. ప్రతీ మహిళ ఈ పనులను చేయగలమా అన్న ఆలోచన తొలగించాలి' అని అన్నారు.

కాటేపల్లి జనార్ధన్ రెడ్డికి బీటీఏ మద్దతు

నవతెలంగాణ- సిటీబ్యూరో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్ధన్ రెడ్డికి బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. కాటేపల్లి గెలుపు కోసం బహుజన టీచర్ అసోసియేషన్ కృషి చేస్తుందని, విద్య శాఖలో వారు చేసినటువంటి పనులే వారిని ముందుకు నడిపిస్తాయని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కల్ప దర్శి చైతన్య , ప్రధానకార్యదర్శి మార్వాడి గంగరాజు తెలిపారు. ఆయన సేవలు ఇంకా ఉపాధ్యాయులకు ఎంతైనా అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేటువంటి వ్యక్తి కావున మళ్లీ శాసనమండలిలో ఉండాలని అప్పుడు మాత్రమే ఉపాధ్యాయులకు న్యాయం జరుగుతుందన్నారు. అందుకే తాము బహుజన టీచర్స్ అసోసియేషన్ తరఫున సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని వారు తెలిపారు.



మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● అల్వాల్ సర్కిల్ డీసీ నాగమణి

నవతెలంగాణ-నేరేడ్ మెట్

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని అల్వాల్ సర్కిల్ డిసి నాగమణి అన్నారు. బుధవారం అల్వాల్ జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో డిసి నాగమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కేక్ కట్ చేసి పారిశుధ్య కార్మికులకు, తోటి సహచరులను ఘనంగా సన్మానించి ఉమెన్స్ డే భాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... స్త్రీలేనిదే ప్రపంచం లేదని, స్త్రీ శక్తి అనిర్వచనీయమన్నారు. ప్రతి ఒక్కరి విజయాల వెనుక స్త్రీ పాత్ర అపూర్వమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి హేమలత, ఏసిపి విజయశ్రీ, మంజుల, నందిని, మున్సిపల్ సిబ్బంది, పలువురు మహిళలు పాల్గొన్నారు

గాంధీనగర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ కంటోన్మెంట్



బీఆర్ఎస్ కంటోన్మెంట్ ఏడో వార్డు అధ్యక్షుడు తేజ్‌పాల్ అధ్యక్షతన న్యూ గాంధీనగర్ మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మహిళలకు క్రీడలు నిర్వహించడమే కాకుండా సీనియర్ మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్ర మానికి బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మెన్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అజయ్ కుమార్ ముదిరాజ్, శ్రీధరన్, వేణుగోపాల్, జైహింద్ ఈసీ పాల్, యమునా, రీతు, జయశ్రీ, జయ, రేఖ, సిమ్మి ప్రీతి, మీనాక్షి, మేరీ, తరుణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

శ్రామిక మహిళలకు స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సన్మానం

నవతెలంగాణ-కాప్రా



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో సభ బుధవారం నిర్వహించారు. ఈ సభకు స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఆఫీసులో నిరంతరం శ్రమించే శ్రామిక మహిళలు శోభ , గౌస్య , అంజలి శ్రామిక వర్గానికి ఎనలేని సేవలు చేస్తున్నారని.. వారి సేవలకు గుర్తింపుగా మహిళా దినోత్సవం సందర్భంగా వారిని ఆత్మీయంగా గౌరవించారు. ముందుగా శోభకు స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు శ్రీమన్నారాయణ చేనేత వస్త్రం అందించారు. గౌస్యకు ఆఫీసు ఇన్‌చార్జి శ్రీనివాస్ రావు చేనేత వస్త్రం అందించారు. అంజలికి కాప్రా ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వెంకట్ చేనేత వస్త్రం అందించి గౌరవించారు.

ముందుగా ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకై అనేక పోరాటాల ఫలితం శ్రామిక మహిళా దినోత్సవం అని అన్నారు. ప్రపంచంలో మహి ళలు అనేక వివక్షలకు గురై అణగారిన ప్రజలలో సైతం అణగతొక్కబడిన వారిగా ఉన్నారని చెప్పారు. దానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల ఫలితంగా కొంతమేరకు ముందుకు వచ్చిన మతవాదులు మూఢనమ్మకాలతో తొక్కి పెడుతున్నారని అన్నారు. ఓటు హక్కు సైతం నిరాకరిం చిన తరుణంలో పోరాడి దానిని సాధించుకున్నారని చెప్పారు. మహిళలు అన్ని రంగాలలో తమ ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగుతున్న తరుణంలో నేటి పాలకులు మనువాదాన్ని ముందుకు తీసుకువచ్చి తిరిగి వంట ఇంటికి కుందేలుగా మార్చాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దాన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత ప్రజాతంత్ర వాదులందరి పైన ఉందని అన్నారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమ నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రామిక మహిళల తో పాటు, సాధారణ మహిళలు సైతం జాతి ఉత్పత్తులలో గణనీయమైన పాత్ర ఉందన్నారు. నేడు భారతదేశ ప్రతిష్టను పెంపొందించే వారిలో మహిళలు అత్యధికలు ఉన్నారని వారి కృషి ఎంతో అభినం దనీయమన్నారు. ఆఫీస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రావు మాట్లా డుతూ ముఖ్యంగా మేడ్చల్ జిల్లా పరిధిలో ప్రజాతంత్ర ఉద్యమం బలంగా ఎదగటానికి వారి ఉద్యమ అవసరా లను నిరంతరం పర్యవేక్షణకు శోభ కృషి ఎంతో అభినం దనీయమన్నారు. గౌస్య ప్రజాతంత్ర ఉద్యమంలో ముందుకు వచ్చి అధికారుల సైతం నిలదీసే తత్వం కలిగి ఉండి, పోరాట స్ఫూర్తితో పూర్తి కాలం ఉద్యమానికి అంకితమైన వ్యక్తి అని అన్నారు అంజలి ఆఫీసు నిర్వహణలో భాగస్వామ్యమై అంకితభావంతో పనిచేస్తు న్నారని అభినందించారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహిళా దినోత్సవం ఎన్నో పోరాటాల ఫలితంగా ఏర్పడిందని, అంతర్జాతీయంగా సోషలిస్టు ప్రపంచం దాన్ని ముందుకు తీసుకువచ్చి ప్రపంచానికి వేగుచుక్కగా మార్చిందని చెప్పారు. అనంతరం మహిళ నాయకురాలు శోభ మాట్లాడుతూ ప్రజాతంత్ర ఉద్యమంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉద్యమ స్ఫూర్తితో కొనసాగిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గౌరవించినందుకు ధన్యవా దాలు తెలియజేశారు. గౌసియా మాట్లాడుతూ పోరాట క్రమంలో ముందుకు నడిచినప్పుడు ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు వెన్ను తట్టి నడిపించారని, తాను అదే వరవ డితో ఇప్పటివరకు పని చేస్తున్నానని, భవిష్యత్తులో మరింత పట్టుదలతో పని చేస్తానని చెప్పారు. అంజలి మాట్లాడుతూ ఆత్మీయంగా మమ్ములను గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముందు ముందు ఇంకా పట్టుదలగా పనిచేయగలనని చెప్పారు. అనంతరం స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు జి శివరామకష్ణ వందన సమర్పణతో సభ ముగిసింది. సభలో రుక్కయ్య , సమ్మయ్య , శ్రీనివాసులు, ఉన్నికిష్టన్, శ్రీనివాస్, రాజమల్లు , సంతోష్, బసవ పున్నయ్య, హెచ్ వి స్వామి, వెంకట్ నర్సయ్య, ప్రభాకర్, వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ఎమ్మెల్యే కాలేరు కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

మైనార్టీల సంక్షేమానికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ ముదిరాజ్ అన్నారు. అంబర్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మైనార్టీస్ స్మశాన వాటికలో బోర్ వెల్ పనులను బుధవారం పరిశీలించిన అనంతరం మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో డివిజన్‌లో ప్రభుత్వపరంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కొన్నిచోట్ల ఎమ్మెల్యే సొంత నిధులతో డివిజన్ అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎర్రబోలు నరసింహారెడ్డి, కె.రామారావు యాదవ్, రాగుల ప్రవీణ్ పటేల్, ఎండి అతిక్, ఆకుల మల్లేష్, సురేష్ ముదిరాజ్, మహ్మద్ మోసిన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత

- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

మహిళలకు డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్‌లో సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు తాము శక్తి వంచన లేకుండా ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నామనీ, మహిళల స్వావలంభనకు కృషి చేస్తున్నామని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో మహిళా పొదుపు సంఘాల కార్యకలాపాలు పురోగతి ప్రస్థానంలో సాగుతున్నాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితాఫలమండీ, బౌద్ధనగర్ డివిజన్లలోని సుమారు 19 వందల సంఘాలకు రూ.20.32 కోట్ల మేరకు రుణ సదుపాయాన్ని కల్పించేందుకు ఏర్పాట్లు జరిపామని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు తాము కల్పిస్తున్న ప్రాధాన్యతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువే

- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మహిళలకు సహనం, ఓర్పు ఎక్కువేనని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు విజయలక్ష్మి, యూసీడీ సౌజన్య, జాయింట్ కమిషనర్లు ఉమాప్రకాష్, శశిరేఖ, జోనల్ కమిషనర్ మమత, సెక్రెటరీ లక్ష్మి, డిప్యూటీ కమిషనర్ మంగతయారు, మహిళా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, శానిటరీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళలు లక్ష్య సాధనలో వెనకడుగు వేయకుండా ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్ష్యాన్ని చేరేవరకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, న్యూట్రిషన్ కిట్, ఆసరా పింఛన్లు తదితర ఎన్నో సంక్షేమ పథకాలు కల్పించారన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే నేరుగా తనను గానీ, డిప్యూటీ మేయర్‌ను సంప్రదిస్తే కచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎక్కడైనా వేధింపులకు గురైతే మహిళల కోసం షీ-టీమ్స్ కూడా ఉన్నాయని మేయర్ తెలిపారు. హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో మహిళా శానిటరీ వర్కర్ల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల్లో ఒక్కో సర్కిల్ నుంచి ఒక మహిళా వర్కర్‌ని ఉత్తమ మహిళా వర్కర్‌గా ఎంపిక చేసి అవార్డు ఇచ్చి సన్మానించడం సంతోషంగా ఉందని తెలిపారు. మహిళా శానిటరీ వర్కర్ల ఆరోగ్య విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పారిశుధ్య మహిళా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మాట్లాడుతూ మహిళలను సన్మానించుకోవడం వల్ల ముందు తరాల వారిని చైతన్యవంతులను చేయడానికి తోడ్పతుందన్నారు. ఆరోగ్యం అనే కొత్త కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్ మమత మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని మొదటగా మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారని గుర్తు చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులను అందజేశారు. అనంతరం జీహెచ్ఎంసీ ఆవరణలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు.

సీపీఆర్ఓ సెక్షన్ మహిళా ఉద్యోగులకు సన్మానం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జీహెచ్ఎంసీ సీపీఆర్ఓ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగులకు సీపీఆర్ఓ మహమ్మద్ అలీ ముర్తుజా, ఏఎంసీ జీవన్‌కుమార్‌తో కలిసి సన్మానించారు. సన్మానించిన వారిలో సూపరింటెండెంట్‌లు డి. శైలజా, పద్మ, ఓఎస్. కె.లతను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మోసిన్, రోహిత్, రమేష్, ఆనంద్, మహమ్మద్ తౌఫిక్, యాదగిరి, శ్రీను, నరేందర్, నర్సింగ్, మహేందర్, అంజయ్య పాల్గొన్నారు.



ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఎర్రగడ్డ చెస్ట్ హాస్పిటల్‌లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలంతా సంఘటితమై పోరాటం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షులు కుమార్, శ్రామిక మహిళా కన్వీనర్ వాణి తెలిపారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు గడిచినా గంటకు ఆరుగురు మహిళలపై లైంగిక దాడులు జరుగున్నాయన్నారు. పట్టపగలు దేశ రాజధాని ఢిల్లీలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని 20 ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా ఆమోదానికి నోచుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మహిళలకు రక్షణ కల్పించాలనీ, సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వైన్ షాపులను తగ్గిస్తామని ఎక్కడా చెప్పడం లేదన్నారు. వీధికో మద్యం షాపు ఏర్పాటు చేసే విచ్చలవిడిగా మద్యం సంఫరా చేస్తున్నారని చెప్పారు. తాగుడుకు బానిసై మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. మద్యపానానికి వ్యతిరేకంగా మహిళలు కలిసి పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాపర్తి అశోక్, ఎస్ శ్రీనివాస్, రిజ్వాన, పద్మ, అమృత, అనిత, కృష్ణ, రేష్మ పాల్గొన్నారు.

కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈఎన్‌టీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్ అన్నారు. బుధవారం కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నర్సింగ్ సూపరింటెండెంట్ కస్తూరి దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ జయ మనోహరి, డాక్టర్ ఆనంద చారి, డాక్టర్ సంపత్ కుమార్ సింగ్‌చ డాక్టర్ రవి శంకర్, డాక్టర్ అమిత్, నర్సింగ్ సూపరింటెండెంట్ కస్తూరి దేవి, హెడ్ నర్సులు గౌరీదేవి, హనీష్ ఫాతిమా, సోషమ్మ, అనురాధ, రమణ, స్టాఫ్ నర్సులు ప్రశాంతి, నిర్మల, మరియమ్మ, పుష్పలత, సుజాత, బాల నక్షత్రం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో పెరుగుతున్న మహిళల స్థానం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అడిక్‌మెట్

దేశంలో బలమైన మహిళ రాజకీయ ప్రముఖులతో భారత రాజకీయాల్లో మహిళల స్థానం రోజురోజుకూ పెరిగిపోతున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. లోయర్ ట్యాంక్ బండ్ శెట్టిబలిజ సంఘం భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన పీఆర్‌కె ఈవెంట్స్‌ను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటులో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి మహిళా రిజర్వేషన్ బిల్లు ఎగువ దిగువ సభలో ప్రవేశపెట్టబడిందనీ, బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందిందనీ, లోకసభలో పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. ఈవెంట్‌ను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈవెంట్ నిర్వాహకులను అభినందిస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, మహిళా సంఘం నేతలు గంగాపురం పద్మ శ్రీదేవి, సీత, సంఘ సేవకులు మినియం బాబు, ఈవెంట్ నిర్వాహకుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'డిజిటల్ ఇన్నో వేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ జెండర్ ఈక్వాలిటీ' అనే థీమ్ రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఫర్ ఫ్యూచరిస్టిక్ సిటీస్ ప్రెసిడెంట్, ఈస్కీ ఇండిపెండెంట్ డైరెక్టర్ కరుణాగోపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజెనిక్ ప్రయివేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రణీతారావు, ఈస్కీ డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు, ఎస్‌పీజీఎస్ ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి, చీఫ్ ఏఅండ్‌పీ లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాధాన్యత గురించి కరుణాగోపాల్, ప్రణీతారావు, రామేశ్వర్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీజీఎల్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలిరాయ్, కన్సల్టెంట్ శిరీష, పవర్, ఎనర్జీ డివిజన్ హెడ్ విద్యాసాగర్, వి.నాగేశ్వర్‌రావు, కె.శారదాదేవ, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ : సీఐటీయూ సెంట్రల్ సిటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో/అంబర్‌పేట

హైదరాబాద్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కాచిగూడ రైల్వే స్టేషన్ హౌస్ కీపింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5వ తేదీన సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఉన్న కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లు మార్చి 8 గంటల పనిదినం స్థానంలో 12 గంటల పనిని ప్రవేశపెట్టిందన్నారు. కార్మికులను ఎప్పుడంటే అప్పుడు తొలగించే స్వేచ్ఛను యజమానులకు అప్పగించి అదానీ, అంబానీ వంటి కార్పోరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకులు ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఎల్ఐసీ, బ్యాంకులు, రైల్వే తదితర సంస్థ లను నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రయివేట్ కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా కట్టబెడుతున్నదనీ, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా నట్టేట ముంచుతున్నదన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాలని విద్యుత్ సవరణ బిల్లులో పెట్టి రైతాంగానికి ద్రోహం చేస్తున్నదని చెప్పారు. తన ప్రజా వ్యతిరేక విధానాలను మరుగునపరచడానికి ప్రజల మధ్య కులం పేరుతో, మతం పేరుతో ఘర్షణ సష్టించి తన పబ్బం గడుపుకుంటున్నదన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 15వ తేదీ నుండి 29వ తేదీ వరకు బస్తీ స్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న సభలు, సమావేశాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నగర సహాయ కార్యదర్శి ఎస్.శ్యామలీల, నాయకులు శ్రీనివాస్, గంగారామ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్ట మహిళా సంఘం ఆఫీస్ వద్ద బుధవారం మహిళా దినోత్సవం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజమ్మ, లలిత, సీహెచ్ వసంత, స్వరూప, అలేఖ్య మాట్లాడుతూ సమాజంలో సగభాగమైనా మహిళలకు అన్నిటిలో ఇప్పటికీ వివక్షత జరుగుతూనే ఉందన్నారు. అన్ని రంగాల్లో ముఖ్యంగా ప్రస్తుతం చదువులతో అమ్మాయిలే ర్యాంకుల్లో ముందంజలో ఉంటున్న విషయం అందరికీ తెలిసిందే అన్నారు. అన్ని రంగాల్లో సేవ చేస్తున్న హత్యలు, లైంగిక దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల పట్ల ప్రేమ గౌరవం పెరగకపోతే సమాజం మనుగడ, సాగదు అన్నారు. తల్లి, చెల్లి, అక్క, వదిన అనే చుట్టరికం గౌరవానికి ప్రతీకలు అన్నారు.

సంతాన లేమి ప్రధాన సమస్య కాకూడదు



నవతెలంగాణ-అంబర్‌పేట

మెహిదీపట్నంలోని మామ్ ఐవీఎఫ్ ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి సినీ నటి, బిగ్ బాస్ ఫేమ్ హిమజ హాజరై మామ్ ఐవీఎఫ్ సీఈఓ, వ్యవస్థాపకులు డాక్టర్ పూర్ణిమ దుర్గా, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరిచారితో కలిసి ప్రారంభించా రు. ఈ సందర్భంగా నటి హిమజ మాట్లాడుతూ చాలా మంది మహిళలు వారి విధానాల్లో 100శాతం విజయం సాధించినందుకు కృషి చేసిన ఐవీఎఫ్ బందాన్ని అభినం దించారు. ప్రసూతి సమస్యలతో బాధపడుతున్న మహిళ లను ఆమె మరింత ప్రోత్సహించారు. కుటుంబ విషయాల్లో సంతానం లేని సమస్య ప్రధాన సమస్య కాకూడద న్నారు. సంతానం లేని జంటలందరినీ ఐవీఎఫ్ చికిత్సకు వెళ్లమని ఆమె ప్రోత్సహించారు. మామ్ ఐవీఎఫ్ రీసెర్చ్ సెంటర్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణిమ దుర్గా మాట్లా డుతూ మామ్ ఐవీఎఫ్ ప్రసూతి కేసుల్లో 100శాతం ఫలితంతో దక్షిణాదిలోని అన్ని ఐవీఎఫ్ సెంటర్‌ల నుంచి ప్రేక్షకులకు భిన్నంగా నిలిచిందని చెప్పారు. మామ్ ఐవీఎఫ్‌రీ సెర్చ్ సెంటర్ నగరంలోని ఉత్తమ సంతానో త్పత్తి కేంద్రాల్లో ఒకటి అనీ, సంతానం లేని అనేక జంటల కు వారి కలలను ప్రతిష్టాత్మకమైన వాస్తవికతగా మార్చ డం ద్వారా విజయవంతంగా చికిత్స చేస్తోందని మామ్ ఐవీఎఫ్ సీఈఓ డా.హరి కాంత్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న రంగాల్లో అత్యంత సమర్థవంతమైన పద్ధతులతోపాటు పరిశ్రమ ప్రముఖుల జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా సంతానోత్పత్తి ప్రదేశంలో వైద్యుల క్షితిజాన్ని విస్తరించే లక్ష్యంతో వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

'స్టార్'లో ఫెలిసిటేటెడ్ కిడ్నీ డోనర్స్ అండ్ ఎక్స్‌క్లూజివ్ కిడ్నీ స్క్రీనింగ్ ప్యాకేజీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్టార్ హాస్పిటల్స్ వారు ఫెలిసిటేటెడ్ కిడ్నీ డోనర్స్ అండ్ ఎక్స్‌క్లూజివ్ కిడ్నీ స్క్రీనింగ్ ప్యాకేజ్' ప్యాకేజీని ప్రకటించారు. సమాజంలో పెరుగుతున్న దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధుల గురించి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇది రోగులకు అనుకూలమైన ధరలో ప్రముఖ నెఫ్రాలజిస్ట్‌లతో సమగ్ర రోగనిర్ధారణ పరీక్షలు, సంప్రదింపులను అందిస్తుంది. కిడ్నీ సంబంధిత వ్యాధులను నివారించడానికి ప్రజలను ప్రోత్సహించడమే ఈ ప్యాకేజీ లక్ష్యంగా పని చేస్తుంది. హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ గంధే శ్రీధర్ మాట్లాడుతూ, "ఈ ప్రత్యేకమైన రోజున, మేం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని మాత్రమే కాకుండా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా జరుపుకుంటున్నాం. కిడ్నీ దాతలలో ఎక్కువ మంది మహిళలు ఉన్నారు. కిడ్నీ దానం అనేది ప్రాణాలను రక్షించే శక్తిని మనం నమ్మాలన్నారు.

ఓయూ గ్రంథాలయానికి గ్రూప్స్ పుస్తకాలు అందజేత



నవతెలంగాణ-ఓయూ

మేడ్చల్ డిప్యూటీ తహశీల్దార్‌గా చేస్తున్న పైళ్ల నవీన్ రెడ్డి రాసిన " తెలంగాణ చరిత్ర " " భారత దేశ చరిత్ర " అను పోటీ పరీక్షలకు సంబంధించి తెలుగు, ఇంగ్లీషు మీడియం పుస్తకాలను బుధవారం ఓయూలో డా.బి.ఆర్.అంబేద్కర్ గ్రంథాలయానికి, యచ్‌సిడిసి కార్యాలయనికి ఓయూ వీసీ ప్రొ.రవీందర్ సమక్షంలో ఈ 120 పుస్తకాలు అందజేశారు. ఈ రెండు పుస్తకాలు ఓయూలో వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేర్ ఐతున్న విద్యార్థులు ఎంతో ఉపయోగపడుతుందని ఓయూ వీసీ అన్నారు. ఈ పుస్తకాలు గ్రూపు 1, 2, 3,4, ఎస్ఐ, కానిస్టేబుల్, డీఎల్, జేఎల్‌తో పాటు రాష్ట్రంలో నిర్వహించనున్న అన్ని పోటీపరీక్షలకు ఎంతగానో వారికి ఉపయోగపడుతాయిన తెలిపారు. ఇటీవల ఈ పుస్తకాలకు ఎంతగానో ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యచ్‌సిడిసి డెరైక్టర్, డీన్ ప్రొ.కె.స్టీవెన్ సన్, కో-ఆర్డినేటర్ డా.పి.మురళీధర్ రెడ్డి, లైబ్రేరియన్ డా.ఎ.ఎస్. చక్రవర్తి, నవీన్ రెడ్డి, గైడ్ ప్రొ.ఎ.భాస్కర్ పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ డివిజన్‌లోని జ్ఞాని జైల్ సింగ్ నగర్‌లో బుధవారం షార్ట్ సర్క్యూట్ కావడంతో రేకుల నివాసంలో మంటలు చెలరేగి నివాసం దగ్ధమైంది. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు రోహిన్ రెడ్డి పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. అంతకుముందు స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ వారిని పరామర్శించి ప్రభుత్వ సహకారం అందేలా చూస్తానని హామీనిచ్చారు. నవతెలంగాణ-బంజారాహిల్స్

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-అంబర్‌పేట

మహిళలపై వేధింపులు జరుగుతున్నాయనీ, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు అన్నారు. బుధవారం బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీహెచ్ హాజరై జీహెచ్ఎంసీ మహిళా కార్మికులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఆర్.లక్ష్మణ్ యాదవ్, టీపీసీసీ సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, జె.సత్తిబాబు, జి.లక్ష్మణ్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మోత రోహిత్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ స్పోక్ పర్సన్ ఎస్సీ క్రాంతి కుమార్. గ్రేటర్ హైదరాబాద్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు అజిత్ యాదవ్ పాల్గొన్నారు.





అడిక్‌మెట్ : మహిళా అభ్యున్నతి కోసం కృషి చేస్తాం అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు మహిళా దినోత్సవం సందర్భంగా గాంధీనగర్ డివిజన్‌లోని వార్డ్ ఆఫీసులో డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ ఎమ్మెల్యే పాల్గొని పారిశుధ్య కార్మికులు, ఆశా వర్కర్లకు, డాక్టర్లను శాలువాతో సత్కరించి, వారికి స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జై సింహా, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ నరేష్, డివిజన్ కార్యదర్శి పోతుల శ్రీకాంత్, మాజీ చైర్మన్ మాచర్ల పద్మజ, బీ ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, మారిశెట్టి నర్సింగ్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, పున్న సత్యనారాయణ, గుండు జగదీష్, వెంకటేష్, దేవయ్య గడ్డమీద శ్రీనివాస్, రాజకుమార్ పాల్గొన్నారు.

ఓయూ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి మహిళా దినోత్సవ సందర్భంగా శాలువతో పురస్కరించి అక్కడే ఉన్న పేద మహిళలకు శాలువాలతో తస్కరించి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, శంకర్, నాను నాయక్, రాజ్ కిరణ్, రాజేష్ పాల్గొన్నారు.





ఓయూ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు ఆధ్వర్యంలో మహిళలను బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్రిష్ణ, శేషు, జలందధర్, ప్రవీణ్, శ్రీనివాస్, రీసెర్చ్ స్కాలర్స్ మాధవి సుమలత, పరుశురాం, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అంబర్‌పేట : మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ వెంకటేష్, సీనియర్ నాయకులు టి.పల్లవి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట : మహిళలు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి దుర్గ ప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్జాతీయ మహిళల దినోత్సవని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మాజీ కార్పొరేటర్ పద్మావతి దుర్గాప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల దినోత్సవం వేడుకలో పాల్గొన్న గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నర్సింగ్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్,రాజు, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ కాచిగూడ ఇన్చార్జి డాక్టర్ శిరీష యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దత్రిక్ నాగేందర్ బాబ్జి, సదానందు, బబ్లు, అంటో, తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - బాలానగర్



బాలానగర్ డివిజన్ రాజు కాలనీ కమిటీ హాల్ లో మహిళా దినోత్సవ వేడుకలు బీఆర్ఎస్ సీనియర్ మహిళా నాయకురాలు సుజాత గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, బాలా నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ సరళ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి దాదాపు 30 మంది మున్సిపల్ పారిశుధ్య మహిళలను శాలువాలతో సన్మానించారు. అనంతరం అన్ని సంఘాలలో పనిచేసే గుర్తింపు ఉన్న మహిళలను సన్మానించారు. షాహెద, కవిత , రేణుకా గౌడ్, స్వాతి, సురేఖా రెడ్డి, పారిజాతం, సుధ, భారతి, విజయ, లక్ష్మి ప్రసన్న ,శివాని, సులోచన అరుణ ,నిర్మల సీనియర్ నాయకులు కృష్ణమూర్తి మహ్మద్ ఖాజా, నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, బుల్లెట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కూకట్ పల్లి



ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సోదరుడు దొడ్ల రాజేందర్ గౌడ్ మృతి చెందిన విషయం తెలియగానే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరికె పూడి గాంధీ వారి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి ని తెలియచేసి నివాళ్లర్పించారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, బీఆర్ఎస్ ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షులు అనిల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దొడ్ల రామకష్ణ గౌడ్, కాశినాథ్ యాదవ్, శివరాజు గౌడ్, భాస్కర్ రెడ్డి, మోజేశ్, రాజేష్, వెంకట్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ మాక్స్ కార్మికులకు

న్యాయం జరిగే వరకు వారి వెన్నంటే ఉంటా



- బీఆర్ఎస్‌కేవీ రాష్ట నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్ గౌడ్
- 10వ రోజుకు చేరిన కార్మికుల దీక్ష

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో గల సూపర్ మాక్స్ పరిశ్రమలో గత ఎనిమిది నెలలుగా వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా యజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమని బీఆర్ఎస్‌కేవీ రాష్ట్ర నాయకులు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మిక నాయకులు ముద్దాపురం మదన్ గౌడ్ ధ్వజమెత్తారు. కార్మి కులకు న్యాయం జరిగేంత వరకు వెన్నంటే ఉంటానని భరోసా ఇచ్చారు. బుధ వారం కంపెనీ ఆవరణలో చేస్తున్న 10వ రోజు చేరుకున్న సందర్భంగా, అలాగే మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళా కార్మికులు నాగలక్ష్మి, స్వప్న, నలిని ,విజయరాణి నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఈ మేరకు ముందపురం మదన్ గౌడ్ పాల్గొని వారి దీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లా డుతూ... గత నాలుగు దశాబ్దాలుగా వెయ్యికి పైగా కార్మికులు పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడినా ఇప్పుడు నిర్దాక్షణంగా వారిని ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పరిశ్రమ మీద ఆధారపడి ఎంతోమంది కార్మికులు జీవిస్తు న్నారని వారిని వారి కుటుంబాలను రోడ్డున పడేయడం సమంజసం కాదన్నారు. బాలానగర్, గాంధీ నగర్ , జీడిమెట్ల పారిశ్రామిక వాడల్లో అతిపెద్ద పరిశ్రమగా సూపర్ మాక్స్ పరిశ్రమ ఉందన్నారు. యజమాన్యం లాభ పేక్ష కోసం ఇన్నాళ్లు పని చేయించుకొని ఇప్పుడు కార్మికుల కడుపు మీద కొట్టడం సబబు కాదని తెలిపారు.కార్మికుల పక్షాన బీఆర్ ఎస్‌కేవీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. లేని పక్షంలో జీడిమెట్ల పరిశ్రమగా వాడలో అన్ని యూనియన్ లను కలుపుకొని పరిశ్రమ ఆవరణలో పెద్ద ఎత్తున ఆందో ళన చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఎంఎస్ బీఆర్ఎస్కెవి, సీఐటీయూ ప్రధాన కార్యదర్శులు, ఐ ఎస్ రావు , లక్ష్మారెడ్డి, ఈశ్వర్ రావు , కార్మిక నాయకులు సురేష్, గుట్ట రాజు, వీరస్వామి, ఎల్ వెంకటేష్ ,రవీందర్, వనమా శ్రీనివాస్, వి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి దీక్షలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే పురోభివృద్ధి

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించినప్పుడే దేశం పురోభివద్ధి సాధిస్తుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో గల కార్పొరేటర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి కార్పొరేటర్ జగన్‌తోపాటు ఆయన సతీమణి కొలుకుల శశికళ హాజరై మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ పురుషులతో సమానంగా ముందుకెళ్తున్నారన్నారు. మహిళలు అభివద్ధి సాధిస్తే ఆ కుటుంబం ముందుకు సాగుతుందని అభిప్రాయపడ్డారు. మహిళల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అవి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం మహిళలను శాలువాలతో ఘనంగా సన్మానించారు . బీఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, నాయకులు సత్తిరెడ్డి, విట్టల్ ముదిరాజ్ ,సునీల్, విగ్నేష్, గణేష్, జగద్గిరిగుట్ట డివిజన్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా శ్రీహరి గౌడ్ , ఎండ్రి సువర్ణ, శాంతి కుమారి ,జ్యోతి,పద్మ, లక్ష్మీ నాయక్, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ప్రభుత్వ పథకాలు దేశానికే ఆదర్శం

- నైనా జైస్వాల్

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణకై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, ఆరోగ్యశ్రీ, కేసీఆర్ కిట్ లాంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, మోటివేషనల్ స్పీకర్ కుమారి నైనా జైస్వాల్ అన్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవ వేడుకలు పద్మ అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ఆత్మన్యూనతా భావాన్ని వీడి పోరాటపటిమను పెంచుకోవాలన్నారు. తెలంగాణ ప్రాంతం మహిళా చైతన్యానికి ప్రతీక అని, దాదాపు 800 ఏండ్ల క్రితమే కాకతీయ సామ్రాజ్యాన్ని రాణి రుద్రమదేవి పరిపాలించిందని గుర్తుచేవారు. అలాగే గిరిజన హక్కుల కోసం సమ్మక్క-సారక్కలు కాకతీయులపై ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటం కోసం పోరాడి దేవతలుగా పూజింపబడుతున్నారన్నారు. నిజాంలను ఎదిరించిన చాకలి ఐలమ్మ వంటి వీరవనితల గాథలను విద్యార్థులకు బోధించి ఉపాధ్యాయునీలు బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలని కోరారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించడం సాధ్యమేనని తెలిపారు. క్రీడోత్సవాలలో విజేతలకు ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లు బహుమతులు అందించారు. మహిళా ఉపాధ్యాయునీలకు పీఆర్టీయూ టీఎస్ సంఘం ప్రసూతి సెలవులు, అదనంగా 5 సీఎల్‌లు, 90 రోజుల చైల్డ్ కేర్ లీవు, హిస్ట్రక్టమీ ఆపరేషన్ కోసం 45 రోజుల సెలవులు తదితర ఎన్నో జీవోలు సాధించి మహిళా పక్షపాతిగా నిలిచిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డి, మహిళా ప్రతినిధులు విజయలక్ష్మి, గీత, మాధవి, చైతన్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఐఏఆర్ఈ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు కళాశాల విద్యార్థినుల, మహిళా అధ్యాపకుల సన్మానాల మధ్య కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా లతాశంకర్ హెచ్ఆర్ ప్రొఫెషనల్, కృపాల నూనె ఎంట్రాప్రీనియర్ హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల పాత్ర కీలకమని , మహిళామణులు తావెంచుకున్న అన్ని రంగాలలో రాణించాలన్నారు, సమాజంలో ఉన్న అడ్డంకులను అధిగమించి ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థినిలు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ప్రణాళికతో చదివితే పక్కాగా కొలువు సాధించి అత్యున్నత స్థాయికి ఎదుగుతారన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా చదువుతోపాటు రాజకీయ, సామాజిక ,రంగాల్లో రాణించాలన్నారు. ఎంచు కున్న రంగాల్లో అడ్డంకులను అధిగమించి ముందుకు వెళ్లాల న్నారు. అన్ని రంగాలలో పురుషులతోపాటు సమానంగా ముందుకు వెళ్లాలన్నారు, మహిళలపై జరుగుతున్నటువంటి లైంగిక దాడులను అందరం కలిసి ప్రతిఘటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎల్ వి. నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలకు మహిళలకు ప్రత్యేక స్థానం గౌరవం ఇస్తున్నామన్నారు, సమ సమాజంలో మహి ళల పాత్ర కీలకమన్నారు. మహిళలు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు,అనంతరం ముఖ్య అతిథులకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ మర్రి రాజశేఖర్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ సిహెచ్. సత్తిరెడ్డి ,కళాశాల ట్రెజరర్ బి .రాజేశ్వరరావు , అధ్యాపకురాలు శిరీష, అధ్యాపకులు విద్యార్థినులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

- కుత్బుల్లాపూర్ ప్రయివేటు పాఠశాలల సంఘం అధ్యక్షురాలు వనజ అశోక్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



మహిళలు ప్రతి రంగంలో ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని అప్పుడే సమాజాభివృద్ధి సిద్ధిస్తుందని కుత్బు ల్లాపూర్ మండల ప్రయివేటు పాఠశాలల సంఘం(ట్రస్మ)అధ్యక్షురాలు, అశోక్ మెమోరియల్ చాణిక్య హై స్కూల్ చైర్మెన్, కరస్పాం డెంట్, అల్వాల వనజ అశోక్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నవ తెలం గాణతో ఆమె మాట్లాడారు. 'ఆకాశంలో సగం... అవకాశాల్లో సగం.. అన్నింట సగం అంటూ ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకుం టున్నాం. కానీ విధిరాతను ఎదిరించి ఆత్మగౌరవానికి ప్రతీక నిలుస్తూ... ఎందరో మహిళా మణులు చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్నారు. మహిళల స్థితిగతులు బాగుపడందే సమాజం అభివృద్ధి చెందదు."ఏ పక్షి అయినా ఒక్కరెక్కతో ఎగరలేదు" అన్న వివేకా నందుని మాటలు స్మరిస్తూ జయహెూ... జనయిత్రీ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా మూ ర్తులకు శుభాకాంక్షలు తెలుపుకుంటూన్నాం. సమ సమా జంలో అన్నీ మారుతున్నాయి మహిళల ఆలోచన ధోరణి తప్ప. అయితే సమాజంలో కొందరు మహిళలు ఆత్మగౌర వంతో ,స్వశక్తి,తో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకో గలిగే ఉన్న స్థితికి చేరుకొని, స్త్రీ శక్తి అంటే ఏంటో ప్రపం చానికి తెలుపుతూనే ఉన్నారు. పురుషులకు దీటుగా విజ యాలు సాధిస్తున్నారు. కానీ ఎక్కడ చూసినా మహిళలు, నయావంచనకు గురవుతూనే ఉన్నారు. ఎన్ని చట్టాలు మారినా మహిళలపై ,యువతులపై అఘాయిత్యాలు ,దారు ణాలు, హత్యలు, నేటికీ నిత్య కత్యమైనాయి. నిందితులకు కఠిన శిక్షలు పడినా మార్పు రావడం లేదు. వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మహిళలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అవరోధాలు అధిగమిస్తూ అడుగు ముందుకు వేయాలి' అన్నారు.

ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ జయలతకు సన్మానం

నవతెలంగాణ-సిటీబ్యూరో



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జయల తని టీఎన్జీవోస్ హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి యూనిట్ ప్రెసిడెంట్ అరుణ జ్యోతి, సెక్రటరీ బోడ శివ కుమార్, కోశాధికారి కొమ్ము చంద్ర శేఖర్, కార్యవర్గ సభ్యులు జగన్, శివ, సునీత ఘనంగా సన్మానించారు.

మహిళలకు అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మూసాపేట్ డివిజన్ అవంతి నగర్ తోటలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే వారు మగవారికి ధీటుగా అద్భుతమైన ఫలితాలు సాధి స్తారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళ లకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, అంతేకాకుండా మహిళా దినోత్సవం కానుకగా రూ. 750 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక సాధికారత కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే మహిళలకు శిక్షణా తరగతులు ప్రారంభించి తన సొంత నిధులతో కుట్టు మిషన్లు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, సీనియర్ నాయకులు సి.హెచ్ సత్యనారాయణ డివిజన్, అధ్యక్షుడుఅంబటి శ్రీనివాస్, సత్యం, తిరుపతి పాల్గొన్నారు.

మహిళలు ఆత్మ రక్షణతో ముందుకు వెళ్లాలి

- ప్రముఖ సీనియర్ న్యాయవాది పుష్పలత

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతులు ఆత్మరక్షణతో ధైర్యంతో. ముందు కెళ్లాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది పుష్పలత తెలిపారు. మహిళా దినోత్సవం పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని కమల ప్రసూన నగర్‌లో గల ఆమె కార్యాలయంలో నవతెలంగాణతో మాట్లాడా రు... 'ముందుగా యావత్ మహిళా ప్రపం చానికి ప్రపంచ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. మన దేశంలో పటిష్టమైన చట్టాలు, న్యాయ వ్యవస్థ ఉన్నా కూడా మానవ మృగాల పాశవిక దాడులు రోజురోజుకు తీవ్రతరమ వుతున్నాయి. ప్రతీరోజు ఎక్కడో చోట మహిళలు లైంగిక దాడులకు, దారుణ హత్యలకు బలవుతూనే ఉన్నారు. తాజాగా జరిగిన మెడికో ప్రీతి మతి సంఘటన నన్ను పూర్తిగా కలిసివేసింది. ఆమెకు నా శ్రద్ధాంజలి. ప్రతీ మహిళ ఇలాంటి సంఘటనలు జరిగిన ప్పుడు ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకోవాలి. ఎప్పుడైనా వారికి ఇలాంటి చేదు అనుభవాలు ఎదురైనప్పుడు ఆ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అనేది తెలుసు కోవాలి. మీ తోటి స్నేహితులకు కూడా చేయూ తనివ్వాలి .అంతేగాని వారి జీవితాన్ని చేజేతులా అంతం చేసుకోకూడదు. ప్రతీ మహిళ, యువతి ఎటు వంటి విపత్తు వచ్చిన ధైర్యంగా పోరాడి సాధిం చుకోవాలి. ఇటువంటి విషయాలు తల్లిదండ్రులతో పంచుకోవాలి మనోధైర్యం తో ముందడుగు వేయాలి. అంతేకాకుండా సమాజంలో ప్రతి మహిళ, యువతి విద్యావంతురాలవ్వాలి. నేడు చదువుకున్న యువత కూడా సత్వర నిర్ణయాలు తీసుకుంటూ ప్రేమిం చామని, తల్లిదండ్రులు ఒప్పుకోలేదని, ఇతరత్రా చిన్న చిన్న కారణాలతో తొందరపాటుగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది చాలా పొరపాటు. బతికి ఏదైనా సాధించాలి. మహిళలు, యువతులు పాశ్చాత్య పోకడలకు పోకుండా ఉంటే కొంతమేరకు హత్యలను అరకట్టవచ్చు. యువతులు సంప్రదాయ దుస్తులు ధరిం చాలి. సమాజంలో స్త్రీల పాత్ర ఎంతో కీలకమైంది. పురు షులతో సమానంగా నేడు మహిళలు విద్య ,ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో 50శాతం రిజర్వేషన్ తో ముందుకు వెళుతున్నారు.' అని అన్నారు.

మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

- కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ నేడు ఉన్నత శిఖరాలకు వెళు న్నారని కేపీహెచ్ బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శైలజ దంపతులు పాల్గొని డివిజన్ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు చీరలు పంచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఒక అమ్మగా.. ఒక చెల్లిగా ..ఒక భార్యగా మహిళ లేకపోతే వ్యవస్థ శూన్యమన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిద్దాం అని అన్నారు. అనంతరం 4 వ ఫేస్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహిళా దినోత్సవం వేడుకల్లో పాల్గొని సాంస్కృతి కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, శేఖర్ రెడ్డి, రామయ్య , మహిళలు, మహిళ నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సేవలన్నీ ప్రయివేటుకు..

బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ మొదలు కుక్కల నియంత్రణ వరకు

- రోడ్ల నిర్వహణ సైతం
- బల్దియా ఆదాయానికి గండి



నవతెలంగాణ- సిటీబ్యూరో

రాష్ట్రంలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పెద్ద మున్సిపల్ కార్పొరేషన్. కోటిన్నరకుపైగా జనాభా ఉంది. రూ.6వేల కోట్లకుపైగా బడ్జెట్. నగరవాసులు ఆస్తిపన్ను, సీవరేజ్ పన్ను, పలురకాల పన్నులు చెల్లిస్తున్నారు. అందుకనుగుణంగానే బాధ్యతగా జీహెచ్ఎంసీ సేవలందించాల్సి ఉంటుంది. కానీ ఒక్కొక్క సేవలన్నింటినీ ప్రయివేటుపరం చేస్తోంది. జనన, మరణ ధ్రువపత్రాల జారీ మొదలుకుని కుక్కల నియంత్రణ వరకు ప్రయివేటు సంస్థలకు అప్పగించారు. చెత్త నిర్వహణ, రోడ్ల నిర్వహణను సైతం ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టారు. ఫలితంగా ప్రజలకు ఉచితంగా అందించాల్సిన సేవలన్నీ ఖరీదయ్యాయి. అందులో భాగంగానే అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయి.

బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

జనన, మరణాల సర్టిఫికెట్ల జారీ ప్రయివేటుపరం చేశారు. పుట్టిన ప్రతి బిడ్డకూ జనన ధృవీకరణ పత్రం ఇవ్వాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని(హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి) ప్రాంతాల్లో ఈ బాధ్యతను జీహెచ్ఎంసీ నిర్వహిస్తోంది. కానీ, అవినీతి సాకుతో ఈ సేవలను ప్రయివేటుపరం చేశారు. దీంతో బల్దియా ఖజానాకు ఏటా సుమారు రూ.3 కోట్ల నష్టం. సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో రూ.20 చెల్లిస్తే ధృవపత్రం జారీ చేసేవారు. ఈ బాధ్యతను మీసేవా కేంద్రాలకు అప్పగించారు. సర్టిఫికెట్‌కు ఎంత వసూలు చేస్తున్నారో వాళ్లకే తెలియడం లేదు. నిధుల్లేక అసలే ఇబ్బందుల్లో ఉన్న జీహెచ్ఎంసీ అక్షరాల రూ.3.15 కోట్ల నష్టం మూటగట్టుకొంటుంది. ఏటా గ్రేటర్ కార్పోరేషన్ పరిధిలో జనన ధృవపత్రాలు 1.50 లక్షలు, మరణ ధ్రువపత్రాలు 60 వేల వరకు ఉంటున్నాయి. ఇందులో జనన ధృవపత్రాలను సరాసరిగా మూడు చొప్పున, మరణ ధృవపత్రాలు వివిధ అవసరాలైన ఇన్సూరెన్స్, బ్యాంకు, ఆస్తి తగాదాల్లోనూ తప్పనిసరైంది.

అక్రమాలకు ఊతం

జనన, మరణ ధృవపత్రాలు జారీచేసే విధానాన్ని ప్రయివేటుకు ఇచ్చిన తర్వాతనే అక్రమాలు పెరిగాయని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో మార్పులు చేశారు. అయినా ఫేక్ సర్టిఫికెట్ల దందా ఆగడం లేదు. అక్రమాలు జరిగాయని 31వేల నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్లను రద్దు చేయడం ఇందుకు నిదర్శనం. సరైన సర్టిఫికెట్లు లేకున్నా జనన, మరణ ధృవపత్రాలు జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సేవలను ప్రయివేటుకు ఇవ్వడంతో బల్దియా ఖజానాకు నష్టంతోపాటు ప్రజలపైనా భారంగా మారింది. పైగా అక్రమాలకు ఊతమిచ్చేవిధంగా అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు.

కుక్కల నియంత్రణపైనా..

గ్రేటర్‌లో కుక్కల నియంత్రణ కార్యక్రమాన్ని ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టారు. ఒక్కో కుక్కకు రూ.1500 చెల్లిస్తున్నారు. కుక్కల బర్త్ కంట్రోల్‌తోపాటు రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడానికి భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. అయినా కుక్కల నియంత్రణ నామమాత్రంగానే ఉంది. ఫలితంగా అంబర్‌పేట్‌లో బాలున్ని కుక్కలు చంపిన విషయం తెలిసిందే. నిధులు ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. జీహెచ్ఎంసీలో పరిధిలో అధికారుల చెప్పిన లెక్కల ప్రకారం 2021లో 4,61,145 కుక్కులు, 2022లో 5లక్షలు, 2023లో సుమారు 5లక్షలకుపైగానే కుక్కలు ఉన్నాయని అంచనా. వీటిలో 75శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తయినట్టు మేయర్ ప్రకటించారు. 2021లెక్కల ప్రకారం 4,61,145 కుక్కులు ఉన్నాయని, వాటిలో 1,99,182 కుక్కలకు ఆపరేషన్లు చేసినట్టు, మరో 2,61,963కుక్కలకు ఆపరేషన్లు చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. అంటే తప్పుడు లెక్కలతో నిధులు కాజేస్తున్నారు.

రెండున్నర గంటలపాటు కమిషనర్, ఉన్నతాధికారులతో మేయర్ సమీక్ష

ఫేక్ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల వ్యవహారంలో ఏం జరిగిందన్న అంశంపై కమిషనర్ లోకేష్ కుమార్, ఉన్నతాధికారులతో మేయర్ గద్వాల విజయలక్ష్మి బుధవారం రెండున్నర గంటల పాటు సమీక్ష నిర్వహించారు. సీఎంహెచ్‌వో, స్టాటస్టికల్ అధికారులపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్డీవో ప్రొసీడింగ్ లేకుండా మంజూరైన 21 వేల బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లను తాము గుర్తించినట్టు తెలిపారు. రద్దు చేసిన బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల దరఖాస్తుదారులకు నోటీసులు ఇస్తాం అన్నారు. వీరందరికీ త్వరలో మొబైల్ ద్వారా సమాచారం ఇస్తామని చెప్పారు. వారు తమ పేపర్లను మళ్లీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. 15 మీ సేవ కేంద్రాల్లో ఈ విధమైన సర్టిఫికెట్లు అప్‌లోడ్ అయినట్టుగా గుర్తించామని.. మీసేవ డిపార్ట్‌మెంట్‌తో పాటు పోలీస్ శాఖకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బర్త్ అండ్ డెత్ విభాగంలో 12 మంది ఆపరేటర్ల నియామకం రోస్టర్ విధానాల్లో జరగలేదని చెప్పారు. సీఎంహెచ్‌వో స్టాటస్టికల్ అధికారులకు ఇంటర్వ్యూ చేసే అధికారం లేదని.. దానిపై విచారణ చేస్తామని తెలిపారు. 2021 జులై నుంచి ఆన్‌లైన్ విధానం ప్రారంభించిన తర్వాత నాలుగు లక్షల 30 వేలకు పైగా భర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని వివరించారు.

ఉచిత సేవలు బల్దియా బాధ్యత సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న జీహెచ్ఎంసీపై ఉచిత సేవలందించాల్సిన బాధ్యత ఉంది. బర్త్, డెత్ సర్టిఫికెట్లను జీహెచ్ఎంసీ సిటిజన్ సర్వీస్‌సెంటర్లలో కూడా జారీచేయాలి. 31వేల నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ల రద్దుకు జీహెచ్ఎంసీ బాధ్యత వహించాలి. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి.

ఆరోగ్య, సంపద, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే రాజధాని

వరల్డ్ టూర్స్ అండ్ ట్రావెల్ ఆపరేటర్ల సమావేశంలో మంత్రి శ్రీనివాసగౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆరోగ్య, సంపద, ఫార్మా రంగాల్లో తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే రాజధానిగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఇంటర్నేషనల్ టూరిజం కల్చర్ ఎగ్జిబిషన్‌లో భాగంగా బుధవారం బెర్లిన్‌లో ట్రావెల్ అండ్ టూర్ ఆపరేటర్స్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతూ...ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలు, బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగలు ఎంతో ప్రత్యేకమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బుద్ధిజానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తున్నామన్నారు. నాగార్జునసాగర్‌లో బుద్ధవనం ప్రాజెక్టును ప్రపంచస్థాయిలో నిర్మించామని వివరించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాక్సిన్లను సరఫరా చేసిన ఘనత హైదరాబాద్ నగరానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా టూరిజం సెక్రటరీ అరవింద్ సింగ్, భారత రాయబారి పర్వతనేని హరీష్, తెలంగాణ టూరిజం ఎండి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



డబ్ల్యుటిసి బెర్త్ లక్ష్యం

- ఆస్ట్రేలియాతో చివరి టెస్ట్ నేటినుంచే..
- ముఖ్య అతిథులు ఇరుదేశాల ప్రధానులు
- ఉదయం 9.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

అహ్మదాబాద్: డబ్ల్యుటిసి ఫైనల్ బెర్త్ లక్ష్యంగా టీమిండియా.. ఆస్ట్రేలియాతో నాల్గో టెస్ట్‌కు సిద్ధమౌతోంది. ఇరుజట్ల మధ్య గురువారం నుంచి జరిగే టెస్ట్‌లో భారతజట్టు గెలిస్తే.. నేరుగా డబ్ల్యుటిసి ఫైనల్‌కు చేరుతుంది. గుజరాత్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే ఈ టెస్ట్‌కు ముఖ్య అతిథిగా భారత ప్రధాని నరేంద్ర మోడీతోపాటు ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్ హాజరుకానున్నారు. వీరిద్దరు కలిసి తొలిరోజు ఆటను వీక్షించనున్నారు. నూతనంగా నిర్మించిన ఈ స్టేడియంలో ఇప్పటివరకు ఒక అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ జరిగిన దాఖాలాలు లేవు. దీంతో పిచ్ బౌలర్లకా, బ్యాటర్లకు సహకరిస్తుందనే విషయమై స్పష్టతలేదు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఇప్పటివరకు జరిగిన మూడు టెస్టుల్లో భారత్ రెండింటిలో, ఆస్ట్రేలియా ఒక టెస్ట్‌లో గెలిచిన సంగతి తెలిసిందే.

ముఖ్య అతిథులుగా మోడీ, అల్బనీస్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అహ్మదాబాద్‌లో జరిగే టెస్టుకు భారత, ఆస్ట్రేలియా ప్రధానులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ.. ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్‌తో కలిసి మ్యాచ్‌ను వీక్షించనున్నారు. అత్యధిక సీట్ల సామర్థ్యం(1,32,000) గల ఈ మైదానంలో ఓ అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ జరగడం ఇదే ప్రథమం.

శ్రీకర్ భరత్‌కు ద్రావిడ్ మద్దతు..

వికెట్ కీపర్ శ్రీకర్ భరత్‌కు టీమిండియా కోచ్ రాహుల్ ద్రావిడ్ మద్దతు తెలిపాడు. గత మూడు టెస్టుల్లో బ్యాటింగ్‌లో నిరాశపరుస్తుండడంతో అతడిపై వేటు తప్పదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అందుకు తగ్గట్లుగానే మరో యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ అహ్మదాబాద్ టెస్టు కోసం తీవ్రంగా సాధన చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో దర్శనమిచ్చాయి. అతడి శిక్షణను టీమిండియా ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్ దగ్గరుండి పర్యవేక్షించినట్లు సమాచారం. అయినా రాహుల్ ద్రావిడ్ మాత్రం భరత్‌కు మద్దతుగా నిలుస్తూ మీడియాతో మాట్లాడాడు. "భరత్ ప్రదర్శనపై మేం ఎలాంటి ఆందోళన చెందడం లేదు. అతడి దృక్పథంపై మళ్లీ ప్రశ్నలు వస్తున్నాయి. సవాళ్లు, పరిస్థితులను అర్థం చేసుకొని ఆడేందుకు ప్రయత్నిస్తాడు. మూడో టెస్టులో భరత్ గొప్పగా రాణించనప్పటికీ.. తొలి ఇన్నింగ్స్‌లో అతడు చేసిన 17 పరుగులు మాత్రం చాలా కీలకం. ఢిల్లీలోనూ చాలా పాజిటివ్‌గా ఆడాడు. కఠినమైన పిచ్‌లపై కాస్త అదృష్టం కలిసిరావాల్సి ఉంటుంది. కానీ, భరత్‌కు అదే కలిసిరాలేదు. అయితే, అతడు ఆడే విధానం బాగుంది. అందుకే భరత్ బ్యాటింగ్‌పై ఆందోళన చెందకుండా మరింత దృష్టిపెడతాం" అనిద్రావిడ్ తెలిపాడు.

జట్లు(అంచనా)..

ఇండియా: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్/కేఎల్ రాహుల్, పుజారా, కోహ్లి, శ్రీకర్ భరత్(వికెట్ కీపర్), శ్రేయస్, జడేజా, అక్షర్, అశ్విన్, షమీ, ఉనాద్కట్/సిరాజ్.

ఆస్ట్రేలియా: స్మిత్(కెప్టెన్), క్యారీ(వికెట్ కీపర్), హెడ్, ఖవాజా, లబూషేన్, హ్యాండ్‌కోంబ్, గ్రీన్, స్టార్క్, మర్ఫీ, కుహ్నెమన్, లియాన్.

10నుంచి భారత్-ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్ టికెట్ల విక్రయాలు



విశాఖపట్నం: ఈ నెల 19న విశాఖ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్న భారత్-ఆస్ట్రేలియా రెండో వన్డే మ్యాచ్‌కు ఈ నెల 10 నుంచి టికెట్లను విక్రయించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్. గోపీనాథరెడ్డి తెలిపారు. 10 నుంచి ఆన్‌లైన్లో, 13 నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్‌లో ఈసారి మూడు కేంద్రాల్లో విక్రయాలు చేపడుతున్నామని, ఎక్కడెక్కడ అనేది త్వరలోనే తెలియజేస్తామన్నారు. పేటిఎంలోనూ లభిస్తాయన్నారు. టికెట్ల ధరలు రూ.600, రూ.1,500, రూ.2000, రూ.3000, రూ.3,500, రూ.6000గా నిర్ణయించామన్నారు.

టాప్‌లో అశ్విన్, ఆండర్సన్

ఐసిసి టెస్ట్ బౌలర్ల జాబితా విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా టెస్ట్ బౌలర్ల జాబితాలో భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ అండర్సన్ సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. గత వారం తొలిసారి బౌలర్ల జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన అశ్విన్.. బుధవారం ఐసిసి ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో అండర్సన్‌తో కలిసి అగ్రస్థానాన్ని పంచుకున్నాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్టు మ్యాచ్‌లో నాలుగు వికెట్లు మాత్రమే తీసిన అశ్విన్ నాలుగు ర్యాంకింగ్ పాయింట్లు కోల్పోయాడు. దాంతో అశ్విన్, అండర్సన్ ఇద్దరూ 859 ర్యాంకింగ్ పాయింట్లతో సంయుక్తంగా టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నారు. ఇక కమ్మిన్స్(ఆస్ట్రేలియా) 849 ర్యాంకింగ్ పాయింట్లతో మూడో స్థానం, దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడా 807 ర్యాంకింగ్ పాయింట్స్‌తో నాలుగో స్థానంలో ఉన్నారు. భారత్‌తో జరిగిన మూడో టెస్ట్ రాణించిన ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లియాన్ ఐదు స్థానాలు మెరుగుపర్చుకుని ఏకంగా 9వ స్థానంలోకి దూసుకొచ్చాడు.

భారత షట్లర్లకు నిరాశ

- తొలిరౌండ్‌లోనే లక్ష్యసేన్ ఓటమి
- జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



మాడ్రిడ్: బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ టూర్ సూపర్-300, జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ తొలిరౌండ్‌లో భారత యువ షట్లర్ల లక్ష్యసేన్‌కు నిరాశ పరిచాడు. బుధవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో లక్ష్యసేన్ 19-21, 16-21తో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పాపోవ్ చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఈ మ్యాచ్‌ను లక్ష్యసేన్ కేవలం 45 నిమిషాల్లోనే ఓటమిని అంగీకరించాడు. భారత టీనేజర్ తస్నిన్ మీర్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చి ప్రధాన టోర్నీలోకి ప్రవేశించినా.. తొలిరౌండ్‌లోనే 8-21, 10-21తో 8వ సీడ్, థాయ్‌లాండ్‌కు చెందిన ఛో-ఛువాంగ్ చేతిలో ఓడింది. ఇక మహిళల సింగిల్స్‌లో మాల్విక బన్సోద్ 13-21, 14-21తో 5వ సీడ్ చైనాకు చెందిన ఝి-హి చేతిలో, మిథున్ మంజునాథ్ 8-21, 21-19, 11-21తో మాజీ ప్రపంచ ఛాంపియన్ లో-కెన్-యు(సింగపూర్) చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-బి. సుమిత్ రెడ్డి జోడీ 10-21, 12-21తో స్కాట్లాండ్ జోడీ చేతిలో పరాజయాన్ని చవిచూశారు.

నవచిత్రం

హిట్ ఖాయం



వాసంతి, అజయ్ శ్రీనివాస్, ఆది సాయికుమార్

చాగంటి ప్రొడక్షన్స్ బ్యానర్‌లో శ్రీమతి సునిత సమర్పణలో అజయ్ శ్రీనివాస్ నిర్మించిన సినిమా 'సిఎస్ఐ సనాతన్'. ఆది సాయికుమార్, మిషా నారంగ్, నందినీ రాయ్, వాసంతి, తారక్ పొన్నప్ప, అలీ రెజా, ఖయ్యూమ్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ శుక్రవారం ఈ సినిమా విడుదల కాబోతున్న నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత డిఎస్ రావు మాట్లాడుతూ, 'ఈ ట్రైలర్‌లో సత్తా ఉంది. ఇండస్ట్రీలో కూడా ఈ మూవీ ట్రైలర్‌పై ఓ పాజిటివ్ డిస్కషన్స్ జరుతున్నాయి. ఖచ్చితంగా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు అని నమ్ముతున్నాను' అని అన్నారు. 'ఆది అన్నకు ఈ కథ చెప్పగానే ఆయన చాలా ఎగ్జైట్ అయ్యారు. తర్వాత కథపై దర్శకుడు దేవ్‌తో కలిసి ఇంకా హార్డ్ వర్క్ చేశాం. మా కెమెరామేన్ శేఖర్ వర్క్, ఆర్ఆర్ సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయి. థియేటర్‌కు వచ్చే ఆడియన్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ డిజప్పాయింట్ కారు' అని నిర్మాత అజయ్ శ్రీనివాస్ చెప్పారు. దర్శకుడు శివశంకర్ దేవ్ మాట్లాడుతూ, 'కొన్ని రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా ఈ కథ రాసుకున్నాను. ఇప్పటికే మన దేశంలో ఇలాంటివి చాలా జరుతున్నాయి. దీంతో ఈ కథ మీ అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నారు' అని అన్నారు. హీరో ఆది సాయికుమార్ మాట్లాడుతూ, 'ఓ క్రైమ్ సీన్ పై ఖచ్చితంగా ఓ పాయింట్ చుట్టూ తిరిగే కథ తెలుగులో మా సినిమానే మొదటిది అనుకుంటున్నాను. ఇది నన్ను బాగా ఎగ్జైట్ చేసింది. ఫైనాన్సియల్ క్రైమ్ చుట్టూ తిరుగుతుంది. ఈ మూవీ దర్శకుడు దేవ్‌కు, అలాగే మా నిర్మాత శ్రీనివాస్‌కి పెద్ద బ్రేక్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.


నాలుగు భిన్న కథలు



బిందు మాధవి

సుహాస్, తరుణ్ భాస్కర్, బిందు మాధవి, మడోన్నా సెబాస్టియన్, రవింద్ర విజయ్, వెంకటేష్ మహా, ఫణి ఆచార్య ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'యాంగర్ టేల్స్'. ఫ్యాన్ మేడ్ ఫిల్మ్ బ్యానర్ పై.. నాలుగు భిన్నమైన కథలతో రూపొందిన ఈ ఆంథాలజీ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఈ నెల 9నుంచి స్ట్రీమింగ్ కాబోతోంది. నితిన్ ప్రభల తిలక్ డైరెక్ట్ చేసిన ఈ సిరీస్‌కు సంబంధించిన నాలుగు కథలకు నలుగురు సినిమాటోగ్రాఫర్స్ పనిచేయడం విశేషం. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌కు సంబంధించి ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది.

ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, 'దర్శకుడు నితిన్ ఈ కథ చెప్పినప్పుడు నాకు బాగా నచ్చింది. ఈ సిరీస్ నిర్మాణంలో ఆర్టిస్టులతో పాటు టెక్నీషియన్స్ అంతా బాగా కోపరేట్ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కథలతో వస్తాం' అని అన్నారు. 'ఇందులో ఉన్న ప్రతి కథ ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని రచయిత, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కార్తికేయ చెప్పారు. బిందు మాధవి మాట్లాడుతూ, 'ఈ ఆంథాలజీలో యాంగర్ గురించి చెప్పారు. ఇంత మంచి కథ, పాత్రకు నన్ను అనుకున్నందుకు నితిన్‌కు చాలా థ్యాంక్స్' అని తెలిపారు. 'నితిన్ నాతో 'కళాకారుడు' అనే షార్ట్ ఫిల్మ్ చేశాడు. ఈ సిరీస్ స్టార్ట్ అయిన తర్వాత ఎవరూ ఆపరు. ఆ స్థాయిలో తీశాడు నితిన్. రాబోయే రోజుల్లో ఇంకా మంచి సినిమాలు ఇస్తాడు అని చెప్పగలను' అని సుహాస్ చెప్పారు. దర్శకుడు ప్రభల నితిన్ తిలక్ మాట్లాడుతూ, 'ఆంథాలజీ కాబట్టి నీరసంగా ఏం ఉండదు. మీ అందరికీ నచ్చుతుందనుకుంటున్నాను' అని అన్నారు.



'మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి' చిత్రంలో అనుష్క


కమర్షియల్ మీటర్



కిరణ్ అబ్బవరం

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కడూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 7న విడుదల కానున్న ఈ సినిమా టీజర్‌ని దర్శకుడు బాబీ కొల్లి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'కిరణ్ అబ్బవరంకు ఈ సినిమా మాస్ మీటర్‌ని సెట్ చేస్తుందని నమ్ముతున్నాను. టీజర్ చూస్తుంటే పక్కా మాస్ కమర్షియల్ మీటర్ అనిపిస్తోంది' అని తెలిపారు. 'చిన్నపుడు ఎలాంటి సినిమాలు చూసి థియేటర్‌లో విజల్స్ కొట్టి, గోల చేశానో అలాంటి సబ్జెక్ట్ ఉన్న సినిమా ఇది. నన్ను నమ్మి ఇంత పెట్టుబడి పెట్టిన నిర్మాత చెర్రీకి, ఇంత పెద్ద స్క్రిప్ట్‌ని నాతో చేసిన దర్శకుడు రమేష్‌కి థ్యాంక్స్. థియేటర్‌లో చాలా ఎగ్జైట్ అవుతారు. టీజర్ ఎలా పరిగెట్టిందో సినిమా కూడా అలానే ఆగకుండా మాస్ మీటర్‌లో పరుగెడుతుంది. సినిమా బిగినింగ్ నుంచి చివరి వరకూ గోల గోలగా ఉంటుంది' అని హీరో కిరణ్ అబ్బవరం చెప్పారు. దర్శకుడు రమేష్ మాట్లాడుతూ, నన్ను ఇంత దూరం తీసుకొచ్చిన బాబీకి, గోపీచంద్ మలినేనికి కృతజ్ఞతలు. ఏప్రిల్ 7న ఈ సినిమా పెద్ద హిట్ కాబోతుంది' అని అన్నారు. నిర్మాత చెర్రి మాట్లాడుతూ, 'దర్శకుడు రమేష్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాని చేశారు. కిరణ్ కెరీర్‌లో హయ్యస్ట్ బడ్జెట్ మూవీ. సరికొత్త మాస్ అవతార్‌లో ఆయన్ని చూస్తారు' అని తెలిపారు.

అవార్డులు రాలేదు కానీ.. ప్రశంసలు దక్కాయి



కళ్యాణి మాలిక్

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, దాసరి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రొమాంటిక్ ఫిల్మ్ 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మాతలు. శ్రీనివాస్ అవసరాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. నాగశౌర్య, మాళవిక నాయర్ జంటగా నటించిన ఈ చిత్రానికి కళ్యాణి మాలిక్ సంగీతం అందిస్తున్నారు. ఈనెల 17న ఈ చిత్రం థియేటర్లలో భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో బుధవారం సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

ముచ్చటగా మూడోది

'ఊహలు గుసగుసలాడే', 'జ్యో అచ్యుతానంద' సినిమాల తర్వాత నాగశౌర్య-శ్రీనివాస్ అవసరాల-నేను చేస్తున్న హ్యాట్రిక్ ఫిల్మ్ కావడంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా తర్వాత 'ఇంటింటి రామాయణం', 'విద్య వాసుల అహం' రానున్నాయి. వీటితో పాటు మరో రెండు వెబ్ సిరీస్‌లు చేస్తున్నాను.

అరుదైన సందర్భం ఉన్న పాట

ఇటీవల విడుదలైన 'కనుల చాటు మేఘమా' పాటకు వస్తున్న స్పందన నాకెంతో సంతోషాన్ని ఇచ్చింది. నా కెరీర్‌లోఇది ఉత్తమ పాట అని చాలా గొప్పగా చెప్పగలను. ప్రేమలు చాలా రకాలుగా ఉంటాయి. ఇది మోహం లేని మధురమైన ప్రేమ. ఇటువంటి సందర్భంలో వచ్చిన ప్రేమ పాటను నేను ఇప్పటివరకు చేయలేదు. శ్రీనివాస్ అభిరుచికి తగ్గట్లుగా స్వరపరిచాను. కేవలం ట్యూన్ మాత్రమే కాదు.. లక్ష్మీభూపాల్ రాసిన లిరిక్స్, ఆభాస్ జోషి గాత్రం ఎంతో నచ్చాయి. ఈ పాట హిట్ అవ్వడంలో వాళ్ళ ప్రమేయం చాలా ఉంది.

హిట్‌కి తగ్గ అవకాశం రాలేదు

నా కెరీర్‌లో ఏ హిట్ వచ్చినా ఆ తర్వాత దానికి తగ్గ అవకాశం రాలేదు. 'ఆంధ్రుడు, ఐతే, అలా మొదలైంది, అష్టాచమ్మా..' ఇలా ఏ సినిమా తీసుకున్నా నేను ఊహించిన విధంగా కెరీర్ లేదు. అలాగే కమర్షియల్ సినిమాలు 'అధినాయకుడు, బాస్' సినిమాలు చేశాను. అవి ఆశించినస్థాయిలో ఆడలేదు. 2003లో నా మొదటి సినిమా 'ఐతే' విడుదలైంది. ఈ 20 ఏళ్లలో ఇది నా 19వ సినిమా. ఈ ప్రయాణంలో నా సంగీతం పట్ల ఎన్నో ప్రశంసలు దక్కాయి.

ఆస్కార్ వరకూ వెళ్ళడం గర్వంగా ఉంది

మా అన్నయ్య కీరవాణి స్వరపరిచిన 'నాటు నాటు' పాట ఆస్కార్ బరిలో నిలవడం చాలా గర్వంగా ఉంది. రాజమౌళికి తన సినిమా మీద, ఆ పాట మీద ఉన్న నమ్మకమే అక్కడి వరకు తీసుకెళ్లింది. నా సంగీతం, నా పాటలు బాగున్నాయి అని ప్రశంసలు దక్కాయి. నేను స్వరపరిచిన పాటలు పాడిన వారికీ అవార్డులూ వచ్చాయి. కానీ ఎందుకనో నాకు అవార్డులు రాలేదు. ఈ సినిమాకి లిరిక్ రైటర్‌గా లక్ష్మీభూపాల్, సింగర్‌గా ఆభాస్ జోషి అవార్డులు అందుకుంటారనే నమ్మకం ఉంది. అయితే అవార్డులు కంటే కూడా నా పాట బాగుందనే పేరే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది.

స్నేహమూ ముఖ్యమే..



కోమల్ నాయర్, ఇంద్ర

ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతి శర్మ, ఇమ్రాన్, సీతల్ బట్ నటీనటులుగా రూపొందుతున్న చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. యు.మేఘనాథ్, ఎం.లోకేష్ కుమార్ సమర్పణలో లోల్ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్రాస్ చంద్ర, డాక్టర్ విజయ రమేష్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుని, పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న సందర్భంగా మేకర్స్ మోషన్ లోగోను గ్రాండ్‌గా లాంచ్ చేశారు.

ఈ వేడుకకి ఏ.పి అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డి, తెలంగాణ ఎఫ్.డి.సి.ఛైర్మెన్ అనిల్ కుర్మాచలం, టి.యఫ్. పి. సి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, డైరెక్టర్ రాజు యాదవ్, సీనియర్ నటి జయలక్ష్మి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని, చిత్ర మోషన్ లోగోను లాంచ్ చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ, 'స్నేహాన్ని కొత్తగా, గొప్పగా చెప్పాలని ఈ సినిమా తీశాం. ప్రేమకు ఉన్న విలువలు, స్నేహానికి ఉన్న గొప్పతనం రెండింటిని బ్యాలెన్స్ చేసి ఈ సినిమాలో చూపించాం. యూత్‌కి కనెక్ట్ అయ్యే సినిమా ఇది' అని తెలిపారు. 'లవ్‌లో బ్రేకప్స్ చూశాం. కానీ ఫ్రెండ్షిప్‌లో చూడలేదు. ప్రతి మనిషి జీవితంలో లవ్‌కు ఎంత ఇంపార్టెన్స్ ఇస్తాడో, ఫ్రెండ్షిప్‌కు అంతే ఇంపార్టెన్స్ ఇవ్వాలనే తెలియజేసే చిత్రమిది. వాస్తవ జీవితంలో జరిగిన ఒక ఇన్సిడెంట్‌ను కథగా రాసుకున్నాను. ఈ కథ కచ్చితంగా ట్రెండ్‌ను సెట్ చేస్తుందనే నమ్మకం ఉంది' అని దర్శకుడు లక్ష్మణ్ జెల్ల చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

- రాష్ట్ర ముఖ్య సలహాదారురాలిగా షీబా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ముఖ్య సలహాదారురాలిగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (హెచ్‌ఆర్సీ) మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు షీబా నియమితురాలయ్యారు. హైదరాబాద్ తార్నాకలోని హెచ్చార్సీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం 12న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్చార్సీ దక్షిణ భారతదేశ అధ్యక్షులు ఆర్‌ఎస్ జే థామస్, ఫోరమ్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కొత్వల్ దయానంద్, ప్రధాన కార్యదర్శి పి.సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి : టీఆర్టీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) డిమాండ్ చేసింది. గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కావలి అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కటకం రమేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమున్న తెలంగాణలో బీఆర్‌ఎస్ సీపీఎస్ రద్దు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సీపీఎస్ అమలుకు ముందు ఎంపిక ప్రక్రియ పూర్తయి పోస్టింగ్ కోసం వేచిఉన్న డీఎస్సీ-2003 వారికి, వివిధ కారణాలతో ఆలస్యంగా పోస్టింగ్‌లు పొందిన డీఎస్సీ-2002 వారికి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేస్తూ ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. పండితులు, పీఈటీల అప్‌గ్రెడేషన్‌పై కోర్టులో కేసు సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. హామీ ఇచ్చిన ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీని వేయాలనీ, జులై ఒకటి నుంచి ఐఆర్ ప్రకటించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని తెలిపారు.

బార్ లైసెన్సుల డబ్బు ఇచ్చేయండి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బార్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయనందున షాపు యజమానుల నుంచి రెన్యువల్ నిమిత్తం తీసుకున్న లక్ష రూపాయల డిపాజిట్ డబ్బును తిరిగి వారికి చెల్లించాలని ఎక్సైజ్ శాఖను హైకోర్టు ఆదేశించింది. దీనిపై గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ సమర్థిస్తూ తీర్పు చెప్పింది. కోర్టుల్లో కేసుల కారణంగా వెలువడిన స్టే ఉత్తర్వుల ఫలితంగా షాపుల లైసెన్స్ రెన్యువల్ జరగలేదు. ఏడాదికి రెన్యువల్ గడువు కాబట్టి ఆ గడువు తీరినందున 60 షాపుల యజమానుల నుంచి రెన్యువల్ కోసం ఒక్కొక్కరి నుంచి తీసుకున్న రూ.లక్షను వాపస్ ఇచ్చేయాలని తీర్పు చెప్పింది.

హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలి

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఉమ్మడిరాష్ట్రంలో తొలగించిన 250 మంది హోంగార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. బుధవారం ఈమేరకు సీఎం కేసీఆర్‌కు ఆయన లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్డర్ కాపీ లేదంటూ 250 మంది హోంగార్డులను విధుల్లో నుంచి తొలగించారని గుర్తు చేశారు. అప్పటికే పదేండ్లు వివిధ జిల్లాలో వారు విధులు నిర్వహించారనీ, అందుకు సంబంధించిన ఐడీకార్డు, బ్యాంకు అకౌంట్స్, ఆరోగ్యకార్డులు ఉన్నాయని తెలిపారు.

ఉరితాళ్లపై మగువ

- ఓవైపు సన్మానాలు, మరోవైపు ఉరితాళ్లు
- సమన్యాయం లేదంటూ గౌరవెల్లి నిర్వాసితుల ఆవేదన



నవతెలంగాణ-అక్కన్నపేట

సొంత రాష్ట్రంలో మహిళలకు సమన్యాయం జరుగుతుందని భావించామని, కానీ అన్యాయమే జరుగుతోందని, ఆడపిల్లలుగా పుట్టడమే వారు చేసిన శాపం అన్నట్టు భూ నిర్వాసిత మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని గౌరవెల్లి నిర్వాసిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గుడాటిపల్లిలో గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులైన మహిళలు ఉరికొయ్యలు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌరవెల్లి ప్రాజెక్టు మొదలై ఇప్పటికే దాదాపు 14 సంవత్సరాలు పూర్తయిందని, పనులు మాత్రం ఇప్పటికీ నత్తనడకన సాగుతూ భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. భూ నిర్వాసితుల్లో 18 ఏండ్లు నిండి పెండ్లయిన మహిళలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఆదుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఇవ్వకుండా మొండి చెయ్యి చూపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రమంతా మహిళలను సన్మానిస్తుంటే.. ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాత్రం మమ్మల్ని పట్టించుకోకుండా దాదాపు 120 మంది మహిళలకు పరిహారం ఇచ్చేది లేదని ముక్కుసూటిగా చెప్పడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు అన్నింట్లో సమాన హక్కులు ఉంటాయని చెబుతూ, రాష్ట్ర ప్రభుత్వం పరిహారం విషయంలో ఇలా మొండి చేయి చూపడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ప్యాకేజీ అమలుచేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

చిన్నారుల్లో ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలు

- యాంటీ బయాటిక్స్ వాడొద్దు
- ప్రభుత్వాస్పత్రుల్లో చూపించుకోవాలి: ఉన్నతాధికారులతో మంత్రి హరీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వాస్పత్రులకు ఇన్‌ఫ్లూయెంజా లక్షణాలతో వచ్చే చిన్నారుల సంఖ్య పెరిగిందని వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు తెలిపారు. దేశంలో పెరుగుతున్న కేసుల నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశాఖ సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఇ రమేష్ రెడ్డి, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, గాంధీ, ఫీవర్, నిలోఫర్, ఎంజీఎం ఆస్పత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రాజారావు, డాక్టర్ శంకర్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ చంద్రశేఖర్‌లతో పాటు అన్ని బోధనాస్పత్రుల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.ఇన్‌ఫ్లూయెంజా వైరస్ వ్యాప్తిపై ప్రపంచం, దేశం, రాష్ట్రంలో పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో స్వల్పంగా కేసులు పెరిగాయనీ, ఎక్కువగా జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయెంజా కేసుల గురించి ఎక్కువగా భయపడి అనవసరంగా యాంటీ బయాటిక్స్ వాడొద్దనీ, వైద్యులు సిఫారసు చేసిన చికిత్సనే తీసుకోవాలని సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులు వంటి లక్షణాలుంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. అదే సమయంలో ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరి వ్యాపిస్తున్నందున జ్వరం, జలుబు వంటి లక్షణాలున్న వారు ఒకరి నుంచి మరొకరికి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

చట్టసభల్లో ఏది సమానత్వం?

50శాతం చేరడానికి మరో 80ఏండ్లు

- ప్రపంచ దేశాల చట్టసభల్లో పెరుగుతున్న మహిళా ప్రాతినిధ్యం
- ప్రతి నలుగురిలో ఒకరు మహిళా సభ్యురాలు : ఇంటర్ పార్లమెంటరీ యూనియన్
- భారత్‌లో అత్యంత నెమ్మదిగా లింగ సమానత్వం



న్యూఢిల్లీ : మహిళల ప్రాధాన్యత, చట్టసభల్లో వారి ప్రాతినిథ్యంపై పాలకుల ప్రసంగాలకు..వాస్తవ పరిస్థితికి పొంతన కుదరటం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాలతో పోల్చితే మనదగ్గర చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంటోంది. మహిళల ప్రాతినిధ్యం లోక్‌సభలో 14శాతం, రాజ్యసభలో 12శాతమే. మరోవైపు గల్ఫ్ దేశం యుఏఈ పార్లమెంట్‌లో 50శాతం మహిళలున్నారు. రువాండాలో 61శాతం, క్యూబాలో 53శాతం మహిళా ప్రాతినిధ్యముంది. లింగ వివక్ష, మహిళల హింసపై అవగాహన, చైతన్యం తీసుకురావటంతో కొలంబియా మెరుగైన ఫలితాల్ని సాధించింది. దిగువ సభకు జరిగిన ఎన్నికల్లో మహిళా సభ్యుల గెలుపు 10శాతం పెరిగింది. మనదగ్గర మాత్రం పార్టీలు తమ ప్రసంగాల్లో ఊదరగొడుతున్నా ఆచరణలో భిన్న వైఖరి కనబరుస్తున్నాయి.

అత్యంత పేలవం..బాధాకరం : ఇంటర్ పార్లమెంటరీ యూనియన్

ప్రపంచవ్యాప్తంగా చట్టసభల్లో ప్రతి నలుగురిలో ఒకరు మహిళా సభ్యురాలు ఉండగా, మనదగ్గర ఆ పరిస్థితి కనుచూపుమేరలో లేదు. చట్టసభల్లో 'లింగ సమానత్వం' అత్యంత పేలవంగా, బాధాకరంగా ఉందని 'ఇంటర్ పార్లమెంటరీ యూనియన్' వార్షిక నివేదిక అభిప్రాయపడింది. భారత్‌లో లింగ సమానత్వం అత్యంత నెమ్మదిగా కొనసాగుతోందని పేర్కొంది. 2011లో ఆయా దేశాల చట్టసభల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు మహిళా సభ్యురాలు ఉన్నారని, ఇప్పుడు వారి సంఖ్య పెరిగిందని తెలిపింది. నివేదికలో పేర్కొన్న మరికొన్ని విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

80 ఏండ్లు పడుతుంది

ఇప్పుడున్న పురోగతి ప్రకారం భారత్‌లో లింగ సమానత్వం చేకూరాలంటే 80ఏండ్లు పడుతుంది. ఆయా రంగాల్లో మహిళల పురోగతి ద్వారా ఇటీవల అనేక దేశాలు ఎంతగానో ముందడుగు వేశాయి. గత ఏడాది 47 దేశాల్లో ఎన్నికలు జరిగాయి. ఏడు దేశాల్లోని దిగువ సభల్లో మహిళా సభ్యుల ఎన్నిక లేదా ఎంపిక కనీసం 40శాతం ఉంది. ఆస్ట్రేలియాలో మునుపెన్నడూ లేనివిధంగా సెనెట్‌కు జరిగిన ఎన్నికల్లో 56.6శాతం మంది ఎంపిక య్యారు. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా మహిళా సభ్యుల ప్రాతిని థ్యంలో పెరుగుదల 0.4శాతంగానే ఉంది. దిగువ సభల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా నమోదైన దేశాలు, స్లొవేనియాలో 15శాతం, మాల్టాలో 13శాతం, ఈక్వటోరియల్ గినియాలో 11శాతం, కొలంబియాలో 10శాతం, ఆస్ట్రేలియాలో 7.9శాతం.

రువాండాలో 61శాతం

గత ఏడాది చివరి నాటికి 64దేశాల్లోని చట్టసభ స్థానాల్లో 30శాతం మహిళలు గెలుచుకున్నారు. అత్యధికంగా మహిళా పార్లమెంట్ సభ్యులున్న దేశంగా రువాండా 2008లోనే గుర్తింపు అందుకుంది. ఈదేశ పార్లమెంట్‌లో 61శాతం స్థానాలు మహిళలవే. క్యూబా-53శాతం, నికరాగువా 52శాతంతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. డొమినికా, చాద్, మాలి, ఉజ్బెకిస్తాన్..దేశాలు చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెంచటంలో ఇటీవల ఎంతగానో పురోగతి సాధించాయి. ఆయా దేశాల్లోని మంత్రివర్గంలో ఆరోగ్యం, కుటుంబం, సామాజిక సంబంధాలు, పర్యావరణం..కీలక స్థానాలు మహిళలతో భర్తీ చేస్తున్నాయి. మంత్రివర్గంలోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించిన దేశాలుగా స్పెయిన్, అల్బేనియా, రువాండా, కెనడా, ఫ్రాన్స్ ముందున్నాయి.

పోరాడితేనే రిజర్వేషన్లు అమలు

ఎన్టీఆర్‌భవన్లో ఘనంగా 'ఉమెన్స్‌డే'



నవతెలంగాణ-హైదరాబాద్

చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఉండాలని మొదటగా తీర్మానం చేసింది తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి రాజకీయ పార్టీలు ఇష్టపడటం లేదన్నారు. బుధవారం ఎన్టీఆర్‌భవన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఎన్టీఆర్‌భవన్‌లో జరిగాయి. కేక్ కట్ చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆకాశంలో సగం, జనాభాలో సగం ఉన్నా అనుకున్నంత స్థాయిలో మహిళలకు అవకాశాలు రాలేదని చరిత్ర చెబుతున్నదన్నారు. మహిళా రిజర్వేషన్ల తీర్మానాలు రాజ్యసభలోనే ఆగిపోయాయనీ, మహిళలు ఏకమై పోరాడితే ఎవరైనా దిగిరావాల్సిందే అని అన్నారు. మహిళలకు చట్టసభలో 33 శాతం రిజర్వేషన్ వచ్చి తీరాలన్నదే తెలుగుదేశం పార్టీ విధానమన్నారు. మహిళలలో పోరాట పటిమ, ప్రతిభ ఉందని ఐరన్ లేడి ఇందిరాగాంధీ, శ్రీలంకలో సిరిమావో బండారు నాయకే, బ్రిటన్లో మార్గరేట్ థాచర్, అమెరికా ఉపాధ్యక్షురాలు కమల హ్యారిస్ వంటి నిరూపించారని చెప్పారు. దేశానికి రాష్ట్రపతిగా ద్రౌపతి ముర్ము ఉండడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆస్తిలో మహిళలకు సమాన హక్కును కల్పించి దేశంలోని మొట్టమొదటి పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ తరపున మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలను రావుల తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయనేత చిలువేరు గణేష్, రాష్ట్ర నాయకురాలు షకీలారెడ్డి, గడ్డి పద్మావతి, సూర్యదేవర లత, జాటోతు ఇందిరా, సాయి తులసీ అట్లూరి సుబ్బారావు, టీటీడీపీ మీడియా కో-ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర నాయకులు ఆజ్మీర రాజునాయక్, షేక్ ఆరీఫ్, అశోక్ గౌడ్, పద్మాచౌదరి, అంజలీ గౌడ్, ధనలక్ష్మీ, ఆశాబిందు, స్వప్న ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ తేల్చండి-హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎస్సీ కులస్తుడు కాదని చెప్పి ఆర్టీసీలో తొలగింపునకు గురైన కె.లక్ష్మీనారాయణ కులం ఏమిటో విచారణ చేయాలని వరంగల్ రూరల్ జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్సీ అయితే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీని ఆదేశించింది. లక్ష్మీనారాయణ 1993లో ఎస్సీ రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగంలో చేరారు. ఎస్సీ కాదనే ఆరోపణలు వాస్తవం కాదని పదేండ్ల నాడు అధికారులు తేల్చారు. తర్వాత మళ్లీ అదే తరహా ఫిర్యాదు ఆధారంగా నాలుగేళ్ల క్రితం మిధాని డిపోలో చేస్తున్న ఉద్యోగం నుంచి తీసేయడంతో హైకోర్టును ఆశ్రయించారు. చీఫ్‌జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీల డివిజన్ బెంచ్ విచారించి రెండు నెలల్లోగా తిరిగి విచారణ పూర్తిచేసి లక్ష్మీనారాయణ ఎస్సీ అవునో కాదో తేల్చాలని ఆదేశించింది.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలా?

- కేంద్రమంత్రి రవిశంకర్‌ప్రసాద్‌పై వీహెచ్ ఆగ్రహం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీలో నక్సలైట్ భావాలున్నాయంటూ కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మాజీ ఎంపీ వి హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని ఐక్యం చేసేందుకే కన్యకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఈడీ నోటీసులు అందజేసిన నేపథ్యంలో ఆ విషయంపై తాను స్పందించబోనని స్పష్టం చేశారు. టీడీపీ ఎంపీ సృజన చౌదరి లాంటి వారికి నోటీసులు ఇచ్చారనీ, ఆయన బీజేపీలో చేరగానే ఆకేసు ఏమైందో తెలియదన్నారు.రాజకీయాల కోసం బీజేపీ ఏమైనా చేస్తుందని ఎద్దేవా చేశారు.

జానపద వృత్తి కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మహిళలకు అన్ని రంగాల్లో ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలి

- దేవాలయాల్లో సంకీర్తనలు, భజనకు అవకాశం కల్పించాలి : జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి భాస్కర్



నవతెలంగాణ-కరీంనగర్

జానపద వృత్తి కళాకారులు అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో సంకీర్తనలు, భజనలకు వారికి అవకాశం కల్పించాలని జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ మహిళా కళాకారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కళాకారులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కొండూరి భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో జానపద కళాకారులకు సంకీర్తనలు, భజనలకు అవకాశం కల్పించాలని సంబంధిత శాఖ కమిషనర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాలయాల్లోని ఈవోలకు వినతి పత్రం ఇచ్చినా ప్రయోజనం శూన్యమని తెలిపారు. మరోవైపు మహిళలపై ఇటీవల తరచూ అఘాయిత్యాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు అని రంగాల్లో రాణించాలంటే ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి సంధ్య, కరీంనగర్ జిల్లా నాయకులు రేణుక, కవిత, రజిత, సింగర్ సరిత, కోలాట గురువులు, ఒగ్గు కళాకారులు, మిమిక్రీ ఆర్టిస్టులు, డాన్స్ మాస్టర్లు, భరతనాట్యం, కూచిపూడి, జానపద శాస్త్రీయ సంగీత నృత్య కళాకారులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతి ఆత్మహత్య కారకులను సస్పెండ్ చేయాలని..

- మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్‌లకు నిరసన సెగ



నవతెలంగాణ- హన్మకొండ

డాక్టర్ ప్రీతి ఆత్మహత్య ఘటనకు కారకులైన కేఎంసీ హెచ్‌ఓడీ నాగార్జున రెడ్డి, కేయూసీ ప్రిన్సిపాల్, ఎంజీఎం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని డాక్టర్ ప్రీతి న్యాయ పోరాట కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనపై జ్యూడీషియల్ విచారణ చేపట్టాలని హనుమకొండ హెూటల్ హరితలో బస చేసిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లను డాక్టర్ ప్రీతి న్యాయపోరాట కమిటీ అడ్డుకుంది. గంటసేపు ఇద్దరు మంత్రులను హెూటల్ నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. డాక్టర్ ప్రీతి కుటుంబం పట్ల ఎందుకు వివక్షత పాటిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా మంత్రులుగా ఉండి ముఖ్యంగా గిరిజన మంత్రిగా, మహిళగా మహిళలకు న్యాయం చేయనప్పుడు పదవుల్లో ఉండే అర్హత లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రీతి మృతి ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేపడుతుందని, ఇప్పటికే సైఫ్‌ను అరెస్టు చేసామని తెలిపారు. హెచ్‌ఓడీని కూడా వేరే జిల్లాకు బదిలీ చేసామన్నారు. విచారణ పూర్తయిన వెంటనే రిపోర్టును బట్టి ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఎర్రబెల్లి నిరసనకారులను ఉద్దేశించి మీరు రాజకీయం చేస్తున్నారని అనడంతో తాము రాజకీయ నాయకులం కాదని ప్రీతి కోసం న్యాయం కోసం పోరాడే ప్రజా సంఘాల నాయకులమని, వెంటనే మంత్రులు కూడా రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. దాంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని మంత్రులను సముదాయించి పంపించారు.

బిజినెస్

వృద్ధికి అధిక ధరల విఘాతం

- 30 ఏళ్ల కనిష్టానికి పొదుపు
- ద్రవ్యోల్బణంతో జనం జేబుకు చిల్లు



న్యూఢిల్లీ : అధిక ధరలపై భారతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముడి సరుకుల ధరలు పెరగడంతో తయారీ కంపెనీలు ఆ భారాలను ప్రజలపై నెట్టుతున్నాయి. ఇది ద్రవ్యోల్బణంపై మరింత ఒత్తిడి పెంచడంతో ఆ ప్రభావం అంతిమంగా వినిమయంపై పడుతోంది. హెచ్చు ధరలు వృద్ధికి విఘాతంగా మారాయని ఓ ఆంగ్ల పత్రిక కథనం ప్రచురించింది. మరోవైపు కుటుంబాల పొదుపు 30 ఏళ్ల కనిష్టానికి పడిపోయింది. ఆర్‌బిఐ పరపతి విధాన సమీక్షకు భిన్నంగా గడిచిన కొన్ని త్రైమాసికాల్లో వినిమయం కొంత తగ్గడం, పొదపు తగ్గడంతో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కరోనా తర్వాత ఆర్థిక వ్యవస్థ కొంత పుంజుకున్నప్పటికీ.. స్థూలంగా బలహీనంగానే ఉందని ఇటీవల నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. "దేశీయంగా వినియోగం తగ్గుదల స్పష్టంగా క్షీణిస్తోంది. పెట్టుబడుల వ్యయంలోనూ స్థబ్దత చోటు చేసుకుంటుంది. ఎగుమతులు తగ్గాయి." అని తెలిపింది.గడిచిన జనవరిలో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 6.5 శాతానికి ఎగిసింది. గతేడాది డిసెంబర్‌లో ఇది 5.72 శాతంగా, నవంబర్‌లో 5.88 శాతంగా నమోదయ్యింది. 2022-23 ప్రథమార్థం (హెచ్1)లో దేశంలో ద్రవ్యోల్బణం సగటున 7.2 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం రెండేళ్లలో ఈ సగటు 5.8 శాతంగా చోటు చేసుకుంది. అధిక ఇన్‌పుట్ ధరలు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాన్ని ఎదుర్కోవటానికి వివిధ రంగాలలోని కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారులపై నెట్టుతున్నాయి. దీంతో ముఖ్యంగా సమాజంలోని అట్టడుగు వర్గాల వినియోగం, పొదుపు స్థాయిలు దెబ్బతింటున్నాయి. "కరోనా తర్వాత దేశంలో వి-ఆకారపు వృద్ధి చోటు చేసుకోనుందనే అంచనాలు నిరుత్సాహంగా కనబడుతున్నాయి. కారణంగా దేశంలో పారిశ్రామిక వద్ధి నిరుత్సాహకరంగా ఉంటుంది. ఇది వేతన వృద్ధిపైనే ప్రభావం చూపుతుంది." అని ఇండియా రేటింగ్స్ పేర్కొంది. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (ఎంఒఎఫ్‌ఎస్‌ఎల్) విశ్లేషణ ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో కుటుంబాల పొదుపు 4 శాతానికి పడిపోయింది. 2021-22 ఇదే హెచ్1లో జీడిపిలో ప్రజల పొదుపు స్థాయి 7.3 శాతంగా, కరోనా కాలం 2020-21లోనూ 12 శాతంగా పొదుపు ఉంది. గడిచిన ఐదేళ్లలో జీడిపిలో పొదుపు 20 శాతం గా ఉంది. దీంతో పోల్చితే గడిచిన హెచ్1లో ఇది 15.7 శాతం తగ్గుద లను నమోదు చేసింది. అదే విధంగా పసిడి, ఆస్తులు తదితర భౌతిక రూపం పెట్టుబడుల పొదుపు తగ్గిపోయింది."దేశీయ వినియోగం డేటాలో చాలా కాలంగా బలహీనత స్పష్టంగా కనిపిస్తుంది. వ్యవసాయ రంగం ఒత్తిడిలోనే ఉంది. వ్యవసాయేతర వేతనాల్లో నిరంతర పతనం చోటు చేసుకుంటుంది. ద్విచక్ర వాహన విక్రయాలు తక్కువ వృద్ధిని కనబ ర్చాయి. వాస్తవ వ్యవసాయ ఎగుమతులు కూడా తగ్గాయి. స్థూలం గా గ్రామీణ, పట్టణ వినియోగంలో తగ్గుదల చోటు చేసుకుంది." అని ఎంఒఎఫ్‌ఎస్‌ఎల్ పేర్కొంది. నిరుద్యోగాన్ని నిర్మూలించడం, హెచ్చు ధరల ను కట్టడి చేయడం, వేతనాల్లో పెంపుదల తదితర చర్యల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో వృద్ధికి మద్దతును ఇవ్వొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

జీరోతో హీరో మోటో కార్ప్ ఒప్పందం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ హీరో మోటో కార్ప్ విద్యుత్ బైకుల తయారీ కోసం అమెరికాకు చెందిన జీరో మోటార్‌సైకిల్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ రెండు సంస్థలూ కలిసి ప్రీమియం ఇవి మోటార్ సైకిళ్లను తయారు చేయనున్నాయి. ఇవి బైకుల తయారీలో జీరో మోటార్ సైకిల్ హీరోకు సహకారం అందించనుంది. ప్రపంచలోనే అతిపెద్ద మోటార్ సైకిల్ తయారీ కంపెనీ జీరోతో ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందని హీరో మోటో ఛైర్మన్, సిఇఒ పవన్ ముంజల్ పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో జీరో మోటార్‌సైకిల్స్ సంస్థలో హీరో ఆటోమొబైల్స్ 60 మిలియన్ డాలర్ల మేరకు ఈక్విటీ పెట్టుబడి పెట్టింది.

టీఎస్ఆర్టీసీ నుంచి ఒలెక్ట్రాకు భారీ ఆర్డర్

- దశల వారిగా 550 విద్యుత్ బస్సుల పంపిణీ
- త్వరలోనే మొదటి ఆర్డర్ సరఫరా



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) నుంచి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్)కు 550 విద్యుత్ బస్సుల భారీ ఆర్డర్ లభించింది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)కు చెందిన ఒజీఎల్ 500 ఇంట్రాసిటీ, 50 ఇంటర్సిటీ బస్సులను సరఫరా చేయనుంది. ఈ ఆర్డర్ దక్షిణ భారతదేశంలోనే తమకు అతి పెద్దదని ఓజీఎల్ సిఎండి కెవి ప్రదీప్ తెలిపారు. "పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తాము మరిన్ని విద్యుత్ బస్సులను తీసుకురావాలని నిర్ణయించాము. వచ్చే రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 3,400 ఇవి బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చే యోచనలో ఉన్నాము." అని టీఎస్ఆర్టీసీ ఛైర్మన్, ఎంఎల్ఏ బాజీరెడ్డి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. "మార్చి 2025 నాటికి హైదరాబాద్ అంతటా విద్యుత్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సంస్థ భావిస్తోంది. తొలి దశలో 550 ఈ-బస్సులను గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిలో తీసుకుంటున్నాము. ఈ బస్సులు విడతల వారీగా అందుబాటులోకి వస్తాయి." అని టిఎస్ఆర్టిసి ఎండి విసి సజ్జనార్ తెలిపారు. "స్థిరమైన, ఆర్థికంగా బలమైన, పెద్ద ఎత్తున ప్రజా రవాణా చేసే టిఎస్ఆర్టిసితో కలిసి పనిచేసే అవకాశం మరోసారి వచ్చినందుకు మేము గర్విస్తున్నాము. ఈ బస్సులు నగరంలో ధ్వని, వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి ప్రయాణికులకు స్వచ్ఛమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తాయి" అని కెవి ప్రదీప్ వెల్లడించారు. టీఎస్ఆర్టీసీతో ఒలెక్ట్రా అనుబంధం 40 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్‌తో మార్చి 2019లోనే ప్రారంభమైందని ప్రదీప్ తెలిపారు. ప్రస్తుతం ఈ బస్సులు విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో సేవలందిస్తున్నాయన్నారు. నాలుగేళ్ల తర్వాత మరోసారి భారీ ఆర్డర్ దక్కిందన్నారు.

మాక్స్‌లైఫ్‌తో ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ జట్టు



హైదరాబాద్ : జీవిత బీమా సంస్థ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా ఆ బ్యాంక్ 73 లక్షల మంది ఖాతాదారులకు మాక్స్ లైఫ్ రిటైల్, సమూహ బీమా ఉత్పత్తులు లభించనున్నాయి. ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి దేశంలో 606 శాఖలతో విస్తరించి ఉంది. జీవిత బీమా ద్వారా భద్రత, ఆర్థిక కలయికతో మరింత మంది వినియోగదారులకి స్వాలంభన ఇచ్చే మా ప్రయాణంలోకి ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ని స్వాగతిస్తున్నామని మాక్స్ లైఫ్ ఎండీ ప్రశాంత్ త్రిపాఠి పేర్కొన్నారు.

మరో 125 నగరాలకు ఎయిర్‌టెల్ 5జి



న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కో భారతీ ఎయిర్‌టెల్ మరో 125 నగరాల్లో 5జీ సేవలను ప్రారంభించినట్టు ప్రకటించింది. దీంతో దేశంలో తమ ఈ సేవలు 265 నగరాలకు విస్తరించినట్లయ్యిందని వెల్లడించింది. నూతన 5జీ టెక్నలాజీతో హై-డెఫినిషన్ వీడియో స్ట్రీమింగ్ గేమింగ్, మల్టిపుల్ చాటింగ్, ఫోటోల ఇన్‌స్టంట్ అప్‌లోడ్ వంటి వాటికి సూపర్‌ఫాస్ట్ యాక్సెస్ అందిస్తుందని తెలిపింది. 5జీ ఇంటర్నెట్ నూతన శకానికి నాంది పలికిందని భారతీ ఎయిర్‌టెల్ సీటీఓ రణదీప్ సెఖోన్ పేర్కొన్నారు. మరిన్ని నగరాలకు తమ నూతన సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు.

రాష్ట్రంలో హెచ్‌డీఎఫ్‌సీ 25 శాఖలకు విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ గృహ రుణాల జారీ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ రాష్ట్రంలో 25 శాఖలకు విస్తరించినట్టు ప్రకటించింది. కొత్తగా కామారెడ్డిలో కార్యాలయం ప్రారంభించడం ద్వారా తెలంగాణలో తన ఉనికిని మరింత బలోపేతం చేసుకున్నట్లయ్యిందని పేర్కొంది. దీన్ని ఆ సంస్థ సీనియర్ అధికారుల సమక్షంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రీజినల్ బిజినెస్ హెడ్ రాజన్ టాండన్ ప్రారంభించారని తెలిపింది. ఈ కొత్త కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ కలల ఇంటిని సొంతం చేసుకోడానికి అత్యంత అనుకూలంగా ఉంటుందని తెలిపింది.